ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
కర్నూలు
: fb.com/vaartha Digital
Published from Kurnool, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
22-5-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 110 పేజీలు: 10+4 వెల: 6.50

కన్నడ రచయిత్రి భానుముస్తాక్‌కు బుకర్ ప్రైజ్

స్కూలు బస్సుపై ఉగ్రదాడి, నలుగురు మృతి 5లో

# 'మాడ్'లో భారీ ఎన్‌కౌంటర్

## అగ్రనేత నంబాల కేశవరావు సహా 27 మంది నక్సల్స్ హతం

## గణపతి రాజీనామా తర్వాత ఉద్యమ సారథిగా ఉన్న కేశవరావు.. అతడిపై కోటిన్నర రివార్డు

## కేశవరావు మృతిని స్వయంగా ప్రకటించిన అమిత్‌షా

## భారీగా ఆయుధాలు, మందుగుండు సామాగ్రి స్వాధీనం

## 2026 మార్చిలోగా మావోయిస్టుల అంతం తథ్యం: కేంద్ర హోంమంత్రి

## ఘటనలో డిఆర్జీ జవాన్ మృతి, పలువురికి గాయాలు



చర్ల, మే 21,ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌లో భాగంగా ఆపరేషన్ బ్లాక్ హిల్స్ చేపట్టి నేటికి నెలరోజులు కావస్తుంది. ఈ నెల రోజుల వ్యవధిలో వేల మంది బలగాలు బ్లాక్ హిల్స్ (కర్రెగుట్టల)ను చుట్టు ముట్టి భారీ ఆపరేషన్ చేపట్టింది ఈ క్రమంలో భారీగా ఆయుధాలు మందుగుండు సామాగ్రి ఇతర రాకెట్ లాంఛర్లను స్వాదీనం చేసుకొని మావోయిజానికి భారీ నష్టం చేకూర్చారు. కరిగుట్టల ఆపరేషన్ 36 మంది మావోయిస్టులు హతమైయ్యారు. అనుకోకుండా పహల్గా ఉగ్రదాడి నేపద్యంలో కేంద్రం ఆపరేషన్ సింధూర్ చేపట్టింది. అందులో భాగంగా కేంద్ర బలగాలను వెనక్కి పిలిపించింది. దీంతో ఆపరేషన్ బ్లాక్ హిల్స్ కొంత బ్రేక్ పడిందని సర్వత్రా భావించారు. అయితే సింధూర్ ఆగిపోవడంతో సెర్చ్ ఆపరేషన్ మరింత ఉధృతం చేసారు. ఈ క్రమాంలో భారీఆపరేషన్ చేపట్టారు భద్రతా బలగాలు. ఛత్తీస్‌ఘడ్ నారాయణ్ పూర్ జిల్లా ఓర్చా పోలీస్ స్టేషన్ పరిధిలోని మాడ్ అడవులలో పెద్ద ఎత్తున మావోల ఉన్నట్లు నిఘా వర్గాలకు సమాచారం అందటంతో మావోలే లక్ష్యంగా సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం భారీ ఎన్ కౌంటర్ జరిగింది. ఈ ఎన్ కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్రకమిటీ కార్యదర్శి >>2



మరణించిన కేశవరావు

### ఐదు దశాబ్దాల ఉద్యమ యాత్ర..

మాడ్ ఏరియాలో జరిగిన ఎన్ కౌంటర్‌లో మృతిచెందిన నంబాల కేశవరావు (70) ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం జియన్న గుడెం గ్రామంలో 1955లో జన్మించారు. ప్రాథమిక స్వగ్రామం లోనే సాగింది. తాతగారి ఊరైన టెక్కలి మండలం తలగాంలో హైస్కూల్ విద్య ఇంటర్ టెక్కలి జూనియర్ కళాశాలలో చదివారు. డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతుండగా వరంగల్ బిటెక్ సీటు రావడంతో అక్కడ (ఆర్ఈసి) రీజనల్ ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ చదువుతుండగా రాడికల్ విద్యార్థి సంఘం >>2

మావోయిజం మూలాలను చెరిపేస్తున్నాం: ప్రధాని మోడీ 2లో

మావోయిస్టుల నిర్మూలనలో కీలక మైలురాయి: అమిత్‌షా



బుధవారం 'యోగాంధ్ర' వెబ్ సైట్‌ను మంత్రి సత్యకుమార్‌తో కలిసి ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు

# నెలరోజులు 'యోగాంధ్ర'

## జూన్ 21న విశాఖ వేదికగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

## ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు 5 లక్షల మందితో కార్యక్రమం

## యోగాంధ్ర వెబ్‌సైట్‌ను ప్రారంభించిన సిఎం చంద్రబాబు

## రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్లమంది యోగాలో పాల్గొనేలా సంకల్పించామన్న సిఎం

విజయవాడ మే 21,ప్రభాతవార్తప్రతినిధి: ప్రపంచానికి భారతదేశం అందిస్తున్న గొప్ప వరం యోగా అని, యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని సిఎం చంద్రబాబు అన్నారు. యోగాకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చిన ఘనత ప్రధాని నరేంద్రమోడీకే దక్కుతుందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 21న విశాఖలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే కార్యక్రమానికి ప్రధాని మోడీ హాజరవుతారని చెప్పారు. నేటి నుంచి నెలరోజుల పాటు యోగాంధ్ర 2025 నిర్వహిస్తామన్నారు. జూన్ 21న ఆర్కే బీచ్‌నుంచి భోగాపురం వరకూ 5 లక్షల మందితో కార్యక్రమం జరుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సందర్భంగా యోగాంధ్ర వెబ్ సైట్‌ను సిఎం చంద్రబాబు ప్రారంభించారు.

**యోగాకు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఘనతే మోదీదే**

యోగాఅనేది మన దేశానికి వారసత్వంగా వస్తోంది. భారతీయ జీవన విధానంలో ఒక భాగం. దీనికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చిందిప్రధాని మోడీయే. ఒకప్పుడు ప్రపంచంలో ఎక్కడెక్కడి నుంచో వచ్చి మన దేశంలో చదువుకునేవారు. రానురాను విదేశీ దాడులతో అంతా కనుమరుగైంది. మళ్లీ ఇప్పుడు యోగా విలువ ప్రపంచానికి తెలిసేలా ప్రధాని మోడీ చేశారు. 2014 డిసెంబర్‌లో యునైటెడ్ నేషనన్ జనరల్ అసెంబ్లీ ఆమోదించి ప్రపంచమంతా యోగాదినోత్సవం జరపా >>2



అగ్నిప్రమాదానికి గురైన నిధిభవన్

# 'నిధిభవన్'లో అగ్ని ప్రమాదం

## ప్రాణభయంతో పరుగులు తీసిన ఉద్యోగులు

విజయవాడ,మే21,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్ర ఆర్థిక శాఖకు కీలకమైన మంగళగిరి శివారుల్లో నిధిభవన్‌లో బుధవారం ఉదయం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ భవనంలో ఖజానా, వర్క్ అకౌంట్స్, పే అండ్ అకౌంట్స్, స్టేట్ ఆడిట్, ఎపిసిఎఫ్ఎస్ఎస్, ఎంఎపిజిఎల్ఐ విభాగాలున్నాయి. ఐదంతస్తులున్న నిధి భవన్‌లోని రెండో అంతస్తులోని విద్యుద్ఘాతంతో క్షణాల్లో దట్టమైన పొగ వ్యాపించింది. అప్పటికే విధులకు వచ్చిన సుమారు 500 మంది ఉద్యోగులు ప్రాణభయంతో కిందకు పరుగులు తీశారు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సకాలంలో వచ్చి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. భవనం అద్దాలు పగలగొట్టి పొగ బయటకు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. నిధిభవన్‌లో ఫైర్ సేఫ్టీ >>2

# టీచర్ల బదలీలకు ఉత్తర్వుల జారీ

విజయవాడ, మే 21,ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులు బదిలీలకు కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు మంగళవారం అర్థరాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో ప్రధానోపాధ్యాయులు ఐదేళ్లు, ఉపాధ్యాయులు ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తయితే తప్పనిసరిగా బదిలీ కావలసిఉంటుందని ఇందులో పేర్కొంది. ఏపీలో ఉపాధ్యాయ బదిలీల నియంత్రణ నిబంధనలు 2025 నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వ యాజమాన్యంలోని ఫౌండేషన్, ప్రైమరీ స్కూళ్ల నుంచి హైస్కూల్ వరకు జెడ్పీ, మున్సిపల్ స్కూళ్లలోని ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి కొత్తగా మార్గదర్శకాలు ఇచ్చింది. గ్రేడ్ 2 హెడ్ మాస్టర్లు, స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్లు ఇతర కేడర్ బదిలీల్లో హేతుబద్ధీకరణ >>2

# అక్టోబర్ 1నుంచి మెట్రో పనులు

## వచ్చే ఏప్రిల్‌కు భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తి

## ఈ దసరాకు లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు: మంత్రి నారాయణ

విశాఖపట్నం, మే 21 ప్రభాతవార్త: మెట్రో రైల్ ప్రాజెక్ట్ అక్టోబర్ 1 నుండి ప్రారంభిస్తున్నామని, భోగాపురం ఎయిర్ పోర్ట్ వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి పూర్తి అయ్యేలా పూర్తిస్థాయి చర్యలు చేపట్టాలని అధికారులను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖమంత్రి పి.నారాయణ ఆదేశించారు. బుధవారం ఉదయం విఎంఆర్డీఏ కార్యాలయం తొమ్మిదవ ఫ్లోర్‌లో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ, రాష్ట్ర ఎంఎస్ఎంఇ. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, నగర మేయర్ పీలా శ్రీనివాస్, విఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్‌లతో కలసి నగర అభివృద్ధి, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధిపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు సమీక్ష సమావేశ అనంతరం నగర అభివృద్ధి, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధిపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశంలో చర్చించిన పలు అంశాలకు సంబంధించిన వివరాలను పత్రికా ప్రతినిధుల సమావేశంలో పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ భోగాపురం ఎయిర్ పోర్ట్ వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి పూర్తి అవుతుందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను అనుసంధానం చేస్తూ 22 రోడ్లు ప్రతిపాదించామని, వాటిలో 15 రోడ్లు పూర్తి అవుతున్నాయని తెలిపారు. మిగిలిన ఆరు రోడ్లుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. జాతీయ రహదారి సంస్థతో సమన్వయం చేసుకుని నూతన రోడ్లు నిర్మిస్తామని స్పష్టం చేశారు. టిడ్కో ఇల్లు 2014-2019 మధ్య 7లక్షల ఇళ్లు ప్రతిపాదించామని, గత ప్రభుత్వం 2 లక్షలు ఇల్లు కూడా పూర్తి చెయ్యలేక పోయిందని చెప్పారు. టిడ్కో ఇల్లు పూర్తి చేయాలిఅంటే సుమారు ఏడు వేల కోట్లు కావాలని, ఎంతటి ఖర్చయినా మహిళలకు టిడ్కో ఇల్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పించారన్నారు. ఈ దసరాకి లబ్ది దారులకు టిడ్కో ఇల్లు అందిస్తామని తెలిపారు. ప్రతి ఇంటికి మంచి నీరిచ్చేలా 2021లో అమృత పథకం కోసం కేంద్రం నిధులిస్తే, గత ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వలేనందున ఆ నిధులు వెనక్కి వెళ్లి పోయాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రంతో మాట్లాడి మళ్ళీ నిధులు వచ్చేలా చేశారని, 834 కోట్ల పనులు అమృత్ పథక కోసం నిర్దేశించామని చెప్పారు. విశాఖ మెట్రో కు సంబంధించి అక్టోబర్ నెలలో పనులు మొదలుపెడతామని స్పష్టం చేశారు. డబుల్ డెక్కర్ మెట్రో కింద డిపిఆర్ ఇచ్చామని తెలిపారు. కోటి మంది ప్రజానీకం ఉన్న హైదరాబాద్ కు రింగ్ రోడ్డు ఉంది. అదే తరహాలో విశాఖలో సెమీ రింగ్ రోడ్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. విఎంఆర్డిఏ ఇన్ఫ్రాస్ట్రక్చర్, విఎమ్ఆర్డిఏ అండ్ వి కె పిసిపిఐఆర్‌యుడిఎ విశాఖపట్నం కాకినాడ పెట్రోలియం, కెమికల్స్ అండ్ పెట్రో కెమికల్స్ ఇన్వెస్ట్మెంట్ రీజన్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ మెట్రోపాలిటన్ జర్నిడిక్షన్ మ్యాప్, రీ విజిటింగ్ మాస్టర్ ప్లాన్ 2041 సంబంధించి అంశాలు , ఎక్స్టెండెడ్ ఏరియా కీలక అంశాలు, ప్రతిపాదిత వి.ఎం.ఆర్.డి.ఏ కొత్త లేఔట్స్ అంశాలు, మాస్టర్ ప్లాన్ ప్రయారిటీ రోడ్స్, తీర ప్రాంత కోత ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలు, కైలాసగిరి ,ఋషికొండ సమగ్ర అభివృద్ధి, వాల్యూ క్యాప్చర్ ఫైనాన్స్ ద్వారా భోగాపురం నుండి రాంబిల్లి వరకు ఇంప్లిమెంటేషన్ ఆఫ్ 4/6/8 రోడ్డు లెన్స్ యాక్సిస్ సెమీ రింగ్ రోడ్డు అంశాలుపై చర్చించడం జరిగిందని మంత్రి తెలిపారు.



## ప్రజా సమస్యలపై డి.సిఎం పవన్ వినూత్న కార్యక్రమం

# 'మన ఊరు మాటా మంతి'

విజయవాడ,మే21,ప్రభాతవార్తప్రతినిధి: ప్రజా సమస్యల పరిష్కారానికి ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ 'మన ఊరు మాటా మంతి' పేరిట ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాన్ని ఈ నెల 22 నుంచి ప్రారంభించనున్నారు. ఆయన నేరుగా వెండితెర మీద కనబడుతూ ప్రజల సమస్యలు వింటారు. ఇందుకు శ్రీకాకుళం జిల్లా టెక్కలిలోని భవానీ థియేటర్ వేదిక కానుంది. ఇందుకోసం టెక్కలి సమీపంలోని రావివలస నుంచి 300 మంది ప్రజలను గురువారం ఉదయం 9 గంటలకు థియేటర్‌కు తీసుకెళ్లనున్నారు.

**పవన్‌కల్యాణ్ వినూత్న కార్యక్రమం :**

మంగళగిరిలోని క్యాంప్ కార్యాలయం నుంచి పవన్ కల్యాణ్ ప్రత్యక్ష ప్రసారం ద్వారా వారితో మాట్లాడతారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలివ్వనున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అమలుచేస్తున్న వివిధ అభివృద్ధి పనులపైనా అభిప్రాయాలు తెలుసుకుంటారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ దశల వారీగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించ >>2

# కార్యకర్తల బాధ్యత నాది..

## పార్టీకోసం కష్టపడిన వారి ఇంటి పెద్ద కొడుకులా ఉంటా

## ఇక కార్యకర్తలను నేరుగా కలుసుకుంటా: మంత్రి లోకేష్



బుధవారం టిడిపి అధ్యక్షుడు వెన్నా బాలకోటిరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి మంత్రి లోకేష్

విజయవాడ,మే21,ప్రభాతవార్తప్రతినిధి: తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం అని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తల బాధ్యత తాను తీసుకుంటానని, ఇంటికి పెద్దకొడుకులా అండగా ఉంటానని పునరుద్ఘాటించారు. కార్యకర్తల సంక్షేమం కోసం అహర్నిశలు కృషిచేస్తున్న మంత్రి నారా లోకేష్.. తన నియోజకవర్గ పర్యటనలో ముందుగా కార్యకర్తల సమావేశమై వారిసమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. ఇకపై ఉండవల్లి నివాసంలో కార్యకర్తలను నేరుగా కలుసుకుని వారికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్సీ గూండాల చేతిలో హత్యకు గురైన పల్నాడు జిల్లా రొంపిచర్ల మండల టిడిపి అధ్యక్షుడు, మాజీ ఎంపిపి వెన్నా బాలకోటిరెడ్డి కుటుంబ సభ్యులను ఉండవల్లి నివాసానికి పిలిపించుకుని వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

కార్యకర్తే అధినేత హామీని నిలబెట్టుకుంటున్న మంత్రి లోకేష్ అలవాల గ్రామానికి చెందిన వెన్నా బాలకోటిరెడ్డి నాలుగు దశాబ్దాలుగా పార్టీ పటిష్టత, ప్రజా సంక్షేమ కోసం పనిచేశారు. దీనిని ఓర్వలేని వైఎస్సార్సీ గూండాలు అప్పటి వైఎస్సార్సీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అండతో ఇంట్లో నిద్రిస్తున్న వెన్నా బాలకోటిరెడ్డిని తుపాకీతోకాల్చి చంపారు. హత్యకు ఆరునెలల ముందు కత్తులతో దాడికి యత్నించగా ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. రక్షణ కోసం పోలీసులకు పలుమార్లు ఫిర్యాదుచేసినప్పటికీ పట్టించుకోలేదు. >>2



బుధవారం కర్ణాటక సిం సిద్దరామయ్య, డిప్యూటీ సిఎం డికె శివకుమార్‌లు ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌కు కుంకి ఏనుగుల అప్పగింత పత్రాలను అందజేస్తున్న దృశ్యం

## పంటలను ధ్వంసం చేసే ఏనుగులపై


# 'కుంకీ' అంకుశం

### ఏనుగుల అప్పగింత పత్రాలను ఎపి డి. సిఎం పవన్‌కు అందజేసిన కర్ణాటక సిఎం సిద్దరామయ్య, డి.సిఎం శివకుమార్

### బెంగళూరు విధాన సౌధలో అట్టహాసంగా కార్యక్రమం

### ఆరు కుంకీ ఏనుగులు ఎపికి అప్పగింత

విజయవాడ,మే21,ప్రభాతవార్తప్రతినిధి: ఎపికి ఎట్టకేలకు సుదీర్ఘ సంప్రదింపులు అనంతరం కర్ణాటక ప్రభుత్వం కుంకీ ఏనుగులను అప్పగించింది. రాష్ట్రంలో జనావాసాల్లోకి వచ్చేసి పెద్ద ఎత్తున పంటల విధ్వంసంతో పాటు ప్రాణ, ఆస్తినష్టం కలిగిస్తున్న గజరాజుల గుంపును అటవీ ప్రాంతా >>2



బుధవారం విశాఖలో ఆమరణ దీక్ష ప్రారంభించిన పిసిసి అధ్యక్షురాలు షర్మిల

# కార్మికులకోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధం

## ఆమరణ దీక్షకు దిగిన పిసిసి అధ్యక్షురాలు షర్మిల

## విశాఖ ఉక్కును కాంగ్రెస్ పార్టీ కాపాడుతుందని భరోసా

విశాఖపట్నం (గాజువాక),మే 21,ప్రభాతవార్త: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చేస్తున్న దీక్షా శిబిరాన్ని బుధవారం పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సందర్శించి ఉక్కు దీక్షకు సంఘీభావాన్ని ప్రకటించి ఆమరణ దీక్ష చేపట్టారు. ఈ సందర్బంగా వైఎస్ షర్మిల మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా ఏర్పడిన విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను కార్పోరేట్ సంస్థలకు కట్టబెట్టాలనేఉద్దేశ్యంతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయివేటీకరణ అంశాన్ని తెరపైకి తెచ్చిందని ఆరోపించారు. నిమిషానికో ప్రకటనతో ప్రస్తుత పాలకులు ప్రకటనలు చేస్తూ కార్మికులను మోసం చేస్తున్నారని విమర్శించారు. గత ఆరు నెలలకాలంలో పెద్ద సంఖ్యలో కాంట్రాక్టు కార్మికులను తొలగించారని, విఆర్ఎస్ పేరుతో చాలామందిని ఇంటికి పంపుతున్నారని ఆరోపించారు. ప్లాంట్‌ను కాపాడి తీరుతానని >>2



బుధవారం పలమనేరు చేరుకున్న 'కుంకీ' ఏనుగులు



బుధవారం రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా న్యూఢిల్లీలో నివాళులర్పిస్తున్న రాహుల్ గాంధీ

# పలమనేరు చేరుకున్న కుంకీ ఏనుగులు

**పలమనేరు,మే 21,ప్రభాతవార్త:** కర్ణాటక రాష్ట్రం నుండి 4 కుంకీ ఏనుగులు బుధవారం రాత్రి చిత్తూరు జిల్లా పలమనేరుకు చేరుకున్నాయి. కర్ణాటక రాష్ట్ర బెంగళూరు విధానసౌధా నందు బుధవారం కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఏపి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో 6 కుంకీ ఏనుగులను మన రాష్ట్రానికి ఇవ్వడం జరిగింది.అందులో 4 ఏనుగులను పలమనేరు మండలంలోని ముసలమడుగు వద్ద నూతనంగా నిర్మించిన కుంకీఏనుగుల శిబిరానికి చేరుకున్నాయి.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగా పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి నియోజకవర్గంలో ప్రధాన సమస్య అటవీ ప్రాంత రైతులకు ఏనుగులవలన ఎదురౌతున్న సమస్యలపై ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రితో ప్రస్తావిస్తూ పలమనేరు మండలంలో ఏనుగుల నియంత్రణకు కుంకీ ఏనుగుల అవసరం ఉందని, కుంకీ ఏనుగుల నిర్వహణకు ముసలమడుగు వద్ద 50 ఎకరాల అనువైన స్థలంఉందని, కుంకీ ఏనుగుల ఏర్పాటుతో పాటు ఆ ప్రాంతం పర్యాటక ప్రాంతంగా సైతం అభివృద్ధి చేపట్టవచ్చని తెలపడంతో ఉపముఖ్యమంత్రి మరియు అటవీశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ తక్షణం నిధులను ఆమోదించడంతో పాటు కర్ణాటక రాష్ట్రం నుండి శిక్షణ పొందిన కుంకీ ఏనుగులను పలమనేరు తీసుకువస్తామని హామీ ఇవ్వడం జరిగింది.ఈ క్రమంలో గత 3 నెలలుగా ముసలమడుగు వద్ద 50 ఎకరాలలో కుంకీ ఏనుగుల నిర్వహణకు అన్ని రకాల ఏర్పాట్లను పలమనేరు ఎఫ్ఆర్ఓ నారాయణ చేపట్టారు.ఎప్పటికప్పుడు స్థానిక ఎమ్మెల్యే సూచనలు సలహాలతో అభివృద్ధి పనులను ఆయన చేపట్టారు.ఈ క్రమంలో మొట్టమొదట పలమనేరులో కుంకీ ఏనుగుల నిర్వహణ శిబిరంమరియు పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి దిశగా చర్యలు చేపట్టారు.



బుధవారం కుప్పంలో తిరుపతి గంగమ్మ అమ్మవారిని దర్శించుకున్న సిఎం చంద్రబాబు దంపతులు

# ‘కుంకీ’ అంకుశం

>> ల్లోకి తరిమికొట్ట గలిగే కుంకీ ఏనుగులు రానున్నాయి. బుధవారం ఎపికి కర్ణాటక కుంకీ ఏనుగులను అప్పగించింది. బెంగళూరులోని విధానసౌధలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య,ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్,కర్ణాటక అటవీశాఖా మంత్రి ఈశ్వర్ ఖండ్రే చేతుల మీదుగా వీటి అప్పగింత కార్యక్రమం జరిగింది. ఇందుకు సంబంధించి అప్పగింత ధృవీకరణ కీలక డాక్యుమెంట్లుతో కూడిన బ్యాగ్‌ను కర్ణాటక సిఎం సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్‌లు పవన్ కల్యాణ్‌కు అందించారు.ఈ అప్పగింత ప్రకారం ఆరు కుంకీ ఏనుగులను ఎపికివస్తున్నాయి. ఎపిసరిహద్దుల్లోను, పలు జిల్లాల్లో, గజరాజులు చేస్తున్న పంటపొలాల ధ్వంసాన్ని ఇవి కట్టడి చేయనున్నాయి.

ఈ సందర్భంగా కుంకీ ఏనుగుల అప్పగింత ఒప్పందం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల మధ్య పరస్పర సహకారానికి ఓ కీలక ముందడుగని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. పొరుగు రాష్ట్రాలనడుమ రాజకీయాలకతీతంగా సత్సంబంధాలు ఉండాలన్నారు,ఈ విషయంలో కర్ణాటక ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం బాగుందన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల మధ్య సహకారం ఇలాగే కొనసాగాలని ఆకాక్షించారు. ఏపీలో కుంకీ ఏనుగుల సంరక్షణకు ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశామని పవన్ వెల్లడించారు. కుంకీ ఏనుగుల రక్షణను తాను స్వయంగా పర్యవేక్షిస్తానని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. ఎపి, కర్ణాటక మధ్య 9 ఒప్పందాలు కుదుర్చుకున్నామని తెలిపారు. కుంకీ ఏనుగులు కావాలని స్థానిక ప్రజలు 21 సంవత్సరాలుగా అడుగుతున్నారని చెప్పారు. స్థానిక గజరాజుల వల్ల గ్రామాలు, పంటలు ధ్వంసం కాకుండా కుంకీ ఏనుగులు రక్షిస్తాయని పవన్ పేర్కొన్నారు. జనావాసాల్లోకి వచ్చేసి పెద్ద ఎత్తున పంటల విధ్వంసం, ప్రాణ, ఆస్తినష్టం కలిగిస్తున్న ఏనుగుల గుంపును అటవీ ప్రాంతాల్లోకి తరిమికొట్ట గలిగేవి కుంకీ ఏనుగులు. అటవీ ఏనుగులను మచ్చిక చేసుకోవడం, తరిమేయడం, మదమెక్కి ఉన్నవాటిని శాంతింపజేయడం ఇలా అన్ని రకాలుగా ఉపయోగపడే కుంకీ ఏనుగులను పట్టుకోవడం మొదలు వాటి శిక్షణ, ఆపరేషన్లలో వినియోగం వరకూ ప్రతి దశ ఆసక్తికరమే. అడవిలో తిరిగే గజరాజుల గుంపు నుంచి వేరుపడి ఒంటరైన, కొన్ని ప్రత్యేక లక్షణాలున్న ఏనుగులను గుర్తించి వాటిని బంధిస్తారు. ఇందుకోసం తక్కువ వయసున్న, మగ ఏనుగులనే ఎంపిక చేసుకుంటారు. పట్టుకున్నవాటికి శిక్షణ అందిస్తారు. వాటిని గుర్తించేందుకు ప్రత్యేక పేర్లు పెడతారు. కేరళ, తమిళనాడు, కర్ణాటక,రాష్ట్రాల్లో కుంకీ ఏనుగుల శిక్షణ కేంద్రాలున్నాయి.ఈ కార్యక్రమంలో కర్ణాటక సిఎం సిద్దరామయ్య మాట్లాడుతూ ఎపి,కర్ణాటకల నడుమ పరస్పర సహకారంతో పరిష్కరించుకునే సమస్యలున్నాయన్నారు. వీటిని పరిష్కరించుకుందామన్నారు.

# భారీ ఎన్‌కౌంటర్

>> నంబాల కేశవరావు అలియాస్ బసవరాజుతో సహా 27మంది మావోయిస్టులు మృతిచెందారు. మృతిచెందిన కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు కోటిన్నర రివార్డు కలిగి ఉన్నాడు. మృతుల్లో వివిధ కేడర్‌లకు చెందిన అగ్రనాయకులు మరికొందరు ఉండే అవకాశం ఉందని ఊహగానాలు వినిపిస్తున్నాయి. మృతుల వివరాలను పోలీసులు వెల్లడిస్తే వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. కాగా ఎదురు కాల్పుల్లో డిఆర్జీ జవాన్ మృతి చెందగా మరి కొంత మంది జవాన్లలకు గాయాలైనట్లు తెలిసింది.వీరిని హుటాహుటిన నారాయణ్ పూర్ జిల్లా వైద్యశాలకు తరలించి చికిత్స అంద చేస్తున్నారు.ఈ ఉదయం నుండి జరిగిన ఎన్‌కౌంటర్‌లో సంఘటనా ప్రాంతం నుండి మృత దేహాలతో పాటు పెద్ద మొత్తంలో ఆయుదాలు, పేలుడు పదార్థాలు, నిత్యావసర సరుకులను భద్రతా బలగాలు స్వాదీనం చేసుకున్నాయి.సెర్చ్ ఆపరేషన్‌లో బీజాపూర్ దంతెవాడ జిల్లాలకు చెందిన డిఆర్జీ ఎస్టీఎఫ్ సిఆర్పీఎఫ్ బలగాలు పాల్గొన్నారని పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. ఆపరేషన్ కగార్ చేపట్టిన దగ్గర నుండి నేటి వరకు జరిగిన వివిధ ఎన్ కౌంటర్లలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు పొలిట్ బ్యూరో సభ్యులు మృతి చెందినప్పటికీ కేంద్ర కమిటీ కార్యదర్శిని హతమార్చడం మావో ఉద్యమంపై పట్టు సాధించినట్లైంది.ఈ ఎన్‌కౌంటర్ ఘటన దేశ వ్యాపితంగా సంచలనం సృష్టించింది. 2026 మార్చి 31 నాటికి దేశంలో మావోయిజాన్ని నిర్మూలిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. దేశ వ్యాపితంగా లక్షల మంది భద్రతా బలగాలను మొహరించి మావోయిస్టుల కొరకు కూంబింగ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో జరిగిన నారాయణ్ పూర్ ఎన్‌కౌంటర్ మావోయిస్టు ఉద్యమానికి కోలుకోని దెబ్బగా చెప్పవచ్చు.మరోవైపు మావోయిస్టు కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ ప్రభుత్వంతో చర్చలకు సిద్ధమని ఇప్పటికే రెండు ధఫాలుగా లేఖ విడుదల చేసారు.అదే విధంగా దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి బూపేష్ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిది జగన్ చర్చలకు ఆరు నెలలపాటు కాల్పులకు సిద్ధం అని ప్రకటించిన నేపథ్యంలో మావోలతో ఎటువంటి చర్చలు జరిపేది లేదని ఆయుధాలు వీడి లొంగిపోవాలని చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి హోంశాఖ మంత్రి విజయ్ శర్మలు పలుమార్లు స్పష్టం చేసిన విషయం తెలిసిందే.ఈ క్రమంలో భారీ ఎన్‌కౌంటర్ జరగడం అందులో కేంద్ర కమిటీ కార్యదర్శి చనిపోవడంతో మావోయిస్టుల్లో మరింత అలజడి నెలకొంది.

## మావోయిజం మూలాలను చెరిపేస్తున్నాం: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, మే 21:** ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లాలో బుధవారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో 27 మంది మావోయిస్టులు మృతిచెందారు. ఈ ఎన్‌కౌంటర్‌పై ప్రధాని నరేంద్రమోడీ ఎక్స్‌వేదికగా స్పందించారు. ఆపరేషన్‌లో పాల్గొన్న భద్రతా బలగాలను ప్రశంసించారు. మీ అద్భుత విజయాన్ని చూసి గర్విస్తున్నా అని మావోయిజం ముప్పును నిర్మూలించి ప్రజలకు శాంతి పురోగతితోకూడిన జీవితం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని అన్నారు. మావోయిజం మూలాలను చెరిపేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఎదురుకాల్పుల్లో మావోయిస్టు అగ్రనేత సంబాల కేశవరావు(70) అలియాస్ బసవరాజు మృతిచెందినట్లు ఎక్స్‌వేదికగా హోంమంత్రి అమిత్‌షాప్రకటించిన సంగతి తెలిసిందే. నక్సలిజం నిర్మూలనలో ఇదొక మైలురాయి. 2026 మార్చి31నాటికి నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మోడీ సర్కారు ధృఢసంకల్పంతో ఉందని పోస్టులో వెల్లడించారు. మాఢ్ ప్రాంతంలో పెద్ద ఎత్తున మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం రావడంతో భద్రతా బలగాలు ఆపరేషన్‌చేపట్టాయి. ఈ ఆపరేషన్‌లో బీజాపూర్, నారాయణపూర్, దంతెవాడ, డిఆర్జీ బలగాలు పాల్గొన్నాయి.ఇటీవల ఛత్తీస్‌గఢ్ తెలంగాణ సరిహద్దుల్లోని కరెగుట్ట పర్వతాల్లో 24 రోజులపాటు జరిగిన ఆపరేషన్‌లో 31 మంది మావోయిస్టులు మరణించారు. వీరిలో 16మంది మహిళలు కూడా ఉన్నారు.

## మావోయిస్టుల నిర్మూలనలో కీలక మైలురాయి: అమిత్‌షా

**న్యూఢిల్లీ, మే 21:** ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. ఎన్‌కౌంటర్‌లో నంబాల కేశవరావు మృతి చెందాడంటూ అమిత్ షా ట్వీట్ చేశారు. మావోలపై మూడు దశాబ్దాల పోరాటంలో ప్రధానకార్యదర్శి స్థాయినేత చనిపోవడం ఇదే ప్రథమమన్నారు. ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టుల మృతి చెందారని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ట్విట్టర్‌లో తెలియజేశారు. నక్సలిజాన్ని నిర్మూలించే పోరాటంలో ఒకమైలురాయి విజయం. ఈరోజు, ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్‌లో జరిగిన ఆపరేషన్‌లో మనభద్రతాదళాలు 27 మంది మావోయిస్టులను మట్టుబెట్టాయి. సిపిఐ మావోయిస్ట్ ప్రధాన కార్యదర్శి, అగ్రనాయకుడు నక్సల్ ఉద్యమానికి వెన్నెముక అయిన నంబాల కేశవ్‌రావు అలియాస్ బసవరాజుఉన్నారు. నక్సలిజంపై భారత్‌చేసిన మూడు దశాబ్దాల పోరాటంలో ప్రధాన కార్యదర్శి హోదా కలిగిన నాయకుడిని మన దళాలు మట్టుబెట్టడం ఇదే మొదటిసారి. మావోయిస్టులను హతమార్చిన మన ధైర్యవంతులైన భద్రతా దళాలు, ఏజెన్సీలను అభినందిస్తున్నాను. ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్ పూర్తయిన తర్వాత 54మంది నక్సలైట్లను అరెస్టు, 8మంది నక్సలైట్లులొంగిపోయారని తెలియజేయడం సంతోషంగా ఉంది. మార్చి 31, 2026లోపు నక్సలిజాన్ని నిర్మూలించాలని మోదీ ప్రభుత్వం సంకల్పించింది అంటూ అమిత్ షా ట్వీట్ చేశారు.

## ఐదు దశాబ్దాల ఉద్యమ యాత్ర..

>> వైపు అడుగులు వేసారు.ఈయన తండ్రి వాసుదేవరావు ఉపాధ్యాయుడు కాగా ఇతనికి ఓ సోదరుడు ముగ్గురు అక్కా చెల్లిళ్లు ఉన్నారు.నలభై మూడేళ్ల ఉద్యమంలో ఏనాడు ఇంటికి వచ్చిన దాఖలాలు లేవని చెప్పవచ్చును. యుక్త వయస్సు నుండే విప్లవ భావాలు గల కేశవరావు శ్రీకాకుళంలో గిరిజన రైతాంగ సాయుధ పోరాటం ద్వారా పోరుబాట పట్టారు.1974లో వరంగల్ నీట్ లో ఇంజనీరింగ్ విద్యను ముగించారు.1975 లో పీపుల్స్ వార్ పార్టీలో చేరి తన ఉద్యమ ప్రస్థానాన్ని ప్రారంభించారు.1980 సంవత్సరంలో జరిగిన విద్యార్థుల ఘర్షణలో కేశవరావు పేరు ప్రముఖంగా వినపడింది.గెరిల్లా పోరాటాలు అత్యాధునిక పేలుడు పదార్దాల వినియోగంలో సిద్దహస్తుడిగా పేరుంది. ఆయుధ శిక్షణలోనూ దిట్టగా పేరుగాంచారు.1990 నుండి 2018 వరకు దాదాపు 30 సంవత్సరాల పాటు మావోయిస్టు పార్టీ మిలటరీ మిషన్ కు నేతృత్వం వహించారు.

2018 లో మావోయిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శి పదవి నుండి గణపతి తప్పుకోవడంతో కేశవరావు కేంద్ర కార్యదర్శిగా బాద్యతలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ ఒడిషా ఛత్తీస్‌ఘడ్ ఆంధ్ర తెలంగాణా రాష్ట్రాలపై ఆయనకు గట్టి పట్టుంది. 2003 లో ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై అలిపిరిలో బాంబులు పేల్చిన సంఘటనతో పాటు ఛత్తీస్‌ఘడ్ ప్రతిపక్షనేత కాంగ్రెస్ నాయకులు సల్వాజుడుం సృష్టికర్త మహేంద్రకర్మ నవీన్ పటేల్ ఆంధ్రప్రదేశ్ మాజీ ఎంఎల్ ఏ లు కిడారి సర్వేశ్వరావు సోము బలిమెల సంఘటన 2010 లో ఛత్తీస్‌ఘడ్ లో 76 మంది సి ఆర్ పి ఎఫ్ జవాన్ల ఊచకోతలో కేశవరావు కీలకంగా వ్యవహరించారని సమాచారం. ఇతని పై దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాలలో 35 కు పైగా కేసులు నమోదయ్యాయి.

# నెలరోజులు ‘యోగాంధ్ర’

>> లని నిర్ణయించింది. యోగా అనేది ఒక ప్రాంతానికో, ఒక మతానికో సంబంధించినది కాదు. ప్రపంచంలో అన్ని దేశాల్లో, మన దేశంలోని అన్ని ప్రాంతాల్లో జరుపుకునే కార్యక్రమం. మనిషి జీవితంలో మెరుగైన జీవన ప్రమాణాలకు నాంది యోగా. నేటి ఆధునిక యుగంలో అందరూ పరుగులు పెడుతున్నారు. టెక్నాలజీతో ఒత్తిడికి గురవుతున్నారు. ప్రతి దానికీ టెన్షన్ పడుతున్నారు. లైఫ్ మెకానికల్‌గా మారుతోంది. వీటన్నంటిని నుంచి ఉపశమనం రావాలంటే యోగా ఒక్కటే మార్గం. ప్రధాని మోడీ దీక్షతో, పట్టుదలతో ఈ కార్యక్రమం చేస్తున్నారు కాబట్టి మనవంతుగా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

**ఎపి చరిత్రలో నూతన అధ్యయనం**

రికార్డు సృష్టించేలా నేటి నుంచి నెలరోజుల పాటు యోగాంధ్ర2025 నిర్వహిస్తాం. ఫోటోల కోసమో, ఈవెంట్ల కోసమే చేసే కార్యక్రమం కాదు. నెల మొత్తం పలు కార్యక్రమాలు నిర్వహించి యోగాపై ప్రతి ఒక్కరిలో చైతన్యం తీసుకురావాలని నిర్ణయించాం. విశాఖ ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు 5 లక్షల మందితో ఉదయం 7 నుంచి 8 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తాం. అదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్లమందికి తగ్గకుండా కార్యక్రమంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నాం. 10 లక్షలమందితో యోగా కోర్సులు చేయించి వారికి సర్టిఫికెట్లు కూడా అందజేయాలని నిర్ణయించాం. సముద్రం పక్కన ఇలాంటి యోగా నిర్వహించడం అరుదైన విషయం. సముద్ర తీరాన, ప్రకృతి ఒడిలో జరిగే ఈ కార్యక్రమం ఎప్పటికీ గుర్తుండిపోతుంది.యోగాపై ప్రజల్లో చైతన్యం తీసుకొస్తాం. జూన్ 21న యోగా దినోత్సవానికి ప్రధాని మోడీ హాజరవుతున్నందున మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని మంత్రుల బృందం దిశానిర్దేశం చేస్తుంది. పలు యూనివర్సిటీలు, పబ్లిక్, ప్రైవేటు సంస్థల్లోని వాలంటీర్లు, మహిళలు, వృద్ధులు, పోలీసులు, ఉద్యోగులు యోగా దినోత్సవంలో భాగస్వాములు కావాలి. అలాంటివారికి ధ్రువపత్రాలు కూడా అందజేస్తాం. పట్టణాలు, నగరాల నుంచి గ్రామస్థాయి వరకూ యోగాభ్యాసన కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మన రాష్ట్రంలో రూ. 5 కోట్ల కంటే ఎక్కువ ఆదాయం వచ్చే ఆలయాలు 21 ఉన్నాయి. అమరావతి బుద్ధ స్థూపం, లేపాక్షి శిల్పారామం, గండికోట, అరకు, లంబసింగి, కోనసీమ, అఖండ గోదావరి ఇలా 100 పర్యాటక, ఆధ్యాత్మిక ప్రదేశాల్లో యోగా ప్రాముఖ్యతను వివరించే ఏర్పాట్లు చేశాం. ప్రధాని మోడీ ప్రపంచమంతా యోగాను ప్రమోట్ చేస్తున్నప్పుడు మనకూ బాధ్యత ఉంటుంది కదా. ఎలక్ట్రానిక్, ప్రింట్, సోషల్ మీడియా కూడా చొరవ తీసుకుని యోగాను ప్రమోట్ చేయాలి. మంచి కంటెంట్‌తో ఆర్టికల్స్ రాయాలి. మంచి వీడియోస్ తయారుచేయాలి. మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగాతో అసోసియేట్ చేసుకుని 2వేలమంది యోగా శిక్షకులను తయారుచేస్తాం. పాఠశాలలో రెండు వేల మందినితయారుచేస్తాం. యోగా ప్రాముఖ్యత తెలిపేలా స్కూల్ సిలబస్‌లో పెడతాం. స్కూళ్లు మొదలవగానే గంట సేపు విద్యార్థులకు యోగా శిక్షణ ఇప్పిస్తాం. యోగా గురించి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన వాలంటీర్లకు జూన్ 21న ప్రధాని సభలో పాల్గొనే అవకాశం కల్పిస్తాం.

# ‘మన ఊరు మాటా మంతి’

>> నున్నారు.

**గ్రామాల ప్రజలతో వీడియో కాన్ఫరెన్సు :**

గ్రామీణ ప్రజలతో నేరుగా మాట్లాడేందుకు స్థానిక సినిమా థియేటర్లు వాడుకోవాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్థానిక ప్రజలతో మాట్లాడేందుకు డిప్యూటీ సిఎం వినూత్న ఆలోచన చేస్తున్నారు. పబ్లిక్ ప్రైవేట్ పంచాయితీ పార్టనర్ షిప్‌తో గ్రామీణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టారు. మొదటి దశలో రాష్ట్రంలో కొన్ని గ్రామాల ప్రజలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించనున్నారు. గ్రామంలో తాగునీరు ఆసుపత్రి, విద్య, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై చర్చించాలని నిర్ణయించారు.

‘మన ఊరు మాటా మంతి’ పేరిట మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ప్రజలతో మమేకం కావాలని నిర్ణయం తీసుకున్నారు. గ్రామాల ప్రజలతో దగ్గరగా ఉన్న సినీ థియేటర్‌లో వీడియో కాన్ఫరెన్సులో సమావేశం అవ్వనున్నారు. 175 నియోజకవర్గాల్లో గ్రామాల ప్రజలతో ఇదే తరహాలో మాట్లాడాలని పవన్ భావిస్తున్నారు.

# ఉత్తర్వుల జారీ

>> కోసం మార్గదర్శకాలతో కూడిన నోటిఫికేషన్ జారీచేసింది. ప్రతీ విద్యా సంవత్సరంలో మే 31 తేదీ నాటికి సదరు పాఠశాలలో 5 ఏళ్ల సర్వీసు పూర్తి అయిన గ్రేడ్ 2 హెడ్ మాస్టర్లు, 8 ఏళ్ల సర్వీసు పూర్తి అయిన ఉపాధ్యాయులకు బదిలీ వర్తించనుంది. కేటగిరి 1కి ఒక పాయింట్, కేటగిరి2కి రెండు పాయింట్లు, కేటగిరి3కి మూడు పాయింట్లు, కేటగిరికి ఐదు పాయింట్లు, ఐదు స్టేషన్ పాయింట్లు ఇవ్వనున్నట్లు వెల్లడించింది. సర్వీస్ పాయింట్లు ఏడాదికి 0.5గా పేర్కొంది. మే 31 నాటికి ఖాళీలు, పదవీ విరమణ చేసే స్థానాలు, హేతుబద్ధీకరణ ఖాళీలు, తప్పనిసరిగా బదిలీ అయ్యే స్థానాలు, ఏడాదికిపైగా గైర్హాజరైన టీచర్ల ఖాళీలు, స్టడీ లీవ్ ఖాళీలను చూపించనున్నట్లు ప్రభుత్వం వివరించింది! ఉపాధ్యాయులకు మే నెలలో బదిలీలు చేపట్టేందుకు పాఠశాల విద్యాశాఖ కసరత్తు చేస్తోందని అధికారులు ముందుగానే తెలిపిన సంగతి విదితమే.

## వారం - వర్జ్యం

తేది : 22-05-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
దశమి రా.1.11
పూర్వాభాద్ర సా.5.46
వర్జ్యం రా.7.03-9.22
దు.ఉ.9.55-10.47, మ.3.07-3.59
శుభసమయం: ఉ.7.45-8.20
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** సన్నిహితులతో కలిసి కష్టసుఖాలని పంచుకుంటారు. ఇంటా బయటా అనుకూలంగా వుంటుంది.

**వృషభం :** పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైన అధిగమిస్తారు. ఋణబాధలు తప్పవు.

**మిథునం:** పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తిచేస్తారు. ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

**కర్కాటకం :** మిత్రులే శత్రువులుగా మారి సమస్యలు సృష్టిస్తారు. జాగ్రత్త అవసరం. ఖర్చులు పెరుగుతాయి.

**సింహం:** భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. పెట్టుబడుల విషయాలలో తొందరపాటు వద్దు.

**కన్య :** వ్యవహారాలలో విజయం సాధిస్తారు. దూరప్రాంతాల నుండి శుభ వార్తలు అందుకుంటారు. ఆధ్యాత్మిక చింతన.

**తుల :** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. వస్తులాభం.

**వృశ్చికం:** పనులలో ప్రోత్సాహం లభిస్తుంది. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు. తీర్థయాత్రలు. వస్త్రలాభం.

**ధనుస్సు:** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. వాహనయోగం.

**మకరం:** ఋణబాధలు ఎదురై చికాకులు పెడతాయి. పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తిచేస్తారు. మానసిక అశాంతి.

**కుంభం:** గృహ నిర్మాణ ఆలోచనలు నిదానంగా కార్యరూపం దాలుస్తాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**మీనం:** ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. పనులు మధ్యలో నిలిచిపోతాయి. శ్రమాధికం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# గంగమ్మ తల్లి జాతరకు సిఎం చంద్రబాబు దంపతులు హాజరు

## అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ

**కుప్పం, మే 21 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తన సతీమణి నారా భువనేశ్వరితో కలిసి ఒక్కరోజు పర్యటన నిమిత్తం కుప్పం విచ్చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రసిద్ధి చెందిన కుప్పం గ్రామదేవత శ్రీ తిరుపతి గంగమ్మ అమ్మవారి జాతరలో భాగంగా అమ్మవారి జాతర చివరి రోజు అమ్మవారి విశ్వరూప దర్శనం కోసం సిఎం దంపతులు కుప్పం వచ్చారు. బెంగళూరు నుంచి హెలికాప్టర్లో సిఎం దంపతులు ద్రవిడవర్సిటీలోని హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన కుప్పం పాతపేటలో ఉన్న శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయానికి విచ్చేయగా ఆలయం వద్ద ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసి వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, టిటిడి బోర్డు చైర్మన్ బిఆర్ నాయుడు, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, గంగమ్మ గుడి చైర్మన్ బిఎంకె రవిచంద్ర, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, పూజారులు పూర్ణకుంభంతో స్వాగతించారు. అనంతరం ముఖ్యమంత్రి దంపతులు అమ్మవారికి, రాష్ట్ర ప్రభుత్వం, తిరుమల తిరుపతి దేవస్థానం తరపున సారె, పట్టు వస్త్రాలు సమర్పించారు. రాష్ట్రానికి మంచిజరగాలని ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని సిఎం చంద్రబాబునాయుడు దంపతులు ప్రార్థించారు. అనంతరం సిఎం దంపతులకు ఆలయం తరపున అమ్మవారి వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందించారు. వేదపండితులు వారికి ఆశీర్వచనం చేశారు. అనంతరం అమ్మవారి హుండీలో కానుకలు వేశారు. అనంతరం ఆలయం వెలుపలకు వచ్చి ప్రజలకు, భక్తులకు సిఎం చంద్రబాబునాయుడు అభివాదం చేసారు. అక్కడ నుంచి మరలా ద్రవిడ వర్సిటీకి రోడ్డుమార్గంలో చేరుకున్నారు. కొంతసేపు కుప్పం టిడిపి ముఖ్యనేతలు, జిల్లా ఉన్నతాధికారులతో అభివృద్ధి అంశాలపై చర్చించిన అనంతరం హెలికాప్టర్‌లో బెంగళూరుకు పయనమయ్యారు.

# ‘నిధిభవన్’లో అగ్ని ప్రమాదం

>> లేకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ఉద్యోగులు చెప్పారు. విద్యుద్ఘాతంతో ఏర్పడిన పొగతో కంప్యూటర్లు పాడవుతాయని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమైన చెల్లింపులకు సంబంధించిన దస్త్రాలన్నీ ఈ కార్యాలయంలోనే ఉన్నాయని ఉద్యోగులు చెప్పారు. ఎపిఎఫ్ సివి రమణ ఘటన సమాచారం తెలుపుతూ 5 ఫోర్లలో ఉన్న ఉద్యోగులను వెంటనే అప్రమత్తం చేసాం. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బందికి వెంటనే సమాచారం అందించాం. అగ్నిమాపక దళం మంటలను అదుపుచేశారు. కొన్ని ఫైళ్లు కాలిపోయే ఆస్కారం ఉందని అనుకుంటున్నాం. సోమవారం ఎజి వర్క్ షాప్ నడిచింది. దానికి సంబంధించిన ఫైళ్లు అక్కడే ఉన్నాయి. ఎటువంటి ప్రాణానష్టం జరగలేదు. కానీ కంప్యూటర్లు, హార్డ్ డిస్కులు, సిపియూలు, మానిటర్లు ఎంతమేరకు డ్యామేజ్ అయ్యాయో తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదం ఉదయం 10:40 గంటలకు జరిగింది.మేము ఉదయం 10 గంటలకు ఆఫీసుకు వచ్చాం. పనిలో అందరూ నిమగ్నమై ఉండగా, పిఇఒ ఛాంబర్ నుంచి మంటలు వచ్చాయని ఉద్యోగులు తెలిపారు.. ఆపై మంటలు వ్యాపించాయి. అన్ని ఫైళ్ల ఆన్‌లైన్‌లు ఉండడం వల్ల మాన్యువల్‌గా ఎంత నష్టం జరిగిందో తెలియడం లేదు. ఫైర్ సేఫ్టీ మేథడ్స్ ఉంటే బాగుండేది. అవి లేకపోవడం వల్లే ఇంతటి ప్రమాదం జరిగింది. ప్రమాదం ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# కార్యకర్తల బాధ్యత నాది

>> దివంగత వెన్నా బాలకోటిరెడ్డి సతీమణి వెన్నా నాగేంద్రమ్మ, బాలకోటిరెడ్డి సోదరుని కుమారులు వెన్నా నరసింహారెడ్డి, వెన్నా రామకృష్ణారెడ్డిలను కలుసుకున్న మంత్రి లోకేష్.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హత్య కేసు నిందితులు స్వేచ్ఛగా సంచరిస్తున్నారని, కేసును పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా బాలకోటిరెడ్డి కుటుంబ సభ్యులు మంత్రి నారా లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు. ఆర్థికంగా చాలా నష్టపోయామని, ఉపాధి హామీ, గృహనిర్మాణం బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో పాటు తాము నివసిస్తున్న ఇల్లు తాకట్టులో ఉందని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. బాలకోటిరెడ్డి కుటుంబానికి జీవితాంతంఅండగా ఉంటానని మంత్రి లోకేష్ భరోసా ఇచ్చారు.

# ప్రాణ త్యాగానికైనా సిద్ధం

>> ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తోబాటు బిజెపి నేతలు విశాఖ ఉక్కు భవిష్యత్తు పై ఎందుకు స్పందించడం లేదని సూటిగా ప్రశ్నించారు. చంద్రబాబు విశాఖ ఉక్కును ఎందుకు కాపాడలేకపోతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ భూములపై కన్ను పడటం మూలంగానే బిజెపి ప్రభుత్వం విశాఖ ఉక్కును నిర్వీర్యం చేయాలని ప్రయత్నిస్తుంతోందని విమర్శించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ విశాఖ ఉక్కు కర్మాగారం ప్రయివేటుపరం కావడానికి కాంగ్రెస్ పార్టీ ఒప్పుకోదన్నారు. గత 6 నెలల్లో 2 వేల మంది కాంట్రాక్ట్ కార్మికుల్ని అన్యాయంగా తొలగించారని,రానున్న రోజుల్లో మరో 3 వేల మందిని తొలగించచడానికి కుట్రజరుగుతోందని ఆరోపించారు. తొలగించిన కాంట్రాక్ట్ కార్మికుల్ని తిరిగివిధుల్లోకి తీసుకునేవరకూ దీక్షనుకొనసాగిస్తానని హెచ్చరించారు.

# పిఎస్ఆర్ ఆంజనేయులు రిమాండ్ పొడిగింపు

**విజయవాడ,మే21,ప్రభాతవార్తప్రతినిధి:** ముంబయి నటి కేసులో సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ ఆర్ ఆంజనేయులు రిమాండ్ గడువును జూన్ 4 వరకు పొడిగిస్తూ విజయవాడ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. రిమాండ్ గడువు ముగియనుండటంతో పోలీసులు పీఎస్ఆర్ ను విజయవాడ జిల్లా జైలు నుంచి విజయవాడ కోర్టుకు తీసుకువచ్చారు. అనంతరం న్యాయమూర్తి ముందు హాజరుపర్చారు. విచారణజరిపిన న్యాయస్థానం ఎస్ఆర్ రిమాండ్‌ను జూన్ 4వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ముంబయినటి కేసులో అరెస్టైన పిఎస్ఆర్ విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

# సుంకేశుల ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత

## ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టుకు భారీ వరద

### మూడు గేట్లు ఎత్తి శ్రీశైలం జలాశయానికి నీటి విడుదల

**కర్నూలు, మే 21, ప్రభాత వార్త:** కర్ణాటక, ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు తుంగభద్రా నదికి భారీగా వరద నీరు చేరుతుంది. హగరి, వేదవతి నదుల మీదుగా వర్షపు నీరు కర్నూలు జిల్లాలోని సుంకేసుల రిజర్వాయర్ చేరుకోవటంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరింది. అంతేగాక మరింతగా ఎగువనుంచి నీటి వరద వస్తుంది. దీంతో సుంకేసుల ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. ఆ మేరకు ప్రాజెక్టు 3 గేట్లు ఎత్తి నీటిని శ్రీశైలం జలాశయానికి వదిలేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1.20 టిఎంసిలు కాగా... ఎగువ నుంచి 13,236 క్యూసెక్కులు వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో మూడు గేట్ల ను ఎత్తి 13,236 నీటిని దిగువకు వదిలివేస్తున్నారు. అదే క్రమంలో కెసి కెనాల్ కు 159 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఈ సీజన్లో మే నెల మూడో వారం నాటికే ప్రాజెక్టుకు ఎగువనుంచి వరద నీరురావటం విశేషం. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టనికి చేరుకోవటం గమనార్హం.

# మరో రెండు రోజులు భారీ వర్ష సూచన

**విజయవాడ,మే21,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో బుధవారం వర్షాలు దంచికొడుతున్నాయి. పశ్చిమ మధ్య బంగాళాఖాతం ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తా, రాయలసీమ మీదుగా ఉపరితల ఆవర్తనం ఉంది. దీనిపై ఆగ్నేయ బంగాళాఖాతం నుండి ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక వరకు ద్రోణి విస్తరించింది. వీటి ప్రభావంతో బుధవారం రాష్ట్రంలో ఆకాశం మేఘావృతమైన వాతావరణంతోపాటు భారీ వర్షాలు కురిసాయి. పంట చేలు వాన నీట మునిగాయి,అయితే ఈ వానలు మరో రెండు రోజులు కురిసే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణసంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో చాలా చోట్ల మోస్తరు నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. గంటకు 4050 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని రోణంకి కూర్మనాథ్ వివరించారు. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపారు.

# తిరుమల సమాచారం

## శ్రీవేంకటేశ్వర ఆపన్న హృదయం పథకానికి

### రూ.లక్ష విరాళాల సేకరణ - నిరుపేద పిల్లవాడికి ఉచిత ఆపరేషన్ సదుపాయం



**తిరుమల, మే 21ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమలతిరుపతిదేవస్థానం విద్య,వైద్య రంగాల్లోనూ అందిస్తున్న సేవలకు ధీటుగా తిరుపతిలోని పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో నిరుపేద పిల్లలకు ఉచిత గుండె శస్త్రచికిత్సలు నిర్వహిస్తోంది. ఇందుకోసం అయ్యే ఖర్చును టిటిడి దాతల నుండి సేకరించే దిశగా ఆలోచన చేసింది. గుండె శస్త్రచికిత్సల కోసం దేశవ్యాప్తం నుండి కూడా తిరుపతిలోని టిటిడి పద్మావతి చిన్నపిల్లల హృదయాలయాలకు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ఇప్పటికే దాదాపు 2వేలకుపైగా ఉచిత గుండె శస్త్రచికిత్సలు, గుండె మార్పిడి చేసింది. ఇప్పటికే పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో అమలవుతున్న శ్రీవేంకటేశ్వర ఆపన్న హృదయం పథకం క్రింద ఒకలక్ష రూపాయలు(1లక్ష)దాత విరాళం అందిస్తే , నిరాదరణకు గురైన నిరుపేద వర్గాలకు చెందిన ఒక పిల్లవాడికి ఉచితంగా అవసరమైన ఆపరేషన్ చేసే సదుపాయం ఉంది. నూతనంగా చిన్నపిల్లల వైద్యసేవల కోసం ప్రత్యేక ట్రస్టు ఏర్పాటుకు సంబంధించి కూడా టిటిడి ఆలోచన చేస్తోంది. చిన్నపిల్లలను దైవసమానులుగా భావించి, ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చే చిన్నారులకు చక్కటి వైద్యసేవలు మెరుగుపరిచేందుకు ఈ పథకం దోహదపడుతుంది. చిన్నపిల్లలకు సంబంధించి గుండె చికిత్సలతోపాటు చిన్నపిల్లల గుండె సర్జరీల సంఖ్యను పెంచేందుకు అవసరమైన వైద్యపరికరాలు, మౌళిక సదుపాయాలు, అత్యవసర మందులు ఏర్పాటుకు దాతలు విరాళాలందించేలా టిటిడిప్రోత్సాహిస్తోంది. దక్షిణభారతదేశంలోనే చిన్నపిల్లలకు ఉచిత గుండె శస్త్రచికిత్సలు, గుండె మార్పిడి చికిత్సలందించేందుకు గతంలోని వైసిపి ప్రభుత్వం తిరుపతిలో టిటిడి ఆధ్వర్యంలో పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంను నెలకొల్పింది. ఈ ఆస్పత్రికి పక్కాభవనాల నిర్మాణం, అత్యాధునిక వైద్యపరికరాలు, ఆపరేషన్‌కు అవసరమైన యంత్రాలు సమకూర్చునేందుకు కోటిరూపాయలు,కోటిన్నర రూపాయలు విరాళాలు ఇస్తే దాతలకు ఉదయాస్తమానసేవ టిక్కెట్ భాగ్యం కల్పించారు. ప్రస్తుతం టిటిడి అధికారులు, పాలకమండలి కూడా పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంను మరింత మెరుగ్గా నిర్వహించేందుకు దాతల నుండి ప్రోత్సాహం కోరుతోంది. లక్ష రూపాయల నుండి అంతకుపై భారీ మొత్తంలో విరాళాలందిస్తే దాతలకు టిటిడి తగిన విధంగా దర్శనం, వసతి కల్పించనుంది.

## హనుమజ్జయంతికి ఆలయాలు ముస్తాబు

**తిరుమల,మే 21 ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ వైకుంఠం తిరుమలలో నేడు హనుమజ్జయంతి వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. తిరుమలలో మరో ప్రసిద్ధ క్షేత్రం అంజ నాద్రిలోని "బాలాంజనేయ స్వామి ఆలయం లో బాలాంజనేయునికి, అంజనా దేవికి" విశేష అభిషేకాలు నిర్వహించ నున్నారు. పాప వినాశనం మార్గంలో జపాలి తీర్థంలో కొలువైన ఆంజనేయస్వామికి హనుమజ్జయంతిని వేడుకగా జరిపిస్తారు. టిటిడి తరపున పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ఇక్కడి స్వామివారిని, స్వామి జన్మస్థలం అంజనాద్రిని భక్తులు దర్శించుకునేలా టిటిడి ఏర్పాట్లు చేశారు. మొదటిఘాట్‌లో 7వ మైలువద్ద ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు జరగనున్నాయి.

## తిరుమలలో ఆధ్యాత్మికత ఉట్టిపడుతోంది

### - కొండపైనే దేవుడున్నాడు - తిరుమలలో నీరారాడియా



**తిరుమల, మే 21ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో ఆధ్మాత్మికత ఉట్టిపడుతోందని, దేవుడు ఇక్కడే కొలువై ఉన్నాడనే భావన కలుగుతుందని పారిశ్రామికవేత్త నీరారాధియా విశ్వాసం వ్యక్తం చేశారు. దేవుని దర్శనం అద్భుతంగా జరిగిందని, ఇక్కడ వ్యవస్థ బాగుందన్నారు.తిరుమలలో భక్తుల సదుపాయాలు సంతోషం కలిగిస్తోందన్నారు. తాను చేసిన ఆధ్యాత్మిక యాత్రలో కంటే తిరుమలలో దేవుడు కొలువై ఉన్నాడనేలా మనసు ఆనందంగా ఉందన్నారు. బుధవారం వేకువజామున శ్రీవారి అర్చన సేవలో ఆమె పాల్గొన్నారు. టిటిడి అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి దర్శనంతో మనసు సంతోషం

### తిరుమలలో ప్రముఖులు



**తిరుమల, మే 21ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంతో మనసు సంతోషపడుతుందని, స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ప్రముఖులు ఆకాంక్షించారు. బుధవారం ఉదయం విఐపి బ్రేక్‌లో టాటా గ్రూప్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖర్, మ్యూజిక్ దర్శకుడు తమన్, నటుడు ఆశ్విన్ వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో మెరుగైన వైద్యసేవలు

### - పిల్లల వైద్యసేవలకు నూతనంగా ట్రస్ట్ అవసరం - టిటిడి ఇఒ శ్యామలరావు



**తిరుమల, మే 21ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో టిటిడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో చిన్నారులకు మెరుగైన వైద్యసేవలందించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు టిటిడి ఇఒ జె.శ్యామలరావు తెలిపారు. ఇందుకు చిన్నపిల్లల హృదయాలయంలో పిల్లల ఆరోగ్యసంరక్షణ, వైద్యసేవలదృష్ట్యా కొత్తగా ఓ ట్రస్టును ఏర్పాటుచేయాలని ,ఇందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఇఒ అధికారులను ఆదేశించారు. పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం నిర్వహణపై బుధవారం మధ్యాహ్నాం హృదయాలయం ఆస్పత్రి సమావేశం మందిరంలో టిటిడి జెఇఒ వీరబ్రహ్మాం, సిఇ టివిసత్యనారాయణ, ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ఎన్.శ్రీనాధరెడ్డి, ఆర్ఎంఒ డాక్టర్ భరత్, ఎస్ఇలు వెంకటేశ్వర్లు, మనోహర్, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవితో కలసి ఇఒ సమీక్షించారు. చిన్నపిల్లల హృదయాలయంలో ఐసియు బ్లాక్, జనరల్‌వార్డు, ఓపిబ్లాక్‌లోని పిల్లలకు అందుతున్న వైద్యసేవలను పిల్లల తల్లిదండ్రులను కలసి పలకరించి అభిప్రాయాలు సేకరించారు. తల్లిదండ్రులు ఆస్పత్రి వైద్యసేవలు, వైద్యుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నపిల్లల ఆరోగ్యసంరక్షణకు టిటిడి అధిక ప్రాధాన్యతనిస్తుందని ఇఒ తెలిపారు.

## బిసి విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేయాలి:కేసన శంకరరావు

**విజయవాడ, మే 21, ప్రభాతవార్త :** రానున్న 2025-26 విద్యాసంవత్సరంలో ముందుగానే తల్లికి వందనం అమలు, రాష్ట్రంలోని విద్యార్థులందరికి యూనిఫాం, పాఠ్యపుస్తకాలం దించడం, అన్ని వర్గాల విద్యార్థులతోపాటు వసతిగృహాల్లోని బిసి విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేయాలని, ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన పలువురు బిసి నేతలతో కలిసి బిసి సంక్షేమశాఖ రాష్ట్ర సంచాలకులు డా ఎ మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. బిసి హాస్టళ్ళన్నింటిని స్వంతభవనాలుగా మార్చాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ సత్వరం చేయాలని, ఫీజు రీయింబర్స్, హాస్టల్ విద్యార్థుల బిల్లులు, ఎన్‌టిఆర్ విదేశీ విద్యాధరణ తదితర పథకాలకు పెండింగ్ లేకుండా వెంటనే చెల్లింపులు చేయాలంటూ విజ్ఞాపనను అందించారు. కార్యక్రమంలో ఎంబిసి మూర్తి, గుంటుపల్లి ఉమామహేశ్వర రావు, మేకా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## జూన్‌లో స్మార్ట్ రేషన్‌కార్డులు

**విజయవాడ,మే21,ప్రభాతవార్తప్రతినిధి:** కొత్త రేషన్‌కార్డుల కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పౌరసంబంధాల శాఖ అధికారులు తెలిపారు. ఈ నెలాఖరు వరకు గడువు ఉందని స్పష్టం చేసారు.జూన్ నెలలో స్మార్ట్ రేషన్‌కార్డులను ప్రభుత్వం జారీ చేస్తుందని వెల్లడించారు. ధరఖాస్తుదారుని చిరునామా మార్పు, ఆధార్ సరిచేయడం, అదనపు సభ్యులను చేర్చుట, సభ్యుల తొలగించడం, కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు, విభజన కార్డుకు, స్వాధీనం చేసే కార్డులకు సంబంధించి అప్లికేషన్ లు స్వీకరిస్తున్నారు. అందులో ప్రధానంగా రేషన్‌కార్డులో కొత్తవారిని చేర్చడానికి ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి. సచివాలయాల్లో డిజిటల్ సహాయకుల లాగిన్‌లో ఈ వివరాలు నమోదు చేస్తారు. తర్వాత వాటిని వీఆర్వో లాగిన్‌కు పంపుతారు. రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసే ప్రతి వ్యక్తికి ఈకేవైసీ చేస్తారు.



ఖరీఫ్ సాగుపై సమీక్షా సమావేశంలో వ్యవసాయమంత్రి అచ్చెన్నాయుడు

## వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించే బాధ్యత ప్రభుత్వానిదే

### - వ్యవసాయమంత్రి అచ్చెన్నాయుడు

విజయవాడ,మే21,ప్రభాతవార్తప్రతినిధి: వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించే పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని ఖరీఫ్ సంసిద్ధతపై వ్యవసాయ వ్యవసాయశాఖా మంత్రి కింజరాపు అచ్చెన్ననాయుడు స్పష్టం చేసారు., అనుబంధ శాఖల ఉన్నత స్థాయి అధికారులతో పాటు అన్ని జిల్లాల అధికారులతో రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధకం , మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రాష్ట్ర సచివాలయం నుండి సమీక్ష నిర్వహించారు.ఖరీఫ్ పంట సాగు విషయంలో రైతులు ఎటు వంటి ఇబ్బం దులు, సమస్యలను ఎదుర్కొనేందుకు ఏ మాత్రం అవకాశం లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేసే విషయంలో రాష్ట్ర స్థాయి నుండి గ్రామ స్థాయి అధికారులు వరకూ ఎంతో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయానికి అనుగుణంగా వ్యవసాయ అనుబంధ రంగాల్లో 15 శాతం వృద్ధి రేటును సాదించాలనే లక్ష్యంతో అధికారులు అంతా సమైఖ్యంగా కృషి చేయాలన్ని ఆదేశించారు. ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్, వాల్యూమ్ అండ్ మార్కెటింగ్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలిఎరువుల వాడకాన్ని తగ్గిస్తూ ప్రకృతి సేద్యాన్ని, సాంప్రదాయ పంటల సాగును క్రమంగా తగ్గిస్తూ ఉద్యానవన పంటల సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహించాలివ్యవసాయ యాంత్రీకరణ క్రింద 50 శాతం రాయితీ సొమ్మును ముందుగానే అందజేస్తున్నాము, రైతుల వాటా సొమ్ము బ్యాంకు ఋణాలు ద్వారా అందజేసే అంశంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. వ్యవసాయ అనుబంధ శాఖల్లో పనిచేసే ఉద్యోగుల బదిలీల ప్రక్రియను ఎంతో పారదర్శకంగా నిర్వహిస్తాము, ఏ ఒక్కరూ మధ్యవర్తులను ఆశ్రయించ వద్ద, డబ్బులను దుర్వినియోగం చేయవద్దఈ సమీక్షా సమావేశంలో వ్యవసాయ శాఖ స్పెషల్ సిఎస్ బి.రాజశేఖర్, సంచాలకులు ఎస్.డిల్లీరావు, ఉద్యానవ న పట్టుపరిశ్రమ శాఖ సంచాలకులు కె.శ్రీనివాసులు, మార్కెటింగ్ శాఖ సంచాలకులు ఎమ్.విజయసునీత, సహకార శాఖ కమిషనర్ అహ్మద్ బాబు, పశుసంవర్ధక శాఖ సంచాలకులు దామోదర్ నాయుడు, మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్,

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ఎం.సుబ్బారెడ్డి, ఆర్.వై.ఎస్.ఎస్. ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ మరియు వ్యవసాయ సహకార శాఖ సలహాదారులు

టి.విజయ కుమార్ తదితరులతో పాటు అన్ని జిల్లాల వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎపి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎఐ హ్యాకథాన్ : డిజిపి హరీష్‌కుమార్ గుప్తా



ఎఐ హ్యాకథాన్ పోస్టరును ఆవిష్కరిస్తున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

**విజయవాడ, మే 21,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ జాతీయ స్థాయిలో ఎఐ హ్యాకథాన్‌ను నిర్వహించనుంది. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు. ఈ వినూత్న కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం పోలీసింగ్.ప్రజాసేవలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పరిష్కారాలను అన్వేషించడమే లక్ష్యంగా ఈ ఎఐ హ్యాకథాన్ నిర్వహించబడుతోంది. ఈ కార్యక్రమం జూన్ 27,28, 29వ తేదిలలో ఆర్వీఆర్,జెసీ ఇంజినీరింగ్ కాలేజీ(గుంటూరు)లో నిర్వహిస్తామని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా వివరించారు.ఈ కార్యక్రమానికి సంబంధించిన అధికారిక పోస్టర్‌ను డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీష్ కుమార్ గుప్తా, ఐపీఎస్ నేడు తన కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎఐ హ్యాకథాన్ ఈవెంట్‌కు ఆర్వీఆర్,జెసీ ఇంజినీరింగ్ కాలేజీ అధికారిక హోస్టింగ్ పార్టనర్ గా వ్యవహరిస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ఉన్నతాధికారులు, దేశవ్యాప్తంగా ఉన్న ఐటీ రంగ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. నారా చంద్రబాబు నాయుడువిజన్ కు అనుగుణంగా, పరిపాలనలో ఆధునిక సాంకేతికతను అమలు చేయాలనే సంకల్పంతో ఈ హ్యాకథాన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శాస్త్రీయంగా. ఆచరణాత్మకంగా ఉండే ఎఐ పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి ఇది ఒక వ్యూహాత్మక వేదికగా నిలవనుంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ పోలీస్ విభాగం 4సైట్ఎఐ సంస్థతో భాగస్వామ్యం చేసుకుంది. 4సైట్ఎఐఈ హ్యాకథాన్‌కు నాలెడ్జ్ పార్టనర్ గా వ్యవహరిస్తోంది. హ్యాకథాన్ సందర్భంగా గౌరవ ముఖ్యమంత్రి గారి అధ్యక్షతన ప్రత్యేక సింపోజియం నిర్వహించబడుతుంది. ఇందులో ప్రభుత్వ నిర్ణయాధికారులు, పరిశ్రమ నాయకులు, పెట్టుబడిదారులతో నేరుగా మంతనాలు జరిపే అరుదైన అవకాశం పాల్గొనేవారికి లభిస్తుంది. ఈ ప్రెస్టీజియస్ హ్యాకథాన్‌లో దేశీయ, అంతర్జాతీయ ఐటీ సంస్థలు, స్టార్టప్స్, విద్యాసంస్థలు పాల్గొనాలని ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ఆహ్వానిస్తోంది. అవార్డుల ఎంపిక కమిటీలో సీనియర్ ఐపిఎస్ అధికారులు, పరిశ్రమ నిపుణులు, అకడమిక్ పరిశోధకులు సభ్యులుగా ఉంటారు. అభివృద్ధి చేయబడే పరిష్కారాల సాంకేతిక నైపుణ్యం మరియు వాస్తవ ప్రయోజనాలను పరిగణలోకి తీసుకుని విజేతలను ఎంపిక చేయడం జరుగుతుంది.

## నగదు రహిత వైద్యానికి రూ.5లక్షలకు సీలింగ్ పెంచండి!

### - తెలుగు రాష్ట్రాలతోబాటు తమిళనాడు, కర్ణాటకలో ప్రముఖ ఆస్పత్రులను ఇహెచ్‌ఎఫ్‌లో చేర్చాలి : టిటిడి ఉద్యోగులు

**తిరుమల, మే 21ప్రభాతవార్తప్రతినిధి:** దాదాపు 6,800మందివరకు శాశ్వత ఉద్యోగులు వివిధ విభాగాల్లో, వివిధ హోదాల్లో సేవలందిస్తున్నారు....రోజువారీగా లక్ష మంది వరకు వస్తున్న భక్తులకు సకల సౌకర్యాలు కల్పించి, సంతృప్తికర సేవలందిస్తున్న ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానమ్‌లో ఉద్యోగులు ఏదేని అనారోగ్యంబారిన పడితే నగదు రహిత వైద్యసేవలందడం గగనంగా మారిందని ఉద్యోగ సంఘాలనేతలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే వయసుమీరిన ఉద్యోగులు ,పలురకాలుగా అనారోగ్యంతో బాధపడుతున్న వాళ్ళు చిన్నచిన్న జబ్బులు బారిన పడితే వారికి తిరుపతిలోని కేంద్రీయ ఆస్పత్రి, స్విమ్స్,బర్డ్ ఆస్పత్రుల్లో వైద్యం అందుతుంది. ఆపై ఏదేని తీవ్రమైన వ్యాధుల బారినపడితే ఈ ఆస్పత్రుల్లో మెరుగైన నాణ్యమైన వైద్యం అందకపోగా తెలుగురాష్ట్రాల్లోని కార్పొరేటర్ ఆస్పత్రులు, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లోని కార్పొరేట్ ప్రముఖ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవాలంటే ఉద్యోగులు సొంత డబ్బులు వెచ్చించుకోవాల్సిన పరిస్థితి వస్తోందని చెబుతున్నారు. పైగా ప్రస్తుతం టిటిడిలో నగదు రహిత వైద్యసేవలకోసం 3లక్షల రూపాయలు మాత్రమే పరిమితం ఉన్న సీలింగ్‌ను 5లక్షల రూపాయల వరకు పెంచాలని ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి చేస్తోంది. ఇహెచ్‌ఎఫ్‌లో ఉన్న ఆస్పత్రుల సంఖ్యను పెంచాలని, నగదు రహిత వైద్యసేవలకు తిరుపతిలోని అమర ఆస్పత్రి, అంకుర, డిబిఆర్, మదర్ ఆస్పత్రి, సంకల్ప, రష్, కెఆర్ ,రమాదేవి తదితక ఆస్పత్రులను ఇహెచ్‌ఎఫ్‌లోకి అందుబాటులోకితీసుకురావాలని ఉద్యోగులు కోరుతున్నారు. అంతేగాక స్విమ్స్,బర్డ్ ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్యసేవలనుండి మినహాయించి గతంలోలాగా ఉచిత వైద్యసేవంలదించాలని విజ్ఞప్తిచేస్తున్నారు. టిటిడి పాలకమండలి, అధికారులు ఉద్యోగుల సంక్షేమంపై దృష్టిపెట్టాలని ఇటీవల ఉద్యోగుల సంఘాలనాయకులు కలసి విజ్ఞప్తిచేశారు. శాశ్వత ఉద్యోగులతోబాటు మరో 12వేలమంది వరకు ఔట్‌సోర్సి ంగ్,సొసైటీ క్రింద సేవలందిస్తున్న ఉద్యోగులకు వైద్యసేవలను స్విమ్స్,బర్డ్‌లో నగదు రహితంగా అందించాలని కూడా తెరపైకి తీసుకువస్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న లక్షలమంది భక్తుల సంఖ్యకు తగ్గట్లు అంకితభావంతో, సేవాభావ సేవలందిస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానంలో ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యతనివ్వడం లేదని ఆవేదన వెలిబుస్తున్నారు. ఇదే విషయంగా గతంలో ఉన్న టిటిడి పాలకమండలిని ,అధికారులను కలసి పలు దఫాలుగా విన్నవించినా ఇప్పటికీ సరైన సమాధానం లేదనేది ఉద్యోగవర్గాల ఆవేదన.



తీవ్రవాద వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సిబ్బందిచే ప్రతిజ్ఞచేయిస్తున్న డిఆర్ఎం గుప్తా

## తీవ్రవాదానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞచేసిన రైల్వే సిబ్బంది

**గుంతకల్లు రైల్వే,మే 21,ప్రభాతవార్త** తీవ్రవాదానికి వ్యతిరేకంగా రైల్వే సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. తీవ్రవాద వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డిఆర్ఎం చంద్ర శేఖర్ గుప్తా రైల్వే సిబ్బందిచే తీవ్ర వాదానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. స్థానిక డిఆర్ఎం కార్యాలయ ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో డిఆర్ఎం గుప్తా తమ సిబ్బందిచే భారతదేశ ప్రజలమైన మేము దేశం పట్ల సంపూర్ణ విశ్వాసంతో విధేయులై ఉంటామని, దేశానికి అవరోదం కలిగించే ఎలాంటి తీవ్రవాద చర్యలకు, సంఘ విద్రోహక కార్యకలాపాలకు పాల్పడబోమని తీవ్రవాదానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. మానవతా దృక్పథంతో అందరిని సహృదయంతో అర్థం చేసుకొని సామాజిక సామరాస్యంతో ప్రజలకు ఎలాంటి భయాందోళనలకు గురిచేయకుండ అవరోధాలు, అంతరాయం కలిగించనని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు డిఆర్ఎం సుధాకర్, సంబంధిత అధికారులు జీ వాలి, రంజిత్ కుమార్, రాజశేఖర్ నాయక్, ఆయా విభాగాలకు చెందిన సంబంధిత ఉన్నతాధికారులు, సీనియర్ సబార్డినేట్లు రైల్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల బదలీలకు రంగం సిద్ధం

**విజయవాడ,మే21,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా నేపథ్యంలో ఐఎఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలకు రంగం సిద్ధమైంది. ఆయా నియోజకవర్గాల్లోను, జిల్లాల్లోనూ అధికారుల పనితీరుపై నిఘా వర్గాల ద్వారా పూర్తి సమాచారం సేకరించిన ప్రభుత్వం తదనుగుణంగా చర్యలు తీసుకోనుంది. అన్ని కోణాలలో అధికారుల వ్యవహారశైలీలపై పూర్తి సమాచారం సేకరించారు. గత ప్రభుత్వ హయాంలో పలు ఆరోపణలపై ఐఎఎస్, ఐపీఎస్ అధికారుల సస్పెన్షన్స్, కేసులు నమోదు, అరెస్ట్ లు జరిగి పోయాయి. తాజాగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొంతమంది సివిల్ సర్వీసెస్ అధికారులు హైదరాబాదులో రహస్య సమావేశమయ్యారనే దానిపై కూడా ప్రభుత్వం పూర్తి సమాచారం సేకరించింది. కానీ ప్రభుత్వ అధినేత ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు. ఈ పరిణామాల నేపథ్యంలో ఈసారి ఐఎఎస్, ఐపీఎస్ బదిలీల్లో సమర్ధులకు స్థానం కల్పించాలని సీఎం నిర్ణయించారు. ఆ మేరకు పలు వడపోతల అనంతరం ఒక ప్రాథమిక జాబితా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని దాదాపు 12 నుంచి 14 మంది ఎస్పీలు బదిలీ అయ్యే అవకాశం ఉంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం 6గురు డిఐజిలకు కూడా బదిలీ జాబితాలో ఉన్నారు. నలుగురు ఐజిలకు కీలక బాధ్యతలు అప్పగించనున్నారనే సమాచారం. గుంటూరు, ఏలూరు రేంజ్ లకు కొత్త పోలీస్ బాస్ లు రానున్నారని తెలుస్తోంది. అదేవిధంగా విశాఖపట్నం కమీషనర్ మార్పు కూడా ఉండనున్నట్లు సమాచారం. ఈ బదిలీల ప్రక్రియలో ఒక రిటైర్డ్ డిజిపి చక్రం తిప్పుతున్నారు. దీంతో మంచి పోస్టింగులు ఎవరికి దక్కుతాయి, లూప్ లైన్ లోకి వెళ్లేది ఎవరు అనే దానిపై చర్చలు జరుగుతున్నాయి. అయితే వ్యవస్థను గాడిలో పెట్టాలనే ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా ఈ బదిలీలు ఉంటాయని సమర్థులైన అధికారులకు తమ ప్రభుత్వంలో స్థానం ఉంటుందనే మెస్సేజ్ ఇవ్వటానికి ప్రభుత్వాధినేత ప్రయత్నిస్తున్నారు.

## వేరుశనగ విత్తనాల రాయితీపై అచ్చెన్నాయుడుతో ఆరోగ్య మంత్రి సత్యకుమార్ చర్చ



**అనంతపురం, మే 21 ప్రభాతవార్త బ్యూరో** ఖరీఫ్ సాగు కోసం రైతులకు పంపిణీ చేసే వేరుశనగ విత్తన కాయలకు ప్రభుత్వం అందించే సబ్సిడీ విషయంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ బుధవారం చర్చించారు. వేరుశనగ, కంది, సబ్సిడీ, సరఫరాలో ఏర్పడే సమస్యలపై అచ్చెన్నాయుడును వ్యక్తిగతంగా కలిసి ఈ సమస్యను వివరించారు. ఈ సమావేశంలో మంత్రి సమస్యలపై సమగ్రంగా చర్చించగా, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కొన్ని సమస్యలు పరిష్కారమయ్యాయని తెలియజేశారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న అంశాలపై అధికారులతో తక్షణమే చర్చించి తగిన నిర్ణయాలు తీసుకుంటామని సత్యకుమార్ హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి సత్యకుమార్ శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్, డిఏఓతో కూడా మాట్లాడారు. కలెక్టర్‌కు, డిఏఓకు సంబంధిత అంశాలను వివరించి, సబ్సిడీ పంపిణీలో లోపం లేకుండా త్వరితగతిన రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేరుశనగ కాయల కోసం పంపిణీ కేంద్రాల వద్దకు వచ్చే రైతుల కోసం అన్ని సౌకర్యాలను కల్పించాలని, నాణ్యతలో రాజీ లేకుండా నాణ్యమైన విత్తన కాయలను పంపిణీ చేయాలన్నారు. పంపిణీలో ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే వాటిని పరిష్కరించాలని ఆదేశించారు.

## ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి : మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్టణంలో అర్బన్ హెల్త్ కేంద్రానికి శంకుస్థాపన చేసి,శిలా ఫలాకాన్ని ఆవిష్కరించిన మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ, మే21,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొలు రవీంద్ర పేర్కొన్నారు.బుధవారం ఉదయం నగరంలోని 38వ వార్డులో రూ.80 లక్షల వ్యయంతో నిర్మించనున్న పట్టణ ఆరోగ్య కేంద్రం భవనానికి రాష్ట్ర మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రధానంగా ప్రజల ఆరోగ్యం పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుందన్నారు.ఈ ఆరోగ్య కేంద్రం నిర్మిస్తున్న ప్రదేశం 500 గజాల ప్రభుత్వ స్థలమని, గతంలో అన్యాక్రాంతం అయ్యే పరిస్థితి ఉన్నప్పుడు పెద్ద ఎత్తున అడ్డుకున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆరోగ్య కేంద్రం నిర్మాణం చేపట్టామని, ఈ కేంద్రం నిర్మాణం పూర్తయితే ఇక్కడ పరిసర ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికి ముఖ్యంగా దయాలసిస్ రోగులకు చాలా ఉపయోగపడుతుందన్నారు. ఆర్ మచిలీపట్నంలోని వైద్య కళాశాల అనుసంధానంగా ఆసుపత్రి నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నామన్నారు. వైద్య కళాశాలలో ఫిజికల్ ఫిట్నెస్ కేంద్రం ఏర్పాటుకు 12 కోట్ల రూపాయల వ్యయంతో టెండర్లు పిలిచామని త్వరలో పనులు మొదలవుతాయన్నారు. పేద ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ఉందని బందరు పట్టణం ప్రముఖ ఆరోగ్య కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుండి 3 కోట్ల రూపాయలను ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న పేద ప్రజలకు అందజేశామన్నారు.ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ ఈ ఆరోగ్య కేంద్రం నిర్మాణం పూర్తయ్యాక పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని చిన్న చిన్న ఆరోగ్య సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, డిఎం హెచ్ ఓ డాక్టర్ శర్మిష్ట, మునిసిపల్ డి. ఈ. కుబియా నాయక్, ఏఈ రాజేశ్వరరావు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ,జిల్లా కేంద్ర సహకార మార్కెటింగ్ కమిటీ చైర్మన్ బండి రామకృష్ణ. మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, బ స్థానిక ప్రముఖులుబుల్లయ్య , పీవీ గజేంద్రరావు, ఆనంద్ తదితర అధికారులు, అనధికారులు, వైద్య ఆరోగ్య మున్సిపల్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్ట్ బివి రమణకు గ్రీన్ జర్నలిస్టు అవార్డు



**తిరుపతి, మే 21ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలం అడవిలో తిరుమల కొండల్లో ఎన్నో జీవవైవిధ్య ఫోటోలు తీసి,వ్యాసాలు రాసిన సీనియర్ జర్నలిస్ట్ బివి రమణకు గ్రీన్‌జర్నలిస్ట్ అవార్డుకు ఎంపికయ్యారు. రాష్ట్ర జీవవైవిధ్య బోర్డు గ్రీన్‌జర్నలిస్ట్ అవార్డును ప్రకటించింది. ప్రకృతి పరిరక్షణ,ట్రెక్కింగ్, కళలు, గిరిజన సంస్కృతి తదితర రంగాల్లో చేసిన విశేష కృషిని గుర్తించి ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈమేరకు రాష్ట్రజీవవైవిధ్యబోర్డు సమాచారం తెలిపింది. పలు దినపత్రికల్లో, ఎస్వీబిసి ఛానెల్‌లో పనిచేశారు.ఇప్పటివరకు ఆయన 300కుపైగా ఫోటో వ్యాసాలు, 200కిపైగా వీడియో డాక్యుమెంటరీలు రూపొందించారు. 10 పుస్తకాలను రచించారు. ప్రజలకు ప్రకృతిని చేరువచేయాలనే ఉద్దేశ్యంతో 'మ్యాక్"సంస్థ ద్వారా శేషాచల అడవుల్లో అనేక ట్రెక్కింగ్ కార్యక్రమాలు నిర్వహించారు.

వార్త

అనవసరమయిన అవసరాలను అంతం లేకుండా పెంచుకుంటూ పోవడమే నాగరికత.

-మార్క్‌ట్వయిన్

# కరి ఘీంకారానికి కళ్లెం!

వజ్రాన్ని వజ్రంతోనే కోయాలంటారు. అలాంటి ఐడియాతోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం ఒక పెద్ద సమస్యను ఎలాగైనా నివారించాలని కంకణం కట్టుకోవడం విశేషం. రాష్ట్ర సరిహద్దులోని రైతుల్ని కునుకు లేకుండా చేస్తున్న ఏనుగుల బెడదను నివారించేందుకు అటవీ శాఖ అధికారులు ఒక ఐడియాను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెవిలో చెప్పగానే గత ఏడాది ఆయన ఆఘమేఘాల మీద కర్ణాటక ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి కుంకీ ఏనుగుల కోసం ఒప్పందం చేసుకున్నారు. మదమెక్కిన ఏనుగులను దారికి తేవాలంటే ఈ కుంకీ ఏనుగుల వలనే సాధ్యమోతుంది. ఆంధ్రప్రదేశ్‌లో చిత్తూరు జిల్లాలో పలమనేరు, రామకుప్పం, శాంతిపురం మండల గ్రామాలకు ఏనుగుల బెడదఅధికం. అలాగే పార్వతీపురం జిల్లాలోనూ ఏనుగులు పంటలను ధ్వంసం చేయడం, జనావాసాల్లోకి రావడంతో రైతాంగం ఆందోళన అంతా ఇంతా కాదు. ఆ గజరాజులను కట్టడి చేసేందుకు ఇంతకన్నా మంచి మార్గం లేకపోవడంతో ప్రభుత్వం ఆ వైపు దృష్టి సారించడం తప్ప వేరే గత్యంతరం లేకపోయింది. చిత్తూరు జిల్లాలోని కౌండిన్య అభయారణ్యం నుంచి ఈ మధ్య కాలంలో ఎన్నో ఏనుగులు గుంపులు గుంపులుగా వచ్చి పొలాల మీదపడి భయభ్రాంతులను చేశాయి. రెండు గుంపులుగా ఏనుగులు ఊరి మీద పడుతున్నాయి. ఒక గుంపులో 23 ఏనుగులు, మరో గుంపులో 13 ఏనుగులు రెండూ వేర్వేరు సమయాల్లో దాడి చేస్తాయని పరిశీలకులు చెబుతున్నారు. ఇలా ఆ గుంపు ఏనుగులు తమ పొలాలను విధ్వంసం చేసినప్పుడల్లా రైతులు నరకయాతన పడుతున్నారు. వారికి ఏర్పడిన ఆర్థిక నష్టాలు అన్నీ ఇన్నీ కావు. చెప్పనలవి కాదు. ఏనుగుల వల్ల పంటల ధ్వంసం ఇతరత్రా, రైతు సమస్యలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అటవీశాఖ ఉన్నతాధికారులతో చర్చించిన క్రమంలో కుంకీ ఏనుగుల గురించి ఓ ఐడియా తళుక్కున మెరిసింది. అయితే ఆ వెంటనే కర్ణాటక ప్రభుత్వానికి రిక్వెస్ట్ చేశారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, అటవీ శాఖమంత్రులతో సంపాదించడమే కాదు వెళ్ళి కలిసారు కూడా. దాంతో పని సానుకూలపడింది. కుంకీ ఏనుగులతో పాటు, శిక్షణ పొందిన మావటీలను కూడా పంపేందుకు ఒప్పందం కుదిరింది. కాస్త ఆలస్యమైనా అది ఇన్నాళ్లకు కుదిరింది. బుధవారం కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు 6 కుంకీ ఏనుగులను అప్పగించారు. వీటి విడిది కోసం పలమనేరు వద్ద మొసలి మడుగులో 50 ఎకరాల విస్తీర్ణంలో ఎలిఫెంట్ హాబ్‌ను ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. మావటీలను కూడా నియమించారు. ఇది ఈనాటి సమస్య కాదు. ఇన్నాళ్లూ రైతాంగానికి పరిష్కారం దొరకలేదు. తాజాగా ఉన్న సూచనలు సలహాలు మేరకు ఒక ప్రయత్నం జరిగింది. మానవేతర జాతులలో ఇలా అవే జాతిజీవులు లొంగదీసుకునే విధానాలు అవలంబిస్తున్నారు. కుంకీ ఏనుగులతో సమస్య పరిష్కారమవుతుందని, గతంలో ఇలాంటి ఆలోచన ఎప్పుడూ వచ్చినట్లు లేదు. ఏదైనా ఒక ఆలోచన మదిలో మెదలడం వెంటనే అటవీ అధికార గణం, ఆ శాఖమంత్రి నేతృత్వంలో ముందుకు కదలడమూ జరిగాయి. పొలాల్లోకి, నివాస ప్రాంతాల్లోకి వచ్చే ఏనుగుల గుంపును తిరిగి అడవుల్లోకి పంపించేందుకు అటవీశాఖ దగ్గర కుంకీ ఏనుగుల కొరత ఉందని అధికారులు ఇవన్నీతనకు అడవుల మీద, పర్యావరణం మీద ఉన్న అవగాహన వల్లనే చెప్పగలుగుతున్నానని అటవీశాఖ మంత్రి వివరించారు. అడవులపై తనకున్న అవగాహనతో కర్ణాటకలో కుంకీ ఏనుగులు ఉన్నాయని, అక్కడి నుంచి ఈ ఏనుగుల్ని తెచ్చుకుంటే ఈ సమస్యను అధిగమించవచ్చునని భావించారు. ఆ రాష్ట్రం నుంచి ఆ తరహా ఏనుగులు తీసుకువస్తే విద్యుత్ ఫెన్సింగ్ వేసుకొనే విధానాలు విడిచి పెట్టవచ్చునని దాని వల్ల జీవహింస అపవాదు నుంచి బయటపడే అవకాశం ఉంటుంది. ఇప్పటివరకు సాగుతున్న జీవహింసకు చెక్‌పెట్టే నిర్ణయం కావడం ప్రశంసనీయం. చెప్పుకోదగిన విషయమేమిటంటే కుంకీ ఏనుగుల సంరక్షణ బాధ్యతను తనే స్వయంగా పర్యవేక్షించుకుంటానని గతంలో ఏనుగుల బెడదతో జరిగిన ప్రాణ, ఆస్తి నష్టాలు ఇకపై జరగకూడదని తాను ఆశిస్తున్నానని పవన్ కళ్యాణ్ అంటున్నారు. ఏనుగులను లొంగదీసుకోవడానికి శిక్షణ పొందిన కుంకీ ఏనుగుల్ని మాత్రమే ఉపయోగిస్తారు. కాగా ఏపీలో జయంత్, వినాయక అనే రెండు ఏనుగులను కౌండిన్య అడవుల్లోని సంరక్షణ కేంద్రంలో ఉంచారు. మగ ఏనుగులను మాత్రమే కుంకీలుగా ఎంచుకుంటారు. మగ ఏనుగులు ఒంటరిగా తిరుగాడుతుంటాయనే వాటిని ఎంపిక చేసుకుంటారు. కుంకీగా ఉన్న మగ ఏనుగు రాగానే అక్కడి నుంచి ఆడ ఏనుగులు తప్పుకుంటాయి. కొన్ని సందర్భాల్లో ఏనుగులు పంటలపై దాడి చేస్తే.. వాటిని తరిమికొట్టడం కష్టమేనని చెప్పాలి. కుంకీ ఏనుగులు పంటలపై దాడి చేస్తున్న ఏనుగులతో పోరాడగలుగుతాయి. అడవిలో తిరిగే ఏనుగును కుంకీగా మార్చడానికి ఏనుగుపై మావటి కూర్చుని శిక్షణ ఇస్తారు. ఏవైనా అడవి జంతువులు వచ్చినపుడు గట్టిగా ఘీంకరించి భయపెట్టడంలో కూడా శిక్షణ ఇస్తారు. జనావాసాల్లో సంచరిస్తూ ప్రాణహానికి కారణమయ్యే కోతులు, కొండముచ్చులు, ఎలుగు బంట్ల బెడద నుంచి ప్రజల్ని కాపాడటానికి కూడా మార్గాన్వేషణ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. వీటి విషయంలో ప్రత్యేక నిపుణులతో అధ్యయనం చేయించాలి.

# భూతలంపై జీవ వైవిధ్య సౌందర్యం నెలకొల్పాలి

ప్రస్తుతం భూమిపై ఉన్న జీవరాశుల్లో సుమారు 800 కోట్లమంది మానవులే. వీరి మనుగడ, భూ వాతావరణంపై, భూమి పైన, భూమి లోపల నిక్షిప్తమైన వనరుల మీద ఆధారపడి ఉంది. భూమిపై నివసిస్తున్న మనకు భూమితో గల సన్నిహిత సంబంధాన్ని కాదనలేం. అలాంటి భూమి కోసం పర్యావరణాన్ని పరిరక్షించవలసిన బాధ్యత మనపై ఉంది. మానవ స్వార్థంతో పర్యావరణం విధ్వంసం కావడం, బయోడైవర్సిటీ దెబ్బతినడం వలన మనచుట్టూ ఆవరించబడి ఉన్న వాతావరణం అనేక మార్పులకు లోనౌతున్నది. ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. గ్లోబల్ వార్మింగ్ అంతర్జాతీయ సమస్యగా మారింది. ప్లాస్టిక్ పర్యావరణానికి పెను సమస్యగా మారింది. ప్రతీ ఏటా ప్రపంచంలో ప్లాస్టిక్,మైక్రో ప్లాస్టిక్ రూపాల్లో సుమారు 25కోట్ల టన్నులకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలు వచ్చి చేరుతున్నాయి. ఇకనైనా ఈ ధోరణి మారాలి. సకల జీవరాశులు భూమిపై నివసించగలిగే వాతావరణం నెలకొల్పాలి.


సుంకవల్లి సత్తిరాజు

అందరూ బాగుండాలి అందులో నేనుండాలి అనే నినాదంఅందరి నోళ్ళలో అను నిత్యం నానుతున్న అక్షర సత్యం. అయితే ఈ హితోక్తి వీనులవిందుగా, బహు పసందుగా ఉన్నా,ఆచరణకు మాత్రం చాలా మందికి బహుకష్టంగా మారింది. నేను మాత్రమే బాగుండాలి అందరూ అష్ట దరిద్రంలో కొట్టుకుపోవాలనే దుర్బుద్ధి ప్రస్తుత వ్యవస్థలో తాండవిస్తున్నది. స్వప్రయోజనాలకు ప్రాకులాడుతూ విశ్వమానవ కల్యాణానికి తిలోదకాలిస్తూ, సాటి మనుషుల ఉనికిని కూడా భరించలేనంత ఈర్ష్యాక్రోధాలు పెరిగిపోయి రోగగ్రస్థమైన ఆలోచనలతో రగిలిపోతున్న మనుషులున్న వర్తమాన ప్రపంచంలో ఇతర జీవరాశుల మనుగడ గురించి ఆలోచించగలరా? పరిస్థితులు అడ్డం తిరుగుతున్నాయి. మనచుట్టూ ఉంటూ, మనతో మమేకమై జీవిస్తున్న ఇతర జీవరాశులు మనుగడ సాగిస్తేనే మానవ మనుగడ కొనసాగుతుంది. లేకపోతే ఈ సువిశాలమైన భూగ్రహం సమీప భవిష్యత్తులో నిర్జీవంగా మారే అవకాశాలే అధికంగా ఉన్నాయి. స్పేస్ ఎక్స్ అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ చెప్పినట్టు, భూమికి మంగళం పాడి మంగళ గ్రహ పయనానికి సంసిద్ధంగా ఉండాలని చేసిన సూచన సాధ్యం కాకపోయినా, భూగోళం మాత్రం భవిష్యత్తులో మానవ ఆవాసానికి అయోగ్యంగా మారే అవకాశాలను తోసి పుచ్చలేం. ధరిత్రిపై మానవ అస్థిత్వం ప్రమాదంలో పడింది. కాలుష్యంతో వాతావరణంలో విపత్కర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. భూ ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. కాలాలు అదుపు తప్పుతున్నాయి. సంవత్సరమంతా ఎండలు మండి పోతున్నాయి. శీతల దేశాల్లో కూడా మంచు కరిగిపోయి,ఉష్ణోగ్రతలు పెరిగి పోతున్నాయి. ఈ పరిస్థితులను నిలువరించాలంటే మానవ తప్పిదాలను సరిదిద్దుకోవాలి. మానవ స్వార్థానికి కనీస పరిమితులు విధించుకోవాలి. మనతోపాటు ఇతర జీవరాశుల మనుగడకు భూమిపై కొంత చోటివ్వాలి. సమస్త సృష్టిలో జీవజాతుల మధ్య నెలకొన్న 'వైవిధ్యం' ప్రకృతి కల్పించిన గొప్పలక్షణం. ఒక జీవికి, మరొక జీవికి జీవించే విధానంలో వైవిధ్యం ఉంది. ఆహారపు అలవాట్లలో వైవిధ్యం ఉంది. మనుగడ కోసం సాగించే పోరాటంలో ఒక్కొక్క జీవి ఒక్కో విలక్షణమైన శైలిని కలిగి ఉంది. ప్రతీ జీవి, ఇతర జీవరాశులపై ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ఆధార పడక తప్పదు. అదే ప్రకృతి విశిష్ఠత. అన్ని జీవరాశులు ప్రకృతిలో మమేకమై జీవించాలి. దురదృష్ట వశాత్తూ మానవ మేధస్సు ఇతర జీవరాశులపై ఆధిక్యత ప్రదర్శించడం వలన ఎన్నో జీవరాశులు తమ అస్థిత్వం కోల్పోయాయి. గతంలో ఈ భూమండలంపై జీవించిన పలు రకాల ప్రాణులు మానవ ప్రేరిత దుష్కృత్యాలతో అంతరించిపోయాయి. మరికొన్ని జీవరాశులు అంతర్థానానికి దగ్గరలో ఉన్నాయి. పంటపొలాల్లో పలు రకాల జీవజాతులు మనం వినియోగించే పురుగుమందులు, ఇతర రసాయనాల వలన నశించిపోతున్నాయి. కాలుష్య కారకాల వలన మనతో మమేకమై జీవించే అనేక ప్రాణులు అంతర్థానమై పర్యావరణానికి శాపంగా మారుతున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయి. భూ ఉపరితలం వేడెక్కి పోవడం, సముద్ర జలాలు కలుషితం కావడం వలన జరుగుతున్న పరిణామాలు భయంకరంగా ఉండబోతున్నాయి. ప్రపంచ జనాభా 8.2 బిలియన్లకు చేరుకుందని కొన్ని గణాంకాలు సూచిస్తున్నాయి. జనాభా విస్ఫోటనం ప్రకృతి పైన, పర్యావరణంపైన పెను ప్రభావం చూపుతున్నది. జనావాసాల కోసం అడవులను నరికివేస్తున్నాం. పెరిగే జనాభాకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి, ఉపాధి కోసం పచ్చదనాన్ని పెరికి పరిశ్రమలు నెలకొల్పుతున్నాం. వివిధ రకాల ప్రాజెక్టుల కోసం, రహదారుల కోసం పచ్చని భూములు



హరించుకుపోతున్నాయి. అక్కర లేకపోయినా ఆకాశ హర్మ్యాలు ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్నాయి. అనునిత్యం భూమిపై దాడి కొనసాగుతున్నది. పర్యావరణ సమస్యల వలన వేలాది జంతువులు, వృక్ష జాతులు అంతరిస్తున్న జాబితాలోఉన్నాయి. ఎన్నో రకాల కీటకాలు, పక్షులు, మొక్కల్లో 40 శాతం పైగా అంతరించిపోయే దశలో ఉన్నాయి. జీవులన్నీ ప్రకృతిలో మనతో పాటు జీవించే అవకాశాన్ని మనమే లేకుండా చేస్తున్నాం. జీవవైవిధ్యం మానవాళి మనుగడకు అవసరం. జీవ సమతుల్యత లోపిస్తే జరగబోయే పరిణామాలు మానవ వినాశనానికి దోహదం చేస్తాయి. 'ప్రకృతి' ఈ సమస్త సృష్టికి నిండైన అందాన్ని సమకూర్చి పెట్టింది. ఇలాంటి ప్రకృతిలో మానవులతో పాటు జంతుజాలం,వృక్షజాలం, క్రిమికీటకాలు, భౌతిక, రసాయనిక పదార్థాలు నిండి ఉన్నాయి. అరణ్యాలు, నదీనదాలు, పర్వతాలు, లోయలు, ఇతర అనేకమైన ఏర్పాట్లు సహజసిద్ధంగా నెలకొని ఉన్నాయి. ఇవన్నీ కేవలం ఒక భూగ్రహానికే పరిమితం కావడం భూగ్రహ వాసులుగా మనకు దక్కిన అరుదైన వరం. ఎన్నో వింతలతో, విచిత్రాలతో విభిన్న జీవరాశుల కలయికతో,వాటి మనుగడకు కావలసిన అనేకమైన సహజవనరులతో అద్భుతంగా ఏర్పడిన ధరిత్రిని సజీవంగా ఉంచడానికి నిరంతర కృషిజరగాలి. ఇతర గ్రహాలను పరిశోధించడం ఇతర గ్రహాల్లో జీవించడానికి అనువైన పరిస్థితుల కోసం అన్వేషించడం, సజీవమైన భూగ్రహాన్ని వదిలేసి, ఇతర గ్రహరాశులపై మక్కువ పెంచుకోవడం నేల విడిచి సాము చేయడమే. ఇతర గ్రహాలపై పరిశోధనలు చేయడాన్ని తప్పు పట్టలేం. కాని నివాసయోగ్యమైన భూమిని కాలుష్యంతో నింపేసి, భూవాతావరణాన్ని నాశనం చేసి, కోట్లాది జీవరాశులను ప్రాణ సంకటంలోకి నెట్టడంలో గల ఔచిత్యమేమిటో అర్థం కావడం లేదు. జీవవైవిధ్యం దెబ్బతినడంతో ప్రకృతిలో అనేక అవాంఛనీయ మార్పులు సంభవిస్తున్నాయి. మానవాళికి పలు రకాలుగా ఉపయోగపడే జీవసంపద మానవ స్వార్థచింతన వలన నశించిపోయింది. ఒకవైపు ప్రకృతి విధ్వంసం వలన భూవాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. కాలుష్యకారకాలు పెరిగిపోయాయి. పర్యావరణం దెబ్బతిన్నది. మనతో కలిసి జీవిస్తున్న జీవరాశులెన్నో ప్రకృతిలో చోటు చేసుకుంటున్న విపరీతమైన పోకడలకు నిలవలేక ఇప్పటికే అదృశ్యమైపోయాయి. ప్రకృతి విధ్వంసంవలన జీవవైవిధ్యంలోపించింది. జీవవైవిధ్యలోపమే హానికారకమైన వైరస్‌ల పుట్టుకకు మూల కారణం. సమస్యలకు మూల కారణాన్ని అన్వేషించి,కాలుష్య భరిత వాతావరణం నుంచి మానవాళిని కాపాడాలి. ప్రపంచ వ్యాప్తంగా భీతావహ వాతావరణాన్ని సృష్టిస్తున్న వైరస్ లు మున్ముందు మరింత విజృంభించవచ్చు. రోగాలతో మృత్యు కౌగిట్లో చిక్కుకుని కాటికి పోయిన మానవ శవాల గుట్టలు శాస్త్ర విజ్ఞానానికే సవాలు విసురుతున్నాయి. జీవవైవిధ్యాన్ని హరించి, ప్రకృతితో చెలగాటమాడిన ఫలితమే సకల వైపరీత్యాలకు మూలకారణం. ప్రకృతిని నాశనం చేస్తున్న మానవుని విధ్వంసరచన అత్యంత ఆందోళనకరంగా ఉంది. మానవుడు బుద్ధిజీవి. అలాంటి బుద్ధిజీవి తను చేసిన తప్పిదాల వలన విగతజీవిగా మారుతున్నాడు. కాంక్రీటు అరణ్యాల్లో గిరిగీసుకుని హాయిగా బ్రతికేస్తున్నామనుకున్న మానవులు తాము తమ స్వార్థం కోసం పర్యావరణానికి హానిచేస్తూ, కాలుష్యాన్ని వెదజల్లుతూ, హానికారకమైన వైరస్‌లతో సహజీవనం చేస్తున్నామన్న విచక్షణ మరచిపోయారు. నీటి కాలుష్యం,వాయు కాలుష్యం వలన మనుషులతో పాటు అనేక జీవరాశులు ఇబ్బంది పడుతున్నాయి. అభివృద్ధి పేరుతో జరుగుతున్న అనేక చర్యలు జీవరాశుల ఉనికికి ప్రమాదంగా మారుతున్నాయి. ప్రస్తుతం భూమిపై ఉన్న జీవరాశుల్లో సుమారు 800 కోట్లమంది మానవులే. వీరి మనుగడ, భూవాతావరణంపై, భూమి పైన, భూమి లోపల నిక్షిప్తమైన వనరుల మీద ఆధారపడి ఉంది. భూమిపై నివసిస్తున్న మనకు భూమితో గల సన్నిహిత సంబంధాన్ని కాదనలేం. అలాంటి భూమి కోసం పర్యావరణాన్ని పరిరక్షించవలసిన బాధ్యత మనపై ఉంది. మానవ స్వార్థంతో పర్యావరణం విధ్వంసం కావడం, బయోడైవర్సిటీ దెబ్బతినడం వలన మనచుట్టూ ఆవరించబడి ఉన్న వాతావరణం అనేక మార్పులకు లోనౌతున్నది. ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. గ్లోబల్ వార్మింగ్ అంతర్జాతీయ సమస్యగా మారింది. ప్లాస్టిక్ పర్యావరణానికి పెను సమస్యగా మారింది. ప్రతీ ఏటా ప్రపంచంలో ప్లాస్టిక్,మైక్రో ప్లాస్టిక్ రూపాల్లో సుమారు 25 కోట్ల టన్నులకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలు వచ్చి చేరుతున్నాయి. ఇకనైనా ఈ ధోరణి మారాలి. సకల జీవరాశులు భూమిపై నివసించగలిగే వాతావరణంనెలకొల్పాలి. జీవవైవిధ్య జీవనసౌందర్యాన్ని భూతలంపై పునః ప్రతిష్ఠించాలి. •


మీ ఆలోచనలు సదాచారమార్గం నుంచి మిమ్మల్ని దూరం చేసే సంకేతాలను ఇస్తున్నాయంటే దురదృష్టం మీకై కాచుకు కూర్చుంది అని భావించండి.

తిరుక్కురళ్


మనం ఇతరుల కోసం ఏం చేస్తామో అది మన శక్తికి నిదర్శనం. మనం ఇతరుల కోసం ఏ బాధల్ని అనుభవిస్తున్నామో అది మన ప్రేమకు నిదర్శనం.

బిబిఎస్ డబ్ల్యు కాట్

# రష్యా, ఉక్రెయిన్ యుద్ధానికి అంతమెప్పుడు?

కనుమ ఎల్లారెడ్డి

రష్యా, ఉక్రెయిన్ మధ్య భీకర యుద్ధం కొనసాగుతానే ఉంది. రష్యా ఇటీవల ఎప్పుడు లేనంతగా ఉక్రెన్ పై డ్రోన్‌లతో విరుచుకు పడింది. భారీ నష్టం ఉక్రెన్‌కు సంభవించినా, కొన్నింటిని కూల్చేశాం అని చెప్పుకుంది. విశ్వంలో ఈ యుద్ధం చాలా నష్టాన్ని తెచ్చిపెడుతోంది. యుద్ధ నివారణకు ట్రంప్ ముందుకు వచ్చినా రెండు దేశాలు తమ ధోరణి విడవటం లేదు. చాలావరకు రెండు దేశాల్లోని సైనికులకు కూడా ఈ యుద్ధం విసుగుతెప్పిస్తోంది. ఇక పౌరుల విషయం మామూలే. ఎప్పుడు యుద్ధం ఆగునో అని ఎదురు చూస్తున్నారు. చర్చల ద్వారానే యుద్ధానికి ముగింపు అనేది వాస్తవం. అయితే ఈ చర్చలు రెండింటికి అంగీకారం కావాలి. ఎటువంటి నిబంధనలు లేకుండా కాల్పులు ముందు ఆగాలి అని ట్రంప్ చెప్పినందుకు జెలెన్ స్కి అమెరికాకు కృతజ్ఞతలు చెప్పాడు. అటు రష్యా కూడా కాల్పుల విరమణకు సిద్ధంగానే ఉంది. ఆశాజనక చర్చల కోసం ఎదురు చూస్తోంది. రష్యా అసహజ షరతులు కొనసాగిస్తే యుద్ధ నివారణ కష్టం అని జెలెన్ స్కి వ్యాఖ్యానించారు. రష్యా మాత్రం మేము శాంతికి ప్రాముఖ్యం ఇస్తాం, ఉక్రెన్ అది ఉల్లంఘిస్తుందని చెప్పారు. ఇలా పరస్పర ధోరణులతోనే యుద్ధం కొనసాగుతోంది. ఫిన్‌లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ శాంతి ప్రక్రియకు, కాల్పుల విరమణకు రష్యా అనుమతించకుంటే ఆ దేశంపై ఆంక్షలు విధిస్తామని చెప్పడం గమనార్హం. ఈ వ్యవహారంలో రష్యా ఆచితూచి అడుగేస్తుంది.



ఉక్రెన్ యుద్ధంలో భారీగానే నష్టపోయింది. అందునిమిత్తమే కాల్పుల విరమణకు ముందుకు వచ్చింది. ట్రంప్ మాత్రం రెండింటిని సమన్వయం చేసి శాంతి పునరుద్ధరించాలి అని ఆరాటపడుతున్నాడు. నేను అధికారంలోకి వస్తే ఒక్క రోజులోనే రష్యా, ఉక్రెన్ యుద్ధాన్ని ఆపుతా అనే మాట అతనిలో యుద్ధం ఏ దేశానికి క్షేమం కాదు అనే మాట తెలుస్తోంది. రెండు దేశాలతో ట్రంప్ చర్చలు జరుపటం, కాల్పుల విరమనే ముందు జరగాలి అని జెలెన్ స్కి చెప్పటంముదావహం. ఎటువంటి షరతులు లేకుండా కాల్పులకు రెండు దేశాలు అంగీకరిస్తే ప్రయోజనం ఉంటుంది. ఇప్పుడు కాల్పుల విరమణ రెండు దేశాలు అంగీకరించాలి. కాల్పులు ఆగిపోతే చర్చలకు ప్రాధాన్యత ఉంటుంది. ఏ దేశం కూడా, ఎట్టి పరిస్థితులలో కాల్పులు, దాడులు చేయరాదు. అటువంటి పరిస్థితులలోనే శాంతి చర్చలు సఫలం అవుతాయి. రెండు దేశాల చర్చల కోసమే అమెరికా ప్రయత్నంచేస్తోంది. ఇటీవల ఇస్తాంబుల్‌లో చర్చలు అసంపూర్తిగా ముగిసిన దరిమిల, శాంతి ప్రక్రియకు, అవకాశం ఉంటుందా అనే అనుమానాలు వస్తున్నాయి. రష్యా పెద్ద దేశం కనుక రష్యా షరతులు ఉక్రెయిన్ అంగీకరించాలి. ఉక్రెయిన్ కూడా, రష్యా దాడిలో తమ నిర్మాణాలు పునరుద్ధరించాలి అనే ఒప్పందం చేసుకోవాలి. దేశాలు శాంతిగా ఉంటేనే విశ్వంబాగుంటుంది. అందుకనే రష్యా, ఉక్రెయిన్ శాంతి చర్చలు ఫలించాలని, శాంతి కొరకు అటు పుతిన్, ఇటు జెలెన్ స్కి సమాయత్తం అవుతారని, యుద్ధం త్వరలోనే ఆగిపోతుందని ఆశిద్దాం. •

# ప్రజావాక్కు



## కలియుగ ప్రభావమా?

ఈ మధ్య ఓ సీనియర్ ఆదాయపు పన్ను అధికారి డబ్బై లక్షల రూపాయలు లంచం తీసుకుంటూ పట్టుబడితే, ఎన్ ఫోర్సుమెంటు డైరక్టరేట్‌లో పనిచేసే మరో సీనియర్ అధికారి ఏకంగా రెండుకోట్లు లంచం డిమాండ్ చేసారట. లంచాలుతీసుకునే వారిని వలవేసి పట్టుకునే వారే వలలో పడుతున్నారు. భగవంతుడు మాత్రమే దశావతారాలను ఎత్తాడని చదువుకున్నాం. లంచావతారులు లేని వ్యవస్థను ఎవరైనా చూపగలరా? ఎన్నివ్యాపారాలు చేసినా ఎవరినీ ఏమోసమూ చేయకుండా వందల వేలలక్షల కోట్ల రూపాయలనుమూటగట్టగలరా?అసాధ్యమనిపించట్లా? అంతులేని అవినీతే దేశాభివృద్ధికి అవరోధం కలుగజేస్తోంది. కట్టిన కొద్దికాలానికే కూలిపోతున్న నిర్మాణాలు నిత్యం ఎన్నో చూస్తున్నాము. ఎన్నో అవినీతితిమింగలాలు వలలో చిక్కుతున్నాఇంకా తరగడంలేదు. ఇది కలియుగ ప్రభావమా?

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## ఉద్యోగులు విశ్వసనీయత పెంచుకోవాలి

ఇటీవల అఖిల భారత సర్వీసు ఉద్యోగులు తమ వృత్తికి కళంకం తెస్తూ రాజకీయ నాయకుల మెప్పు పొందడానికి శత విధాల ప్రయత్నం చేస్తూ తమ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతూవున్నారు. గతప్రభుత్వంలో సిద్దిపేట పాలనాధికారిగా ఉన్న వ్యక్తి అప్పటి సిఎంకు పాదాభివందనం చేయడం చర్చనీయాంశంఅయింది. తర్వాత వారు ఎంఎల్‌సి కావడం జరిగింది. ప్రస్తుతం కూడా ఒకజిల్లా పాలనాధికారి ముఖ్యమంత్రికి పాదాభివందనం చేయడం చర్చ నీయాంశమైంది. వారి గురు భక్తికి అందరూ షాక్‌కు గురి అయ్యారు. పెద్ద హోదాలో ఉన్నవారు రాజకీయ నాయకులను ప్రసన్నం చేసుకోవడం వారి అడుగులకు మడుగులు ఒత్తడం మన పాలనా వ్యవస్థ పని తీరుకు అద్దం పడుతూ ఉంది.

-కామిడి సతీష్ రెడ్డి, జయశంకర్, భూపాల్ పల్లి జిల్లా

## ఆయకట్టు స్థిరీకరణ

ఇప్పటికే సీతారామ ప్రాజెక్ట్‌తో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆయకట్టుకు నీరు అందించడంతో పాటు సరికొత్త ఆయకట్టును సాగులోకి తేవడంతో పాటు ఆయకట్టు స్థిరీకరణ చేయడంతద్వారా సరికొత్త రూపు రేఖలను ఖమ్మం జిల్లాకు అందించడం సాధ్యం అవుతుంది. ఇవన్నీ గత ప్రభుత్వం తెచ్చిన ప్రపోజల్స్ అని గుర్తుపెట్టుకోవాలి.

-భారత అవినాష్,జనగామ

## ఉపాధ్యాయులకు ప్రభుత్వం న్యాయం చేయాలి

2023, 2025లో వరుసగా రెండుసార్లు రేషనలైజేషన్‌కి గురి అయినటువంటి ఉపాధ్యాయులకు ప్రీవియస్ 8 సంవత్సరాల స్టేషన్ పాయింట్లు కేటాయించాలి. రేషనలైజేషన్ గురైన వారం దరికిపాతస్టేషన్ పాయింట్లు తోపాటు అదనంగా 5 పాయింట్లు ఇవ్వాలి. వరుసగా రెండుసార్లు రేషనలైజేషన్‌కి గురి అయినటువంటి ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఈ బదలీల్లో ప్రస్తుత స్టేషన్ పాయింట్లు తోపాటు అదనంగా ఏడు పాయింట్లు ఇస్తున్నది. గతంలో 2023లో జీఓ 117అమలు వల్ల ఒకసారి రేషనలైజేషన్ గురయ్యారు. అదేవిధంగా ఇప్పుడు రిస్ట్రక్చర్‌వల్ల 2025లో ఇంకోసారి గురవుతున్నారు. వరుసగా రెండుసార్లు రేషనలైజేషన్‌కి గురి అయినటువంటి ఉపాధ్యాయులకి స్టేషన్ సీనియారిటీపాయింట్ రెండు సంవత్సరాలు పాయింట్లు మాత్రమేవస్తున్నాయి. అటువంటి ఉపాధ్యాయులకుస్టేషన్ పాయింట్లు రెండు సంవత్సరాలకు, ఏడుఅదనపు పాయింట్లు వచ్చినందు వల్ల, తక్కువ పాయింట్లు వస్తా యి. కాబట్టి ప్రభుత్వం వాళ్ళకి ప్రస్తుతం పనిచేస్తున్నప్పటి నుంచి ప్రీవియస్ 8సంవత్సరాలు పాయింట్స్ ఇవ్వాలి. ఇలా ప్రభుత్వం వారికి న్యాయం చేయాలి.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

## యోగాకు విస్తృత ప్రచారం

జూన్ 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విస్తృత ప్రచారం కల్పించే నిమిత్తం ఎపి ప్రభుత్వం మే 21 నుంచి జూన్ 21వరకు యోగా మాసం ప్రకటించింది. విశాఖపట్నంవేదికగా జరిగే11వ యోగ దినోత్సవంలో ప్రధాని మోదీ పాల్గొననున్నారు. గిన్నిస్ రికార్డు లక్ష్యంగా ఈ కార్యక్రమం ఏర్పా టుకు కార్యాచరణ చేయడం అభినందనీయం. నేడు యోగ ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు గుర్తిస్తున్నారు.

-చల్లా చంద్రశేఖర్ రెడ్డి, కలువాయి, నెల్లూరు జిల్లా

## సుప్రీం తీర్పు అమోఘం


జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటి స్టోర్‌రూంలో కట్టల కట్టల నగదు తగలబడుతున్న స్థితిలో బయటపడిన వీడియోల తరువాత సుప్రీంకోర్టు స్పందించిన తీరుఅమోఘం. ఈ వ్యవహారానికి సంబంధించిన అన్ని వివరాలను సుప్రీంకోర్టు తన వెబ్‌సైట్‌లో పొందుపరచింది కూడా. సదరు న్యాయమూర్తిని అభిశంసన చేయాలని భారత ప్రధానన్యాయమూర్తి కేంద్రానికి విన్నవించటం ఆహ్వానించతగిన విషయం. జస్టిస్ యశ్వంత్ వర్మ న్యాయ వ్యవస్థకు కళంకం తెచ్చినవారే కాక తీవ్ర ద్రోహం చేశారు.

-కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

# ఆర్థిక వ్యవస్థపై పిఎంఐ ప్రభావం

డి జె మోహన రావు

మన దేశ ఆర్థిక వ్యవస్థ ఎలా నడుస్తోంది? దాని గుండె చప్పుడు ఎలా ఉంది? ఈ కీలక ప్రశ్నలకు సమాధానం వెతకడానికి మనకు అనేక సూచికలు ఉన్నప్పటికీ, వాటిలో ఒకటి చాలా ప్రత్యేకమైనది. అదే కొనుగోలు నిర్వాహకుల సూచీ లేదా పిఎంఐ. ఇది కేవలం అంకెలు కాదు, మన ఆర్థిక వ్యవస్థలోని తయారీ, సేవల రంగాలలో రోజువారీగా పనిచేసే వ్యక్తుల అనుభవాల నుంచి పుట్టిన ఒక కీలక సంకేతం. వ్యాపార కార్యకలాపాలు, భవిష్యత్తుపై వారి ఆశలు ఎలాఉన్నాయో ఇది మనకు ముందుగానే చెబుతుంది. ఇటీవలి కాలంలో ఈ సూచీ చెబుతున్న కథ భారత ఆర్థిక గమనంపై ఆసక్తికరమైన చర్చలకు తావిస్తోంది. అసలు ఈ కొనుగోలు నిర్వాహకుల సూచీ అంటే ఏమిటి? వ్యాపార సంస్థల్లో కొనుగోళ్లు చేసే నిర్వాహకులు ఉంటారు కదా, వారే ఈ సూచీ వెనుక ఉన్నారు. వారిని ప్రతినెలా సర్వేచేసి, కొత్త ఆర్డర్లు ఎలా వస్తున్నాయి, ఉత్పత్తి పెరుగుతోందా, ఉద్యోగులను కొత్తగా తీసుకుంటున్నారా, ముడిసరుకుల సరఫరా వేగంగా ఉందా లేదా వంటి విషయాలపై వారి అభిప్రాయాలు తీసుకుంటారు. ఈ అభిప్రాయాల ఆధారంగా 0 నుంచి 100 మధ్య ఒక అంకెను లెక్కిస్తారు. ఈ అంకెలో '50' అనేది చాలా ముఖ్యమైన స్థాయి. సూచీ అంకె 50 వద్ద ఉందంటే, గత నెలకు, ఇప్పటికీ వ్యాపార పరిస్థితుల్లో పెద్దగా మార్పు లేదనిఅర్థం. అంతా స్థిరంగా ఉంది అనుకోవచ్చు. ఒకవేళ సూచీ 50 కంటే ఎక్కువగా ఉంటే, అప్పుడు కథ వేరేలా ఉంటుంది. వ్యాపార కార్యకలాపాలు పుంజుకుంటున్నాయని, ఆర్థిక వ్యవస్థ వృద్ధి పథంలో వేగంగా పయనిస్తోందని ఇది చెబుతుంది. ఇది చాలా మంచి వార్త. కానీ సూచీ 50 కంటే తక్కువగా ఉంటే, అప్పుడు కొంచెం ఆందోళన చెందాలి. వ్యాపారాలు మందగిస్తున్నాయని, ఆర్థిక కార్యకలాపాలు నెమ్మదిస్తున్నాయని ఇది సూచిస్తుంది. ఇది ఆర్థిక వ్యవస్థకు ఒక హెచ్చరిక లాంటిది. దీని గొప్పతనం ఏమిటంటే స్థూల దేశీయోత్పత్తి , పారిశ్రామిక ఉత్పత్తి, నిరుద్యోగ గణాంకాలు వంటి అధికారిక వివరాలు వెలువడటానికి చాలా ముందే, నెల ప్రారంభంలోనే ఈ సూచీ అందుబాటులోకి వస్తుంది. అందుకే దీన్ని 'ముందస్తు ఆర్థిక సూచిక' అంటారు. మార్కెట్లో ఏం జరగబోతోందో ముందుగానే పసిగట్టడానికి ఇది ఆర్థికవేత్తలకు, విధాన నిర్ణేతలకు, వ్యాపారులకు ఎంతో ఉపయోగపడుతుంది. ఈ సమాచారం ఆధారంగానే ప్రభుత్వాలు సరైన సమయంలో నిర్ణయాలు తీసుకోవడానికి, వ్యాపారాలు తమ ప్రణాళికలు మార్చుకోవడానికి, పెట్టుబడిదారులు జాగ్రత్త పడటానికి అవకాశం




లభిస్తుంది. కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లు వంటి ద్రవ్య విధానాలను నిర్ణయించేటప్పుడు కూడా ఈ సూచీని ఒక ముఖ్యమైన సూచనగా తీసుకుంటాయి. ఈ సూచీలో ప్రధానంగా రెండు రకాలుంటాయి. వస్తువులు తయారు చేసే పరిశ్రమల కోసం 'తయారీ రంగ సూచీ', బ్యాంకింగ్, వైద్యం, ఐటీ వంటి సేవలందించే సంస్థల కోసం 'సేవల రంగ సూచీ'. ఈ రెండింటినీ కలిపి మొత్తం ఆర్థిక వ్యవస్థ స్థితిని తెలిపే 'సంయుక్త సూచీ' కూడా ఉంటుంది. ఈ సూచీ కూడా ఒక మనిషిలాగే పరిమితులు కలిగి ఉంటుంది. ఇది కొందరు కొనుగోలు నిర్వాహకుల అభిప్రాయాల ఆధారంగా తయారవుతుంది కాబట్టి, కొన్నిసార్లు మొత్తం రంగాన్ని లేదా దేశ ఆర్థికవ్యవస్థను పూర్తిగా ప్రతిబింబించకపోవచ్చు. వారి వ్యక్తిగత అనుభవాలు, మార్కెట్ సెంటిమెంట్ ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. నెలవారీగా వచ్చే ఈ అంకెలు సరఫరా సమస్యలు వంటి తాత్కాలిక కారణాల వల్ల కూడా మారవచ్చు. అన్నింటినీ మించి, ఇది కేవలం తయారీ, సేవలరంగాల గురించే చెబుతుంది కానీ వ్యవసాయం, నిర్మాణం వంటి ఇతర ముఖ్యమైన రంగాలను పెద్దగా పట్టించుకోదు. అందుకే, పిఎంఐ కేవలం ఒక కోణాన్ని మాత్రమే చూపిస్తుందని గుర్తుంచుకొని, దాన్ని ఇతర ఆర్థిక గణాంకాలతో పోల్చి చూస్తేనే మన ఆర్థిక వ్యవస్థ పూర్తి చిత్రాన్ని అర్థం చేసుకోగలం. ప్రపంచ వ్యాప్తంగా అనేక సంస్థలు ఈ సూచీలను సిద్ధం చేస్తున్నాయి. భారతదేశంలో ఎస్‌పి గ్లోబల్ అనే అంతర్జాతీయ సంస్థ సేకరించిన సమాచారం ఆధారంగా హెచ్‌ఎస్బిసి ఇండియా అనేసంస్థ దీన్నిలెక్కిస్తుంది. సుమారు 400తయారీసంస్థలు, 400 సేవా సంస్థల నుంచి వీరు వివరాలు తీసుకుంటారు. ఇక తాజాగా మన దేశంలో ఈ సూచీ చెబుతున్న కథ ఆశాజనకంగా ఉంది. ఏప్రిల్2025 నాటికి వెలువడిన గణాంకాలు మన ఆర్థికవ్యవస్థ పుంజుకుంటోందని బలంగా సూచిస్తున్నాయి. ఈ అద్భుతమైన అంకెల తెరవెనుక కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. గత నెలలు,సంవత్సరాలతో పోల్చిచూస్తే, కొన్నిసార్లు సేవల రంగం వృద్ధికాస్త నెమ్మదిగా ఉన్నట్లు కనిపించింది. అలాగే, పెట్టుబడి వస్తువులు వంటి కొన్ని ప్రత్యేక రంగాల్లో వృద్ధి ఇంకా పుంజుకోవాలి. ఎగుమతులు కూడా దేశీయ డిమాండ్ స్థాయికి చేరుకోవాలి. ఎక్కడ లోపాలున్నాయో గుర్తించి,ప్రభుత్వం ఆయా రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరంఉంది. భవిష్యత్ అంచనాలు కూడా మన ఆర్థికవ్యవస్థ బలంగానే ఉంటుందని చెబుతున్నాయి. అంతర్జాతీయ సంస్థలు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ పథకాలు,మౌలిక సదుపాయాలపై పెడుతున్న పెట్టుబడులు ఈ వృద్ధికి బలం చేకూర్చగలవు. కానీ కేవలం అంకెల్లో వృద్ధి వస్తేసరిపోదు కదా. అది సామాన్యుడి జీవితంలో ప్రతిబింబించాలి. నిరుద్యోగం, ఆదాయ అసమానతలు, పేదరికం, ద్రవ్యోల్బణం వంటి అనేకసవాళ్లు ఇంకా మన ముందున్నాయి. వీటిని అధిగమించాలంటే ఉద్యోగాలు సృష్టించే రంగాలపై పెట్టుబడి, యువతకు నైపుణ్య శిక్షణ, మౌలిక వసతుల కల్పన వంటి వాటిపై మరింతగా దృష్టి పెట్టాలి. పథకాలను ప్రకటించడమే కాదు, వాటిని సమర్థవంతంగా అమలు చేయడం చాలా ముఖ్యం. •

మన వి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఆ 33 దేశాలకే అఖిలపక్ష బృందాలు ఎందుకు?



## మిత్రదేశాలతోపాటు భద్రతా మండలి సభ్యదేశాలు ఎంపిక

**న్యూఢిల్లీ, మే 21:** పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదంపై తాము జరుపుతున్న పోరు గురించి ప్రపంచ దేశాలకు వివరించేందుకు భారత్ దౌత్య యుద్ధం షురూచేసింది. ఇందుకోసం భారత ప్రభుత్వం ఏడు అఖిలపక్ష బృందాలను ఏర్పాటు చేసింది. ఈ అఖిలపక్ష బృందాల విదేశీ పర్యటన ఈనెల 19న ప్రారంభమై 24 (శనివారం) నాటికి అన్ని అఖిలపక్షబృందాలు భారత్‌నుంచి బయలు దేరి వెళ్తాయి. ఏడు అఖిలపక్ష బృందాలు 33 దేశాల్లో పర్యటించి ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ ప్రోత్సహిస్తున్న తీరు గురించి వివరిస్తాయి. ఉగ్రవాద సంస్థలు, ఉగ్రవాదులకు పాక్ నిలయంగా మారిన అంశాన్ని తెలియజేస్తాయి. ఇంతకీ పాకిస్థాన్‌పై దౌత్య యుద్ధం కోసం 33 దేశాలనే భారత్ ఎందుకు ఎంపిక చేసిందనే చర్చ ఇపుడు తెరపైకి వచ్చింది. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌పై దౌత్య యుద్ధం కోసం ఆ 33 దేశాల సహకారానికి భారత్ ఎందుకు ప్రాధాన్యత ఇస్తోందనే అంశంపై ఇప్పుడు అంతటా చర్చ జరుగుతోంది. అఖిలపక్ష బృందాల పర్యటన కోసం 33 దేశాల ఎంపిక వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటనేది తెలుసుకునేందుకు అందరూ ఆసక్తితోఉన్నారు. అసలు విషయం ఏమిటంటే ఈ 33దేశాల్లో 15 దేశాలు ప్రస్తుతం ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత, తాత్కాలిక సభ్యదేశాలుగా వ్యవహరిస్తున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో శాంతిభద్రతలు, ఉగ్రవాదం, ఆర్థిక ఆంక్షలు వంటి వ్యవహారాల్లో కీలక నిర్ణయాలను ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీసుకుంటుంది. ఐక్యరాజ్యసమితి నిర్ణయాలు, తీర్మానాలలో భద్రతా మండలిలోని దేశాలే కీలక పాత్ర పోషిస్తాయి. అందుకే ఆయా దేశాలకు తన వైఖరిని తెలియజేయడానికి భారత్ ప్రాధాన్యం ఇచ్చింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో ఐదు దేశాలకు శాశ్వత సభ్యత్వం ఉంది. మిగతా 10 దేశాల తాత్కాలిక సభ్యత్వం రెండేళ్లకోసారి రొటేషన్ అవుతుంటుంది. భద్రతా మండలిలోని తాత్కాలిక సభ్య దేశాలకూ తాత్కాలిక అధ్యక్ష హోదాలభిస్తుంది. ప్రస్తుతం భద్రతా మండలి తాత్కాలిక సభ్యదేశంగా పాకిస్థాన్ ఉంది. మరో 17 నెలల పాటు పాక్‌కు ఆ హోదా ఉంటుంది. అప్పటివరకు భారత్‌పై పాకిస్థాన్ విష ప్రచారాన్ని ముమ్మరంగా కొనసాగించే అవకాశం ఉంది. దీన్ని తిప్పికొట్టేందుకే భద్రతా మండలిలోని అన్ని ఇతర దేశాలకు అఖిలపక్ష బృందాలను భారత్ పంపుతోంది. త్వరలోనే ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తాత్కాలిక సభ్యత్వం పొందనున్న మరో ఐదు దేశాలకు కూడా భారతదేశ ఆల్ పార్టీ టీమ్‌లు వెళ్లనున్నాయి. ఈ పర్యటనలో భాగంగా ఆయా దేశాల ప్రధానులు, విదేశాంగ మంత్రులు, ఎంపీలు, ప్రతిపక్ష నాయకులు, మేధావులు, జర్నలిస్టులు, ప్రవాస భారతీయులు, ప్రముఖ రాజకీయ నాయకులను అఖిలపక్ష బృందాలు కలుస్తాయి. భారత్‌తో బలమైన వాణిజ్య, స్నేహ సంబంధాలుకలిగిన దేశాలనుకూడా అఖిలపక్ష బృందాల పర్యటన కోసం ఎంపిక చేశారు. ఈ జాబితాలో సౌదీ అరేబియా, జర్మనీ,యూరోపియన్ యూనియన్, ఇటలీ, మలేషియా, దక్షిణ కొరియా, జపాన్, సింగపూర్, యూఏఈ, బ్రెజిల్, ఈజిప్ట్, ఖతర్, దక్షిణాఫ్రికా వంటి దేశాలు ఉన్నాయి. పనామా, గయానా, కొలంబియా, లాత్వియా, స్లొవేనియా లాంటి చిన్న దేశాలలోనూ భారత ఆల్ పార్టీ టీమ్‌లు పర్యటిస్తాయి. ఎందుకంటే ఆయా దేశాలతో భారత్‌కు మంచి దౌత్య సంబంధాలు ఉన్నాయి.



## కన్నడ రచయిత్రి భానుముస్తాక్‌కు 'బుకర్' ప్రైజ్

### 'హార్ట్ ల్యాంప్' కథా సంకలనానికి పురస్కారం

**లండన్, మే 21:** ప్రతిష్ఠాత్మక బుకర్ ప్రైజ్ 2025ను కన్నడ రచయిత్రి బాను ముస్తాక్ గెలుచుకున్నారు. హార్ట్ ల్యాంప్ అనే చిన్న కథల సంకలనానికి గాను ఈ అవార్డ్‌ను అందుకున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక బహుమతి అందుకున్న తొలి కన్నడ రచయిత్రిగా బాను రికార్డ్ సాధించారు. దీపా భస్తి రాసిన 'హాసీనా అండ్ అదర్ స్టోరీస్' అనే పుస్తకాన్ని బాను ముస్తాక్ అనువాదం చేశారు. లండన్‌లోని టేట్ మోడరన్‌లో జరిగిన జరిగిన ఓ కార్యక్రమంలో దీప్తి భస్తితో కలిసి బాను ముస్తాక్ ఈ అవార్డును అందుకున్నారు. దీనికింద 50వేల పౌండ్ల నగదును బహుమతి లభించగా, దీప్తితోకలిసి బాను ముస్తాక్ ఈ మొత్తాన్ని పంచుకోనున్నారు. గీతాంజలి శ్రీ, అనువాదకురాలు డైసీ రాక్‌వెల్ 2022లో టూంబ్ ఆఫ్‌సాండ్‌కు అవార్డు గెలుచుకున్నారు. ఆ తర్వాత అంటే మూడు సంవత్సరాల్లో బుకర్ ప్రైజ్ గెలిచిన రెండవ భారతీయ పుస్తకం ఇది.దీప్తి భస్తి, బాను ముస్తాక్ 'హార్ట్ ల్యాంప్' అనేది 12 చిన్న కథల పుస్తకం. ఈ కథల్ని ఆమె 30 ఏళ్లలో రాశారు. పితృస్వామ్య సమాజంలో మహిళల రోజువారీ జీవితాల్ని గురించి వివరించారు. ఇందులో ఉన్న కథలు ఏదీ కూడా చిన్నది కాదని ముస్తాక్ అన్నారు. ఇది మానవ అనుభవాల వస్త్రంలో ప్రతి దారం ప్రత్యేక బరువును కలిగి ఉంటుందని అన్నారు. తన అందమైన భాషకు ఇది గొప్ప విజయమని దీప్తి భస్తి అన్నారు. ఇక ఆంగ్ల పాఠకులకు ఇది నిజంగా కొత్త అనుభవం అని బుకర్ ప్రైజ్ 2025 జ్యూరీ చైర్‌మాక్స్ పోర్టర్ అభివర్ణించారు. వివిధ రకాల భాషల్లో కొత్త భావనలను సృష్టించే ఒక గొప్ప అనువాదమని తెలిపారు. కర్ణాటకకు చెందిన బాను ముస్కాక్ రచయిత్రి, కార్యకర్త, న్యాయవాది. ముస్లిం కుటుంబంలో జన్మించిన బాను పాఠశాల విద్యను అభ్యసిస్తోన్న సమయంలోనే తొలిసారి ఒక షార్ట్‌స్టోరీ రాశారు. అయితే, 26 ఏళ్ల వయసులో తన కథ పత్రికలో ప్రచురితమైంది. తనతండ్రి ప్రోత్సాహంతో చదువులో రాణించారు.

ఉర్దూలోనే విద్యభసించిన బాను, కన్నడ భాషపై పట్టు సాధించారు. ఆ తర్వాత ఆమె రిపోర్టర్‌గా, లాయర్‌గా వృత్తి జీవి తాన్ని కొనసాగించారు. బాను ఒక రచయితగానే కాకుండా మహిళల హక్కుల కోసం గళమెత్తారు. మహిళలు ప్రశ్నించకుండా మతం, సమాజం వారిని ఎలాంటి కట్టుబాట్లలో ఉంచుతాయో తన కథల రూపంలో వ్యక్త పరిచారు. హార్ట్‌ల్యాంప్‌తో పాటు ఆరు చిన్న కథల సంకలనాలు, ఒక నవల, మరికొన్ని రచనలు చేశారు. ఆ సాహితీ సేవలకు గుర్తుగా బాను ముస్తాక్ కర్ణాటక సాహిత్య అకాడమీ, దాన చింతామణి అతిమబ్బె అవార్డులు అందుకున్నారు.

## బెంగళూరు ఎస్‌బిఐలో భాషా వివాదం

### స్థానిక భాషను తిరస్కరించిన బ్యాంకు మేనేజర్ బదలీ!

**బెంగళూరు, మే 21:** బెంగళూరులోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో కన్నడ భాషపై జరిగిన వివాదంపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందించారు. బ్యాంకు మేనేజర్ పౌరులతో నిర్లక్ష్యంగా ప్రవర్తించిన తీరు సరైనది కాదని విమర్శించారు. స్థానిక భాషను బ్యాంకు ఉద్యోగులందరూ గౌరవించాలని, కస్టమర్లను గౌరవిస్తూస్థానికభాషలోనే మాట్లాడాలని సూచించారు. సూర్యనగరలో కన్నడ మాట్లాడటానికి నిరాకరించిన ఎస్‌బిఐ మేనేజర్ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో ఎస్‌బిఐ ఆ మేనేజర్‌ను బదలీ చేసిందని ఇంతటితో ఈ సమస్య సద్దుమణిగినట్లుగా భావిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి ఘటనల పునరావృతం కాకుండా చర్యలుతీసుకోవాలని అధికారులకు సూచించారు. దేశంలోని అన్ని బ్యాంకుల సిబ్బందికి ఆయా ప్రాంతాల సంస్కృతి, భాష వంటి విషయాల్లో శిక్షణ ఇవ్వాలని కేంద్ర ఆర్థిక సేవల విభాగాన్ని కోరారు. భాషా వివాదం కొనసాగుతున్న వేళ ఇటువంటి వ్యాఖ్యల వల్ల ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

# స్కూలు బస్సుపై ఉగ్రదాడి



## నలుగురు మృతి, 38 మందికి గాయాలు

**క్వెట్టా(పాక్),మే 21:** భారత్‌తో కయ్యానికి కాలుదువ్వుతున్న దాయాది దేశం పాకిస్థాన్‌లో తాజాగా ఆత్మాహుతి దాడి జరిగింది. ఉగ్రవాదులు మరోసారి అమాయక ప్రజలపై దాడులకు పాల్పడ్డారు. ఈ బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో ఒక స్కూల్ బస్సును లక్ష్యంగాచేసుకుని బాంబుదాడి చేశారు. ఈ ఘటనలో నలుగురు పిల్లలు అక్కడికక్కడే మరణించగా, మరో 38 మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న స్థానికఅధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ పేలుడును అక్కడి హోంమంత్రి మొహ్సిన్ నఖ్వీ తీవ్రంగా ఖండించారు. మరోవైపు అధికారులు ఈ దాడి ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. స్కూల్ బస్సు పిల్లలను తీసుకెళ్తున్నప్పుడు ఈ దాడి జరిగింది. పేలుడు జరిగిన వెంటనే సహాయ, రక్షణ చర్యలు ప్రారంభమయ్యాయి. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. తీవ్రంగా గాయపడిన పిల్లలను క్వెట్టా, కరాచీలోని పెద్ద ఆసుపత్రులకు తరలించారు. పాకిస్థాన్ హోం మంత్రి మొహ్సిన్ నఖ్వీ ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తూ పిల్లలను లక్ష్యంగా చేసుకునే ఉగ్రవాదులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమన్నారు. దేశంలో భయాన్ని, అస్థిరతను వ్యాప్తి చేయడమే వారిదాడి ఉద్దేశమని, అయితే ప్రభుత్వం, భద్రతా దళాలు వీటిని విజయవంతం చేయనివ్వవని వెల్లడించారు. బలూచిస్థాన్ చాలా కాలంగా పాకిస్థాన్‌కు అత్యంత సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతంగా ఉంది. ఇక్కడి వేర్పాటువాద శక్తులు పాకిస్తాన్ నుంచి విడిపోయి స్వతంత్ర దేశాన్ని కోరుతున్నాయి.

ఈ క్రమంలో అనేకసార్లు పాకిస్థాన్ సైన్యాన్ని, పలువురుని లక్ష్యంగాచేసుకుని దాడులుచేస్తున్నాయి. ఇటీవలేఈ ప్రాంతంలో ఉగ్రవాద ఘటనల సంఖ్య భారీగా పెరగడం విశేషం. ఈ క్రమంలోనే బలూచిస్థాన్‌లో జరిగిన ఈ ఆత్మాహుతి దాడి పాకిస్థాన్ అంతర్గత భద్రతపై మరోసారి ప్రశ్నలను లేవనెత్తింది. భారత ఉపఖండానికి పశ్చిమదిక్కుగా ఉండే బలూచిస్థాన్ ప్రాంతం ప్రకృతి సౌందర్యం, ఖనిజ సంపదలతో ఉంది. ఈ నేలపై ఇప్పుడు పేలుళ్ల శబ్దం వినిపిస్తోంది. గత కొద్ది సంవత్సరాలుగా ఈ ప్రాంతం బలూచ్ వేర్పాటువాదుల కదలికలతో దద్దరిల్లిపోతోంది. ముఖ్యంగా బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్ఎ) పేరుతో విప్లవకారులు పదే పదే పేలుళ్లు, కాల్పుల ద్వారా ప్రభుత్వాన్ని గడగడలాడిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం కిల్లా అబ్దుల్లా నగరంలోని మార్కెట్ వద్ద కార్ బాంబ్ పేలుడులో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇది ఒక్కటే కాదు, మార్చిలో జరిగిన ఘోర ఘటనలో, ఓ రైలు పై దాడి చేసి 33 మందిని, ప్రధానంగా సైనికులను బిఎల్ఎ హతమార్చింది.

## పాకిస్థాన్‌లో భారీగా ట్రెండింగ్ అవుతున్న రాహుల్ గాంధీ

### ఆయన విడియోలు, పోస్టులను పాక్ మీడియాలో విస్తృత ప్రచారం



**న్యూఢిల్లీ, మే 21:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు పాకిస్థాన్‌లో పెద్ద చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్ గురించి ఆయన లేవనెత్తిన ప్రశ్నలను పాకిస్థాన్ మీడియా తమకు అనుకూలంగా మలచుకుంటూ భారీగా ప్రచారం చేసుకుంటున్నది. ఈ పరిణామం భారత రాజకీయ వర్గాల్లోనూ, మాజీ సైనికాధికారుల్లోనూ తీవ్ర చర్చకు దారితీసింది. గతంలో జరిగిన ఆపరేషన్ సిందూర్‌ను ఉద్దేశిస్తూ రాహుల్ గాంధీ సోమవారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పలు ప్రశ్నలు సంధించారు. ఈ ఆపరేషన్ గురించి పాకిస్థాన్ ఆర్మీకి ముందే సమాచారం అందించారని ఆరోపిస్తూ, విదేశాంగమంత్రి ఎస్. జైశంకర్ గతంలో మాట్లాడిన ఓ వీడియోను కూడా ఆయన పంచుకున్నారు. అంతేకాకుండా, ఈ ఆపరేషన్‌లో భారత్ ఎన్ని యుద్ధ విమానాలను కోల్పోయిందో చెప్పాలని డిమాండ్ చేశారు. సైనిక చర్యకు సంబంధించిన సమాచారాన్ని ముందుగానే పాకిస్థాన్‌కి తెలియ జేయడం నేరమని కూడా ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. రాహుల్ గాంధీ చేసిన ఈ వ్యాఖ్యలను పాకిస్థాన్ మీడియా అందిపుచ్చుకుంది. ఆపరేషన్ సిందూర్ విఫలమైందని, ఈ ఆపరేషన్‌లో పాకిస్థాన్ భారత్‌ను ఓడించిందని ఇప్పటికే విస్తృతంగా ప్రచారం చేసుకుంటోంది. భారత దాడుల్లో తమ వైమానిక స్థావరాలు దెబ్బతిన్నప్పటికీ, వైమానిక రక్షణ వ్యవస్థలు దెబ్బతిన్నప్పటికీ, పాకిస్థాన్ మాత్రం తమ ఓటమిని అంగీకరించడం లేదు. పైగా, భారత్‌కు చెందిన ఐదు యుద్ధ విమానాలను, ముఖ్యంగా రాఫెల్ జెట్‌ను కూల్చివేశామని గొప్పలు చెప్పుకుంటోంది. ఇప్పుడు రాహుల్ గాంధీ కూడా భారత్ ఎన్ని యుద్ధ విమానాలను కోల్పోయిందని ప్రశ్నించడంతో, పాకిస్థాన్‌కు ఇది మరింత ఊతమిచ్చినట్లయింది. రాహుల్ ప్రశ్నలు తమ వాదనలకు బలం చేకూర్చేలా ఉన్నాయని భావిస్తూ, పాక్ మీడియా ప్రత్యేక చర్చా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తోంది. అయితే, రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను భారత విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. ఇవి నిరాధారమైన ఆరోపణలని కొట్టిపారేసింది. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా ఉగ్రవాద స్థావరాలను విజయవంతంగా ధ్వంసం చేసిన తర్వాత, పాకిస్థాన్ ఆర్మీ ప్రతిదాడికి దిగిన సందర్భంలోనే విదేశాంగ మంత్రి జైశంకర్ ఆ వ్యాఖ్యలు చేశారని విదేశాంగ శాఖ స్పష్టత ఇచ్చింది. ఆపరేషన్ మొదలైన తర్వాత, మేము కేవలం ఉగ్రవాద స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నామని పాక్ ఆర్మీకి తెలియజేశాము. ఈ విషయంలో వారు జోక్యం చేసుకోవద్దని సూచించాము. కానీ, పాక్ ఆర్మీ మా సూచనను పాటించలేదని జైశంకర్ చెప్పినట్లు విదేశాంగ శాఖ వివరించింది. మరోవైపు, పలువురు మాజీ సైనికాధికారులు కూడా రాహుల్ గాంధీ వ్యాఖ్యలను తప్పుబడుతున్నారు. ఒకవేళ దాడుల గురించి పాకిస్థాన్‌కు ముందే తెలిసి ఉంటే, మురిడ్కే, బహవల్పూర్ వంటి ప్రాంతాల్లోని ఉగ్రవాద శిబిరాల్లో ఉగ్రవాదులను ఎందుకు ఉంచుతారని వారు ప్రశ్నిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్‌లో వంద మందికి పైగా ఉగ్రవాదులు హతమైన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. గతంలో అబోటాబాద్‌లో ఒసామా బిన్ లాడెన్‌ను హతమార్చిన తర్వాత అమెరికా సైతం పాకిస్థాన్‌కు సమాచారం అందించిందని, అలాగే 2019 బాలాకోట్ దాడుల అనంతరం కూడా భారత డిజిఎంఓ ఆపరేషన్ వివరాలను పాకిస్థాన్‌కు తెలియజేశారని, ఇది ఒక సాధారణ సైనిక ప్రక్రియ అని వారన్నారు. సున్నితమైన విషయాలపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వారు సూచిస్తున్నారు.

## బిజెపి అమిత్ మాలవీయ, రిపబ్లిక్ టివి చీఫ్‌లపై కేసునమోదు



**న్యూఢిల్లీ,మే 21:** తప్పుడు సమాచారం వ్యాప్తిచేస్తున్నారన్న అభియోగాలపై బిజెపి ఐటిసెల్ చీఫ్ అమిత్ మాలవియ, రిపబ్లిక్ టివి ఎడిటర్ ఇన్ చీఫ్ అర్నబ్ గోస్వామిలపై అభియోగాలునమోదుచేసారు. హైగ్రౌండ్స్ పోలీస్ స్టేషన్‌లో ఇందుకు సంబంధించి యువజన కాంగ్రెస్ లీగల్‌సెల్ చీఫ్ శ్రీకాంత్ స్వరూప్ బిఎన్ ఫిర్యాదుచేయడంతో కేసులు నమోదు చేసారు. విద్వే షాలను రెచ్చగొట్టే లక్ష్యంతో వ్యాఖ్యలుచేయడం, శాంతియువత వాతావరణం భగ్నం కలిగించే విధంగా కొందరిని అవమానించడం వంటి సెక్షన్లను నమోదుచేసారు. మాలవీయ, గోస్వామిలు ఒకనేరపూరిత ప్రచారం ప్రారంభించారని,టర్కీలోని ఇస్తాంబుల్ కాంగ్రెస్ కేంద్రం భారత జాతీయ కాంగ్రెస్‌కు అంతర్జాతీయ కార్యాలయం అని వ్యాఖ్యలు చేసారని ఆరోపించారు. ఇలాంటి విషప్రచారం విద్వేషాలను మరింత రెచ్చగొట్టేవిధంగా ఉందని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. భారత ప్రజాస్వామిక పునాదులపై అనూహ్య దాడి జరుగుతున్నదని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, కేంద్ర సమాచార ప్రసారాల మంత్రిత్వశాఖ, సిబిఐలు వెంటనే దర్యాప్తును చేపట్టి అందకు కారకులైనవారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

## వక్ఫ్ అనేది దాతృత్వం మాత్రమే.. ఇస్లాంలో భాగం కానేకాదు

### సుప్రీంలో కేంద్రం వాదనలు

**న్యూఢిల్లీ, మే 21:** వక్ఫ్ అనేది దాతృత్వం తప్ప మరొకటి కాదని, అది ఇస్లాంలో ముఖ్యమైన భాగం కాదని కేంద్ర ప్రభుత్వం బుధవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. వక్ఫ్ బోర్డులు లౌకిక విధులను మాత్రమే నిర్వహిస్తాయని చెప్పింది. వక్ఫ్ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం విచారణ చేపట్టగా, కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. వక్ఫ్ అనేది ఇస్లామిక్ భావన. కానీ అది ఇస్లాంలో ముఖ్యమైన భాగం కాదు. వక్ఫ్ అనేది దాతృత్వం తప్ప మరొకటి కాదు. దానధర్మాలు ప్రతి మతంలో భాగం. హిందువులకు దాన ధర్మాలు అనే వ్యవస్థ ఉంది. సిక్కులు కూడా దానిని కలిగి ఉన్నారు. ప్రభుత్వ భూమిపై ఎవరికీ హక్కు లేదు. ప్రభుత్వానికి చెందిన ఆస్తిని వక్ఫ్‌గా ప్రకటిస్తే ప్రభుత్వం ఆ ఆస్తిని కాపాడుకోగలదని సుప్రీంకోర్టు తీర్పు చెబుతోందని తుషార్ మెహతా వ్యాఖ్యానించారు. ఉపశమన ఉత్తర్వులకు సంబంధించి ముందుగా నిర్ణయించిన మూడు అంశాలకే పరిమితమై విచారణ జరగాలని మరోసారి సుప్రీంను మెహతా కోరారు. బ్రిటిష్, వరుస భారత ప్రభుత్వాలు పరిష్కరించలేని సమస్యలను తాజా వక్ఫ్ చట్ట సవరణలు పరిష్కరించాయని తెలిపారు.

## ఉగ్రవాదులే మనకు ఆధారాలిచ్చారు! అందుకే ఆపరేషన్ సిందూర్ విజయవంతం

### గోవాలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్

**పనాజి, మే 21:** ఆపరేషన్ సింధూర్‌కు ఉగ్రవాదులే స్వయంగా ఆధారాలిచ్చారని, అందువల్లనే స్పష్టమైన లక్ష్యంతో ఉగ్రవాద శిబిరాలను ధ్వంసంచేసి ప్రపంచానికి ఆపరేషన్ సింధూర్ సామర్థ్యం చాటిచెప్పిందని భారత ఉపరాష్ట్రపతి జగదీప్‌ధన్‌ఖడ్ అన్నారు. శిబిరాలు ధ్వంసం చేసిన తర్వాత ఉగ్రవాద మృతుల శవపేటికలకు పాకిస్తానీ మిలిటరీ అధికారులు, రాజకీయ నాయకులు రక్షణగా వెళ్లడమే ఇందుకు నిదర్శనమన్నారు. దక్షిణ గోవాలోని వాస్కోలో ఏర్పాటుచేసిన ఒక కార్యక్రమంలో మాట్లాడిన ధన్‌ఖడ్ జైషే మహ్మద్, లష్కరే తాయిబాలకు ఆపరేషన్ సింధూర్ సరైన గుణపాఠం చెప్పిందని, అంతేకాకుండా ఉగ్రవాదం ఏరూపంలో ఉన్నా తుదముట్టిస్తామని ప్రపంచానికి సందేశం పంపించిందని అన్నారు. ప్రధాని నరేంద్రమోడీజీ ఇచ్చిన సందేశానికి అనుగుణంగానే ఉగ్రవాదం ఎంతోకాలం శిక్షార్హం కాకుండా కొనసాగలేదని రుజువుచేసారని ఉపరాష్ట్రపతి అన్నారు. ఉగ్రవాదులను శిక్షించడం అనివార్యమన్నారు. అంతర్జాతీయ సరిహద్దుకు అత్యంత దూరంగా ఉన్న ఈ ఉగ్రశిబిరాలను సాహసోతపేతంగా ధ్వంసంచేయగలిగామని, అదేపహల్గాంవ్ మృతులకు అసలైన నివాళిఅని అన్నారు. ఈ సాహసోపేతమైన చర్యలు తర్వాత ఏ ఒక్కరు కూడా ఆధారాలు అడగలేదని, ఇపుడు ఉగ్రవాదులే ప్రపంచానికి ఆధారాలు చూపించినట్లయిందన్నారు. ఎందుకంటే పాకిస్తాన్‌లో ఉగ్రవాదుల శవపేటికలకు అక్కడి రాజకీయ నాయకులు, మిలిటరీ అధికారులే రక్షణగా పెరేడ్ చేసారని గుర్తుచేసారు. భారత్‌ప్రపంచంలోనే ఒక శక్తివంతమైన ఆర్థికవ్యవస్థగా మారుతున్నదని మారిటైమ్ పవర్‌హౌస్‌గా నడుస్తున్నదన్నారు. గోవా గవర్నర్ పిఎస్ శ్రీధరన్ పిళ్లై, ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, శ్రీపాద్ నాయక్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రన్యారావు కేసులో కీలక పరిణామం..

### సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌పై ఇడి దాడులు!

**బెంగళూరు, మే 21:** బంగారం అక్రమ రవాణా కేసులో అరెస్టయిన కన్నడనటి రన్యారావుకు న్యాయ స్థానం ప్రత్యేక షరతులతో బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. బంగారం అక్రమరవాణా కేసుకు సంబంధించి కర్ణాటక హోంమంత్రి జి.పరమేశ్వరతో సంబంధం ఉన్న శ్రీ సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌పై బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులు చేసింది. ఈ కళాశాలకు ఆయన ఛైర్మన్‌గాఉన్నారు. ఈ కేసులో రన్యారావుకు, కళాశాలకు మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని ఇందులో భాగంగానే కళాశాలకు చెందిన ఆర్థిక రికార్డులను పరిశీలిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు.

## అఫ్ఘానిస్థాన్ వరకు చైనా-పాకిస్థాన్ ఆర్థిక కారిడార్!



### బీజింగ్‌లో మూడుదేశాల విదేశాంగ మంత్రుల భేటీ

**బీజింగ్, మే 21:** భారత్ పొరుగు దేశాలైన చైనా, పాకిస్థాన్ కీలక నిర్ణయం తీసుకున్నాయి. చైనా పాకిస్థాన్ ఆర్థిక నడవా (సిపెక్) ప్రాజెక్టును అఫ్గానిస్థాన్ వరకు విస్తరించడానికి అంగీకరించాయి. బీజింగ్‌లో జరిగిన మూడు దేశాల త్రైపాక్షిక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఇస్లామాబాద్‌లోని పాక్ విదేశాంగ కార్యాలయం ఓ ప్రకటనను విడుదల చేసింది. పాకిస్థాన్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీ, అఫ్గానిస్థాన్ తాత్కాలిక విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ బీజింగ్‌లో అనధికారిక త్రైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో చైనాపాకిస్థాన్ ఆర్థిక కారిడార్‌ను అఫ్గానిస్థాన్ వరకు విస్తరించాలని నిర్ణయించారు. అలాగే మూడు దేశాల అగ్ర నాయకులు త్రైపాక్షిక సహకారాన్ని మరింతగా పెంచుకోవడానికి అంగీకరించారు. పాకిస్థాన్, పీఓకేలోని ఉగ్రవాద స్థావరాలే టార్గెట్‌గా భారత్ ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టిన తర్వాత పాక్ విదేశాంగమంత్రి ఇషాక్ దార్ తొలి చైనా పర్యటన ఇదే కావడం గమనార్హం. మూడు రోజుల పర్యటన నిమిత్తం ఆయన చైనా వెళ్లారు. ఈ క్రమంలో బీజింగ్‌లో జరిగిన త్రైపాక్షిక సమావేశంలో పాల్గొన్నారు. పాకిస్థాన్, చైనా, అఫ్గానిస్థాన్ ప్రాంతీయ శాంతి, స్థిరత్వం, అభివృద్ధి కోసం కలిసి నడుస్తాయని దార్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ముగ్గురు నాయకులు కలిసి ఉన్న ఫొటోను షేర్‌చేశారు. ముగ్గురు విదేశాంగ మంత్రులు ప్రాంతీయ భద్రత, ఆర్థిక అనుసంధానాన్ని ప్రోత్సహించడానికి త్రైపాక్షిక సమావేశాన్ని కీలకమైన వేదికగా అభివర్ణించారు. ఈ మూడు దేశాల విదేశాంగ మంత్రులతో మరో సమావేశాన్ని కాబుల్‌లో నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. దౌత్య సంబంధాలు కొనసాగించడం, కమ్యూనికేషన్లను బలోపేతం చేసుకోవడం, వాణిజ్యం, మౌలిక సదుపాయాలు, అభివృద్ధి వంటివే కీలకమైనవి. వీటి గురించే చర్చించాం. బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ సహకారాన్ని మరింతగా పెంచడానికి చైనాపాకిస్తాన్ ఆర్థిక కారిడార్‌ని అఫ్గానిస్థాన్ వరకు విస్తరించడానికి అంగీకరించారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి, ఈ ప్రాంతంలో స్థిరత్వం, అభివృద్ధిని పెంపొందించడానికి ఉమ్మడిగా కృషి చేస్తామని ముగ్గురు నాయకులు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, 60 బిలియన్ డాలర్లతో చేపట్టినసీపెక్‌ను భారత్ తీవ్రంగా వ్యతిరేస్తూ వస్తోంది. ఈ ప్రాజెక్టులో పాక్ ఆక్రమిత కశ్మీర్ భూభాగం కూడా ఉండటం అందుకు ప్రధాన కారణంగా చెప్పొచ్చు.

## ఆమె హత్యచేయలేదు.. డ్రగ్స్ స్మగ్లర్‌కూడా కాదు!

### మాజీ ఐఎఎస్ పూజా ఖేద్కర్‌కు బెయిల్ మంజూరుచేసిన సుప్రీం

**న్యూఢిల్లీ, మే 21:** ఆమె ఏమీ హత్యలుచేయలేదు కదా, దేశద్రోహం నేరాలకు పాల్పడిందా లేదు కదా అంటూ సుప్రీంకోర్టు దర్యాప్తు అధికారులకు చురకలువేసి మాజీ ఐఎఎస్ ప్రొబేషనరీ అధికారి పూజా ఖేద్కర్‌కు బెయిల్ మంజూరుచేసింది. ఒబిసి కుల ధృవీకరణను తప్పుడు మార్గంలో దాఖలుచేసి ప్రయోజనాలు పొందిందని, సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ఒబిసిద్వారా అనుచిత లబ్ధిని పొందారని ఆమెపై అభియోగాలు నమోదయ్యాయి. జస్టిస్ బివినాగరత్న, సతీష్ చంద్రశర్మలు బెయిల్ మంజూరు చేస్తూ ఖేద్కర్ దర్యాప్తు అధికారులకు సహకరించాలని ఆదేశించారు. ఏమంత తీవ్రమైన తప్పులు చేసింది, ఆమేమీ డ్రగ్స్ స్మగ్లరు కాదు, ఉగ్రవాది అంతకంటే కాదు. ఆమె ఏమీ సెక్షన్ 302 కింద నిందితురాలుకూడా కాదు. ఆమె ఎన్‌డిపిఎస్



కేసుల్లో ఉన్న నిందితురాలుకూడా కాదు. మీకు ఇలాంటి కేసుల్లో స్పష్టమైన సాఫ్ట్‌వేర్ ఉండాలి. దర్యాప్తును పూర్తిచేయండి. ఆమె అన్నీ పోగొట్టుకుంది. మరోచోట ఎక్కడా కూడా ఆమెకు ఉద్యోగం కూడా లభించదని బెంచ్ మౌఖికంగా దర్యాప్తు అధికారులను ఆదేశించింది. కేసు పూర్వాపరాలను పరిశీలించిన తర్వాత ఢిల్లీకోర్టు ఈ నిందితురాలికి బెయిల్ మంజూరుచేసి ఉండాల్సిందని అభిప్రాయపడింది.

# నాటు సారా రహిత రాష్ట్రంగా ఆంధ్ర ప్రదేశ్

## రాష్ట్ర అబ్కారీ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా



ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘం రూపొందించిన డైరీకమ్ హ్యాండ్బుక్‌ను ఆవిష్కరిస్తున్న అబ్కారీ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా

**విజయవాడ , మే 21, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నాటుసారా నుండి పూర్తిగా విముక్తం చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి (ఎక్సైజ్, జిఏడిరాజకీయం) ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. నవోదయం 2.0 కార్యక్రమం అమలులో భాగంగా మంగళగిరిలోని ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో బుధవారం రాష్ట్రస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (ఎక్సైజ్) ముఖేష్ కుమార్ మీనా రాష్ట్రంలోని అన్ని ఎక్సైజ్ అధికారులకు కీలక సూచనలు చేశారు. సెప్టెంబర్ 30 నాటికి రాష్ట్రం మొత్తాన్ని నాటు సారా రహితంగా మార్చాలని తుదిగడువు విధించారు. అధికారులు తక్షణ చర్యలకు దిగాలని ఆదేశించారు. కాకినాడ, తూర్పు గోదావరి, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో గత అనుభవాల ఆధారంగా ప్రత్యేక వ్యూహాలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. అలాగే, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ ప్రవాహాన్ని నిరోధించేందుకు గతంలో తీసుకున్న చర్యలు ఫలప్రదంగా ఉన్నా, మరింత నిఘా అవసరమని అభిప్రాయపడ్డారు. రూ.99 మద్యం బ్రాండ్లు ప్రవేశపెట్టడం వల్ల కట్టడి పక్కాగా జరిగిందని ఆయన పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల, అన్నమయ్య జిల్లాల నుంచి వచ్చిన నివేదికలను సమీక్షించారు. మద్యం విక్రయాల్లో ఎంఆర్పీకి కట్టుబడి ఉండటం, నిర్ణీత సమయాల్లో మాత్రమే అమ్మకాలు జరగడం తప్పనిసరిగా పాటించాలన్నారు. జిల్లాల అధికారులు తమ కేంద్రాలలోనే ఉండి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు వెంటనే స్పందించాలన్నారు. రాత్రిపూట సీనియర్ అధికారుల పహారా తప్పనిసరిగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఎక్సైజ్ డైరెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ అధికారులు ప్రజలతో సంబంధాలు మెరుగుపరచాలని, సమస్యలపై వెంటనే స్పందించేలా వ్యవస్థను సజావుగా నడిపించాలని సూచించారు. రాష్ట్రాన్ని అక్రమ మద్యం నుంచి పూర్తిగా విముక్తం చేయాలన్న లక్ష్యాన్ని సాధించేందుకు సమన్వయంతో, కట్టుదిట్టమైన చర్యలతో ముందుకు సాగాలని పునరుద్ఘాటించారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ రాష్ట్రవ్యాప్తంగా నమోదైన ఐడి లిక్కర్ కేసులు, ఎన్డీపీఎల్ కేసులు , పెండింగ్ అరెస్టులపై సమీక్ష నిర్వహించారు. తీవ్రమైన కేసులను అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్లు దర్యాప్తు చేయాలని, చార్జ్‌షీట్లు వేగంగా దాఖలు చేయాలని, అవసరమైతే పీడీ చట్టం ప్రయోగించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ముఖేష్ కుమార్ మీనా రాష్ట్ర ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘం రూపొందించిన డైరీకమ్ హ్యాండ్బుక్‌ను ఆవిష్కరించారు.

# వైరింగ్ పటిష్టత ఆధారంగా విద్యుత్ ఉపకరణాలు వినియోగించాలి

## - రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్



**విజయవాడ,మే21,ప్రభాతవార్తప్రతినిధి:** వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటుందని ప్రజలు కూడా అగ్ని ప్రమాదాల నివారణలో భాగస్వామ్యం కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన. అగ్నిమాపక సేవల శాఖ డైరక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ డి.జి. మాదిరెడ్డి ప్రతాప్ మాట్లాడుతూ రాష్ట్రం లోని పెద్ద పెద్ద నగరాల్లోని ఓల్డ్ సిటీల్లో అనుకోని అగ్నిప్రమాదం సంభవిస్తే ప్రమాద స్థాయి ఎక్కువగా ఉంటుందని, రహదారులు ఇరుకుగా ఉండటం, షాపుల పై అంతస్థుల్లో నివాస గృహాలు ఉండటం ఇలా పలు కారణాలు ఉంటున్నాయన్నారు. ఉదాహరణకు ఇటీవల హైదరాబాద్ ఛార్మినార్ వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో మృతుల సంఖ్య అధికంగా ఉండటానికి కూడా ఇవే కారణాలుగా స్పష్టమవుతున్నాయన్నారు. మన రాష్ట్రంలోనూ విజయవాడ, విశాఖ, తిరుపతి తదితర పెద్ద పట్టణాల్లో సైతం ఈ ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. కావున ప్రతి ఒక్కరూ ముందు జాగ్రర్త చర్యలు తీసుకుంటే ప్రమాదాలను నివారించిన వారిమవుతామని వివరించారు. పాత భవనాల్లోని విద్యుత్ వైరింగ్ ఇప్పుడు మనం వాడుతున్న విద్యుత్ ఉపకరణాల లోడ్ ను తట్టుకునే విధంగా మార్పు చేసుకోవాలని కోరారు. దీంతో షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలను సగానికి పైగా తగ్గించవచ్చున్నారు. నూతన భవనాల్లో, పాత భవనాల్లో ఎఫ్ఆర్ఎల్ఎస్ వైర్ ను వాడటం వల్ల అధిక ప్రయోజనం ఉంటుందన్నారు. అలాగే ప్రతి గదికి మైక్రో సర్క్యూట్ బ్రేకర్స్ (ఎంసీబీ)లను ఏర్పాటు చేసుకోవాలని, ఏసీలను బిగించే సమయంలోనే వైర్ కెపాసిటీని ఒక సారి పరిశీలించాలని, అలాగే ప్రతి భవనానికి ఎర్తింగ్ చేయించుకోవాలని కోరారు. తక్కువ ఖర్చుతో వీటిని అమర్చుకుంటే నిశ్చింతగా ఉండచ్చని తెలిపారు. షార్ట్ సర్క్యూట్ లేదా అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఎక్కువగా పొగ కమ్ముకోవడంతో ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నారని, కావున ప్రతి గృహంలో స్మోక్ మేనేజ్ మెంట్ లో భాగంగా స్మోక్ డిటెక్టర్లు, ఎగ్జాస్ట్ ఫ్యాన్ లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రతి గృహానికి బ్రీతింగ్ బాల్కాని ఏర్పాటు చేసుకుంటే అధిక ఫలితం ఉంటుందన్నారు. మన రాష్ట్రంలోని శ్రీకాకుళంలో ఓ షాపింగ్ మాల్ లో జరిగిన అగ్ని ప్రమాదంలో అగ్నిమాపక సిబ్బంది లోపలకు వెళ్లడానికే ఆరుగంటల సమయం పట్టిందని, లోపల ఉన్న దుస్తులు కాలడంతో అధిక పొగ కమ్మేసిందని, దీంతో చాలా మంది ఊపిరాడక ఇబ్బంది పడ్డారన్నారు.

# యోగా సాధనతో మానసిక ప్రశాంతత

## - కృష్ణా జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ



యోగాంధ్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న కృష్ణా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ

**విజయవాడ,మే21,ప్రభాతవార్తప్రతినిధి:** యోగా సాధనతో ప్రతి ఒక్కరు మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని కృష్ణా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ అన్నారు. యోగ కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వామ్యులై ఆరోగ్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. రానున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో బుధవారం ఉదయం నగరంలోని జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యోగాంధ్ర 2025 ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే జూన్ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ రోజు బుధవారం యోగాంధ్ర 2025 కార్యక్రమం ప్రారంభించామని, జూన్ 21వ తేదీ వరకు నెలరోజులపాటు జిల్లాలో యోగా పోటీలు తదితర పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. తొలుత జాతీయ, అంతర్జాతీయ యోగా పోటీలలో బంగారు పతకం సాధించిన శిరీష ఆధ్వర్యంలో నిర్ణీత ప్రోటో కాల్ ప్రకారం వజ్రాసనం, తాడాసనం, వృక్షాసనం, త్రికోణాసనం, ఉష్ట్రాసనం, శశాంకాసనం, మకరాసనం, భుజంగాసనం, సేతుబందాసనం, ఉత్థాన పాదాసనం, పవనముక్తాసనం, అమృతాసనం వంటి ఆసనాలు, కపాల భాతి, నాడీ శోధన, శీతలి, భ్రామరి ప్రాణాయామాలు అందరిచేత చేయించారు. యోగా సాధన వలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ముఖ్యంగా మనసుతో శరీరం అనుసంధానం కావడం వలన సంపూర్ణ ఆరోగ్యంతో ఆనందంగా ప్రశాంతమైన జీవనం సాగించవచ్చున్నారు. యోగ కార్యక్రమాలను ఆయుష్ శాఖ వివిధ యోగా సంఘాల సహకారంతో జిల్లా స్థాయిలోనే కాకుండా మండల, గ్రామస్థాయిలో కూడా నిర్వహిస్తామని, యోగ గురువులు వారి శిష్య బృందంతో జిల్లా వ్యాప్తంగా ప్రజలందరికీ యోగ పై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. వేసవి సెలవులు అయ్యాక కళాశాలలు, పాఠశాలల్లో కూడా ఈ యోగా శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు

# ఉద్యోగులను తొలగించం, అపోహాలు వద్దు

## మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి



**విజయవాడ,మే21,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామ, వార్డు సచివాలయాలను రేషనలైజేషన్‌లో మూడు కేటగిరీలుగా విభజన చేశామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి తెలిపారు. ఈ విషయంపై చాలామంది సిబ్బందిలో అపోహాలున్నాయని.. ఏ ఒక్క ఉద్యోగిని తొలగించమని స్పష్టంచేశారు. ఉద్యోగుల మధ్య పని విభజనపై కూడా ఇప్పటికే స్పష్టత ఇచ్చామని అన్నారు. రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి అయ్యాకే.. అవసరాన్ని బట్టి ఉద్యోగుల బదిలీలు చేస్తామని స్పష్టం చేశారు. సాధారణ బదిలీల ప్రక్రియ మాదిరిగా వారి బదిలీలు ఉండవని అన్నారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ కోసం జిల్లాలో మూడంచెల వ్యవస్థ తెస్తామని ప్రకటించారు. ఉద్యోగుల సీనియారిటీతో పదోన్నతికి ఒక ప్రత్యేక చానల్ తెచ్చామని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి గుర్తుచేశారు. ౦షనలైజేషన్ వల్ల పని భారం తగ్గుతుందని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి చెప్పారు. సచివాలయాల సంఖ్య పెరుగుతాయి...అంతే గాని తగ్గించమని స్పష్టం చేశారు. ఇవాళ(బుధవారం) వెలగపూడి సచివాలయంలో ఎస్సీ సబ్‌ప్లాన్ యాక్షన్ ప్లాన్‌పై మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి ఎస్సీ కుటుంబానికి ప్రభుత్వం నుంచి లబ్ధి జరుగుతుందని అన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను వందశాతం ఎస్సీలకే వినియోగించాలని సూచించారు. నోడల్ ఏజెన్సీ అనుమతి లేకుండా ఎలాంటి పనులు చేపట్టవద్దని ఆదేశించారు. ఎస్సీల విద్య, వైద్యం ఆరోగ్యం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఎస్సీ యువతకు స్వయం ఉపాధి, ఎస్సీ కాలనీల్లో మౌలిక సదుపాయాల గురించి మాట్లాడారు. నోడల్ ఏజెన్సీ అనుమతి లేకుండా ఎలాంటి పనులు చేపట్టవద్దని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

## పేదలకు న్యాయం జరిగేలా ఫ్రీ హోల్డ్ భూములపై నిర్ణయం - మంత్రి అనగాని సత్యప్రసాద్

**విజయవాడ,మే21,ప్రభాతవార్తప్రతినిధి:** పేదలకు న్యాయం జరిగేలా ఫ్రీ హోల్డ్ భూములపై నిర్ణయం తీసుకుంటామని మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేసారు, రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన భూపరిపాలనలో సంస్కరణలపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం వెలగపూడిలోని సచివాలయంలో జరిగిన భేటికి మంత్రులు పయ్యావుల కేశవ్, పి.నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, ఎన్ఎండి ఫరూక్, టిజె భరత్ హాజరయ్యారు. ఫ్రీ హోల్డ్ భూములు, 22 ఏ నుండి భూముల తొలగింపు, నాలా రద్దు, సాదాబైనామాలపై చర్చించిన మంత్రివర్గ ఉపసంఘం పేదలకు న్యాయం జరిగేలా ఫ్రీ హోల్డ్ భూములపై నిర్ణయం తీసుకుంటామన్న మంత్రి అనగాని సత్యప్రసాద్ ఫ్రీ హోల్డ్ భూములను 10 కేటగిరీలుగా విభజించగా 8 కేటగిరీలకు మంత్రివర్గ ఉపసంఘం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దాదాపు 3 లక్షల ఎకరాల భూములు పూర్తిగా నిబంధలకు విరుద్దంగా...గత ప్రభుత్వం తన అనుయాయులకు ఫ్రీ హోల్డ్ చేసింది. ఈ భూములపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఎలాంటి చర్యలు తీసుకోవాలో సీఎం చంద్రబాబు నాయుడి గారితో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. ఒక వేళ చట్టవిరుద్దంగా పేదల భూములను ఫ్రీ హోల్డ్ చేసినప్పటికీ వాటిని తిరిగి లాక్కోవడం ఉండదు. అటువంటి పేదలకు మళ్లీ ఆ భూములను మళ్లీ అసైన్ చేస్తాం. మళ్లీ 20 ఏళ్ల తర్వాతనే ఆ భూములు ఫ్రీ హోల్డ్ చేయబడతాయి.



# దుర్గమ్మ ఆలయంలో మంత్రి అచ్చెన్నాయుడు

**ఇంద్రకీలాద్రి, మే 21, ప్రభాతవార్త** అమ్మలగన్నమ్మ బెజవాడ కనకదుర్గమ్మవారిని దర్శించుకునే భక్తులకందిస్తున్న సౌకర్యాలను బుధవారం ఇఓ వికె శీనానాయక్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెప్పుల స్టాండ్, లగేజ్ కౌంటర్లు, మొబైల్ కౌంటర్లను పరిశీలించారు. అక్కడ భక్తులతో ముచ్చటిస్తూ వారివద్ద అధిక ధరలు వసూలు చేస్తున్నారా అనే విషయాన్ని తెలుసుకున్నారు. ఎక్కడికక్కడ చెప్పులు గుట్టలు వుండడం గమనించి చెప్పులను దేవస్థానం కౌంటర్లలోనే వుంచాలని మైక్‌ద్వారా ప్రచారం చేయాలని ఆదేశించారు. ఘాట్‌రోడ్డులో దుకాణాలు పరిశీలించి ఎంఆర్‌పి ధరలకే విక్రయించాలని ఆదేశాలిచ్చారు. లేకుంటే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. భక్తులతో గౌరవంగా మెలగాలన్నారు. ప్రోటోకాల్ ఆఫీస్ వరకు వాహనాలు వస్తుండటంతో భక్తులకు ఇబ్బంది కాబట్టి జాగ్రతలు వహించాలని ప్రోటోకాల్ పర్యవేక్షకులు లక్ష్మణ ్‌కు ఆదేశాలిచ్చారు. ప్లాస్టిక్ వ్యర్థాలు ఇంద్రకీలాద్రికి భారంగా మారుతుండడంతో ప్లాస్టిక్ వాడకం నియంత్రించాలని ఆదేశించారు. తడి, పొడి చెత్త వేరు చేసే ప్రక్రియను పరిశీలించారు. దేవస్థానంలో ఉపయోగంలోలేని గదులు పరిశీలించి శుభ్రం చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన సామాన్య భక్తునివలే క్యూలైన్ ద్వారా దుర్గమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఇఇ కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు హనుమజ్జయంతి ప్రత్యేక పూజలు: అమ్మలగన్నమ్మ బెజవాడ కనకదుర్గమ్మవారి ఆలయంలో నేడు హనుమజ్జయంతి సందర్భంగా ప్రత్యేక పూజాదికాలు నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. మెట్లమార్గంలోని క్షేత్ర పాలకుడైన శ్రీ ఆంజనేయ స్వామి వారికి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీ ఆంజేయస్వామివారికి అభిషేకాదులు, నాగవల్లీ దళార్చన తదితర కార్యక్రమాలు జరుగుతాయని భక్తులు పాల్గొన్నారన్నారు.

\- దుర్గమ్మను దర్శించుకున్న మంత్రి అచ్చంనాయుడు: దుర్గమ్మవారిని బుధవారం రాష్ట్ర మంత్రి అచ్చం నాయుడు బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు దుర్గమ్మవారి మెమంటో ప్రసాదం, శేషవస్త్రం ఇఓ వికె శీనానాయక్ అందించారు. వేదాశీర్వచనాలను పండితులు పలికారు.

\- స్వర్ణగోపురంకు విరాళం: దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న స్వర్ణగోపురం పనులకు విజయవాడకు చెందిన ఎన్ గోపాలరావు దంపతులు రు.1లక్ష 116ల విరాళాన్ని బుధవారం ఆలయాధికారులకు అందించారు. వారికి దుర్గమ్మ దర్శనం ఏర్పాటు చేసిన అధికారులు, ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



జడ్పీ సిఇఒపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యేలు

# ప్రభుత్వం మారినా మాజీ సిఎం ఫోటో తొలగించరా?

## - జడ్పీ సిఇఓపై ఎమ్మెల్యేల ఆగ్రహం

**అనంతపురం సిటీ, మే 21 ప్రభాతవార్త** రాష్ట్రంలో ప్రభుత్వం మారి ఏడాది గడుస్తున్నా జిల్లా పరిషత్‌లో మాజీ సీఎం జగన్‌మహన్‌రెడ్డి ఫోటో తొలగించరా అని జడ్పి సిఇఒ రామచంద్రారెడ్డిపై ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్‌లో జరిగిన సర్వ సభ్య సమావేశానికి ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, ఎం.ఎస్.రాజులు హాజరయ్యేందుకు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్‌లోని జడ్పి చైర్మన్ ఛాంబర్‌లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటం ఉండటం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫోటోకు సముచిత స్థానం లేకపోవడాన్ని గమనించి సిఇఒను పిలిపించి తక్షణమే మాజీ సీఎం ఫోటో తొలగించాలని పట్టుబట్టారు. అదే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫోటోను సైతం సీటుకు ఎదురుగా కాకుండా వెనుకవైపు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో అప్పటికప్పుడు మాజీ సీఎం వైఎస్.జగన్ చిత్రపటాన్ని తొలగించి సీఎం చంద్రబాబు చిత్రపటాన్ని చైర్మన్ వెనుకవైపు ఏర్పాటు చేయించడంతో సమస్య సర్దు మనిగింది.

# రాష్ట్రంలో భయపెట్టి అరాచక పాలన సాగిస్తున్నారు

## హంద్రీ నీవా లైనింగ్ విషయంలో పునరాలోచించాలి

## వైఎస్సార్‌సీఎంపి మిథున్ రెడ్డి ధ్వజం

**అనంతపురం, మే 21, (ప్రభాతవార్త బ్యూరో)** రాష్ట్రంలో భయపెట్టి పాలన సాగించాలని చూస్తున్నారని ఈ అరాచక పాలన ఎక్కువ రోజులు ఉండదని వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. బుధవారం అనంతపురం నగరంలోని సప్తగిరి సర్కిల్లో ఉన్న ఒక హోటల్ లో ఉమ్మడి అనంతపురం జిల్లా లో పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గాల సమన్వయకర్తలు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా కమిటీ నాయకులతో ఎంపీ మిథున్ రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాబోయే కాలంలో ఉమ్మడి అనంతపూర్ జిల్లాలో పార్టీ తరపున చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. సందర్భంగా విలేకరులతో ఎంపీ మిథున్ రెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే రమేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్ రెడ్డిలను పార్టీ తరపున ఉమ్మడి అనంతపూర్ జిల్లా కి పార్టీ అధిష్టాన వర్గం పరిశీలకులను నియమించింది. ఈ సందర్భంగా ఎంపీ మిథున్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఆర్డిటికీ ఎఫ్‌సిఆర్ ఏ నిలిపివేయడం వలన అభివృద్ధి కార్యక్రమాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయని దీనిపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాడుతున్నారు. ఇంటింటికీ రేషన్ సరఫరా వాహనాలు రద్దు చేయడం సరికాదన్నారు. జగన్ పాలనలో మద్యం కుంభకోణం జరగలేదని.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కట్టుకథలు అందుతుందన్నారు. ప్రశ్నించే వారిని అరెస్టులు చేస్తూ డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శలు చేశారు. తమను తాత్కాలికంగా ఇబ్బంది పెట్టవచ్చు కానీ ఈ ప్రభుత్వంపై పోరాటం మాత్రం ఆపేది లేదని మిథున్ రెడ్డి హెచ్చరించారు. రాష్ట్రంలో వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు ఆపడం దారుణం అన్నారు. హంద్రీనీవా లైనింగ్ పనులపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

# ఉమ్మడి అనంతపురం జిల్లా వైఎస్సార్సీ సమన్వయకర్తలతో మిథున్ రెడ్డి భేటీ

## - పార్టీ పరిశీలకులుగా రమేష్ రెడ్డి, నరేష్ కుమార్ రెడ్డి

**అనంతపురం, మే 21 ప్రభాతవార్తబ్యూరో** ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒకవైపు కూటమి ప్రభుత్వ చర్యలను ఎండ కొడుతూ మరోవైపు వైసీపీ బలోపేతం కోసం నియోజకవర్గ సమన్వయ కర్తలతో వైసీపీ రాయలసీమ ఇంచార్జి, ఎంపీ మిథున్ రెడ్డి బుధవారం అనంతపురంలో సమావేశం నిర్వహించారు. స్థానిక సప్తగిరి సర్కిల్‌లోని ఒక ప్రైవేట్ హోటల్లో నిర్వహించే ఈ సమావేశానికి ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అని నియోజకవర్గాల పార్టీ సమన్వయకర్తలు, జిల్లాలో పార్టీ తరఫున రాష్ట్రస్థాయి పదవులు పొందిన వారు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మీడియాను అనుమతించకుండా పార్టీ నేతలతో అంతర్గతంగా మిథున్ రెడ్డి సమావేశాన్ని నిర్వహించారు. రాయలసీమ జిల్లాల్లో హంద్రీ ఒక పథకం కింద ఎక్కువ సాగునీరు భవిష్యత్తులో తీసుకొని వచ్చేందుకు వీలు లేకుండా కాలువ లైనింగ్ పనులు ప్రస్తుతం చేయడాన్ని సమావేశంలో పలువురు తప్పు పట్టినట్టు తెలిసింది. ఇందులో భాగంగా హంద్రీనీవా విషయంలో రైతులను సమీకరించి రాబోయే కాలంలో ఆందోళన కార్యక్రమాలు చేయాలని, ఇందులో భాగంగా వైసిపి రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డిని కూడా జిల్లాకు రప్పించే విషయం చర్చకు వచ్చింది. అదేవిధంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆర్డిటికీ విదేశీ నిధులు నిలుపుదల చేయడంపై వైసీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇందులో భాగంగా హంద్రీ నీవాపైన, ఆర్డిటి విషయంలో వైసీపీ తరఫున రాబోయే కాలంలో ఏం చేయాలన్నది త్వరలో యాక్షన్ ప్లాన్ ప్రకటించాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిసింది. ఇదే సమయంలో హిందూపురం పార్లమెంటుకు మాజీ ఎమ్మెల్యే రమేష్ రెడ్డిని, అనంతపురం పార్లమెంటుకు మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్ రెడ్డిని వైసిపి పరిశీలకులుగా పార్టీ అధిష్టాన వర్గం నియమించిందని, వారితో సమన్వయం చేసుకొని పార్టీ కార్యక్రమాలు ముందు తీసుకెళ్లాలని నియోజకవర్గాల సమన్వయకర్తలకు ఎంపీ మిథున్ రెడ్డి దిశా దశను తెలియజేసినట్లు సమాచారం.

# జగ్గయ్యపేటలో పిడుగుపాటుతో పాక్షికంగా దెబ్బతిన్న జామియా మసీదు మినార్



**జగ్గయ్యపేట, మే 21, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేటలో పిడుగుపాటుతో జామియా మసీదు మినార్ పాక్షికంగా దెబ్బతింది. బుధవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసిన సందర్భంలో జగ్గయ్యపేట పట్టణం పరిసర ప్రాంతాల్లో పిడుగుపాటు సంఘటనలు చోటుచేసుకున్నాయి. పట్టణంలోని జామియా మసీదు మినార్ చంద్రవంకపై భారీ శబ్ధంతో పిడుగు పడింది. దీంతో ఆప్రాంత వాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మినార్ పైభాగంలో స్వల్పంగా బీటలువారాయి. కాగా జగ్గయ్యపేట మండలంలోని మల్కాపురం గ్రామంలో పిడుగు పాటుకు రెండు గొర్రెలు మృతిచెందాయి.

పెనుగంచిప్రోలుకు చెందిన జిడుగు రాణి (18)ని ఆమె భర్త జిడుగు వెంకటనారాయణ (22) హత్యచేసినట్లు సాక్షా ్యధారాలతో రుజువు కావటంతో నందిగామ జడ్జి జీవితఖైదు, జరిమాన విధించినట్లు స్థానిక సిఐ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. 2016 ఏప్రిల్ 24న వీరికి వివాహం కాగా రెండు నెలల కాలంలోనే వెంకటనారాయణ తన భార్య రాణిని శారీరకంగా హింసిస్తూ, మానసికంగా వేధించేవాడని, మరొక స్త్రీతో ఫోన్‌లో మాట్లాడుతూ తనపట్ల దారుణంగా ప్రవర్తిస్తున్నాడని రాణి తన తండ్రికి తెలియజేయగా ఆయన సరిచేస్తానని అన్నట్లు నాటి ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే 2016 జూన్ 8వ తేదీన రాణి తన పిన్ని ఇంటి నుండి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగినట్లు ఆమె మామ శ్రీనివాసరావు ఫిర్యాదిదారుడైన ఆమె తండ్రి దేవరకొండ బ్రహ్మంకు తెలియజేశాడు. ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళి చూసేసరికే రాణి మృతి చెందివుంది.

# యువ శాస్త్రవేత్తలను తయారు చేయడమే ఇస్రో లక్ష్యం

## ఇస్రో చైర్మన్ వి.నారాయణన్



**శ్రీహరికోట (తడ), మే 21 ప్రభాతవార్త**

యువ శాస్త్రవేత్తలను తయారు చేయడమే యువికా కార్యక్రమం లక్ష్యమని ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ పేర్కొన్నారు. వర్చువల్‌గా ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీహరికోటతో పాటు మరో ఆరు కేంద్రాల్లో యువికా కార్యక్రమాలు జరుగుతున్నాయి. యువికా అంటే యువ విజ్ఞాన కార్యక్రమం. కొన్నేళ్లుగా ఈ కార్యక్రమాన్ని ఇస్రో రూపొందించింది. పలు ఇస్రో కేంద్రాలలో యువ శాస్త్రవేత్తలను మమేకం చేసి వారికి అంతరిక్ష పరిశోధన రంగంలో మెళకువలు నేర్పడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. యువికా 2025 కార్యక్రమం దేశంలోని ఏడు ఇస్రో ప్రధాన కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. ఈ నెల 19న ఈ కార్యక్రమం మొదలవగా, యువ శాస్త్రవేత్తలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు మాట్లాడారు. ఏడు కేంద్రాలకు సంబంధించి ఒక్కో కేంద్రంలో 50 మంది చొప్పున ఔత్సాహికులను ఎంపిక చేశారు. శ్రీహరికోటలో ప్రస్తుతం 49 మందితో ఈ కార్యక్రమం జరుగుతోంది. అంతరిక్ష పరిశోధనకు సంబంధించి వివిధ అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహించడం, టెలిస్కోప్ ద్వారా నక్షత్రాలను వీక్షించడం, చిన్న రాకెట్లను తయారు చేయడం వంటి కార్యక్రమాలతో పాటు చిన్నప్పటి నుంచే యోగా అభ్యాసంపై ఉత్సాహం కల్పించడం కూడా యువికలో ఒక భాగంగా ఉంది.

# నిధి భవన్ అగ్ని ప్రమాద ఘటనలో ఎలాంటి దస్త్రాలు కాలిపోలేదు - మంత్రి పయ్యావుల కేశవ్

**విజయవాడ,మే21,ప్రభాతవార్తప్రతినిధి:** నిధి భవన్ అగ్ని ప్రమాద ఘటనలో ఎలాంటి దస్త్రాలు కాలిపోలేదని మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. గుంటూరు జిల్లాలోని మంగళగిరిలో అగ్ని ప్రమాదానికి గురైన నిధి భవన్ ని మంత్రి పరిశీలించారు. అగ్ని ప్రమాదం ఎలా జరిగిందనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పే అండ్ అకౌంట్స్ సంచాలకులు పద్మజ కార్యాలయంలోని వ్యక్తిగత గదిలో ఉన్న ఫ్రిడ్జ్ లోని కంప్రెసర్ కాలిపోవడం వల్లే అగ్ని ప్రమాదం జరిగిందని అధికారులు మంత్రికి వివరించారు. ప్రమాదం జరిగిన వెంటనే ఉద్యోగులను క్షేమంగా కిందకి పంపించామని అధికారులు మంత్రికి తెలియజేశారు. నిధి భవన్ లో ఫైర్ సేఫ్టీ పరికరాలు పనిచేయకపోవడంతో దట్టమైన పొగ వ్యాపించిందని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. తన కార్యాలయంలో సమాచారం అంతా భద్రంగానే ఉందని పే అండ్ అకౌంట్స్ సంచాలకులు పద్మజా తెలిపారు. ఈ ఉదయం నిధిభవన్ లో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ భవనంలో ఖజానా, వర్క్ అకౌంట్స్, పే అండ్ అకౌంట్స్, స్టేట్ ఆడిట్, ఏపీసీఎఫ్ఎస్ ఎస్, ఎంఏపీజీఎల్ ఐ విభాగాలున్నాయి.

# ఎసిబికి చిక్కిన పంచాయితీ కార్యదర్శి

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండల పరిధిలోని గోటు ముక్కుల గ్రామ పంచాయితీ కార్యదర్శి భూ వ్యవహారంలో ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటూ బుధవారం ఉదయం ఎసిబికి చిక్కాడు. గోటు ముక్కుల గ్రామ పంచాయితీ కార్యదర్శి గంగా మోహన్ స్థానికంగా వుండే రాజేందర్ అనే వ్యక్తి నుంచి ఓ భూమికి సంబంధించిన వివాదంలో 18 వేల రూపాయలు లంచంగా తీసుకుంటుండగా అక్కడే మాటువేసిన ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం నిందితుడి నుంచి లంచం డబ్బులను జప్తు చేసి, అరెస్టు చేశారు. వాస్తవానికి ఈ భూమి గురించి బాధితుడు రాజేందర్‌కు మరో వ్యక్తితో వివా దం వుంది. ఈ వివాదం పరిష్కరించేందుకు గంగా మోహన్ లంచం డిమాండ్ చేసి ఎసిబికి దొరికిపోయాడు.

పట్టుబడ్డ పంచాయితీ కార్యదర్శిపై గతంలోనూ ఆరోపణలున్నట్లు అధికారులు తెలిపారు. దాడుల సందర్భంగా ఎసిబి అధికారులు నిందితుడి కార్యాలయంతో పాటు ఇంట్లోనూ సోదాలు చేసి పలు పత్రాలను జప్తు చేశారు.

# నోరు జారితే యాసిడ్‌తో కడుగుతాం..

## ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్, మే 21,ప్రభాతవార్త:** కేటీఆర్ మా సీఎంపై నోరు జారితే, నోటిని యాసిడ్‌తో కడుగుతాం జాగ్రత్తగా ఉండాలని బీర్ల ఐలయ్య హెచ్చరించారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య వీడియో ప్రకటనలో సంచలన వ్యాఖ్యలు చేస్తూ కేటీఆర్ అధికారం కోల్పోయిన తర్వాత పిచ్చెక్కినట్లుగా ప్రవర్తిస్తున్నాడని ధ్వజమెత్తారు. నల్గొండ జిల్లాలో సిఎం రేవంత్ రెడ్డి గురించి అవాక్కులు, చావాక్కులు మాట్లాడటం తగదన్నారు. కేటీఆర్ తన నోరును అదుపులో పెట్టుకోవాలని ఘాటు వ్యాఖ్యలు చేసారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో నల్గొండ ఉమ్మడి జిల్లా మంత్రులు అహర్నిశలు కష్టపడుతూ అభివృద్ధి పనులను కొనసాగిస్తున్నారని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా తాగు, సాగు నీటి ప్రాజె క్టుల పరంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి ముందుండి వాటిని నడిపిస్తున్నారు. మరోవైపు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఢిల్లీ నుంచి నిధులు తీసుకొచ్చి జిల్లాలో రోడ్లు నిర్మిస్తున్నారని తెలిపారు. ఇక కెసిఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ కూలి కులేశ్వరం గా మారిందని ఎద్దేవా చేసారు. స్కాంల చరిత్ర ఆ పార్టీదే అని బిఆర్ఎస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేసారు. ఇక వేయి ఎలుకలు తినిన పిల్లి తీర్థయాత్రలకు వెళ్లినట్టుగా కెసిఆర్ ప్రవర్తిస్తున్నాడని అన్నారు. అభివృద్ధిని, సంక్షే మాన్ని చూసి ఓర్వలేక చిల్లర విమర్శలు చేస్తున్నా రని ఆయన వ్యాఖ్యానించారు.

# సిఎం అజ్ఞానంతో అబద్ధాలు ప్రచారం

## టెర్రరిజాన్ని అంతమొందించేందుకు మోడీ సర్కార్

## రాజీలేని పోరాటం: బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, మే 21 ప్రభాతవార్త:** పాకిస్థానుతో పోరులో కేంద్రంలోని మోడి ప్రభుత్వం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడికి తలొగ్గిందంటూ సిఎం రేవంత్‌రెడ్డి రాజీవ్ గాంధీ వర్ధంతి సభలో మాట్లాడడం అజ్ఞానానికి నిదర్శనమని బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. దేశ భద్రత, విదేశాంగ వ్యవహారాలకు సంబంధించిన అంశాల్లో సిఎం రేవంత్ రెడ్డి తన అజ్ఞానంతో అబద్ధాలను ప్రచారం చేయడం అత్యంత దుర్మార్గమన్నారు. ఇది దేశద్రోహ చర్యతో సమానమని, పాకిస్తానులోని ఉగ్రవాద శిబిరాలను భారత సైన్యం పలుసార్లు ధ్వంసం చేయడమే పాక్ ప్రేరేపిత టెర్రరిజాన్ని అంతమొందించేందుకు కేంద్రంలోని మోడి సర్కార్ రాజీలేని పోరాటం చేస్తోందనడానికి నిదర్శనం అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిళ్లకు తలొగ్గితే పాకిస్తానుపై భారత సైన్యం చేసిన ఆ దాడులు జరిగేవి కావు కదా? అంటూ ప్రశ్నించారు. మన కనుల ముందే వాస్తవాలు ఇలా ఉంటే సిఎం రేవంత్ రెడ్డి అమెరికా అధ్యక్షుడి ఒత్తిడికి మోడి ప్రభుత్వం తలొగ్గిందని, పెహల్గాంలో ఉగ్ర దాడులు జరిగినపుడు ప్రధాని మోడికి బాసట ఉండాల్సిన కేంద్రం మంత్రి కిషన్‌రెడ్డి దుప్పటి కప్పుకుని పడుకున్నారని మాట్లడడానికి అసలు కారణం రాహుల్ గాంధీ మెప్పు పొందడం, తద్వారా తన సిఎం పదవిని కాపాడుకోవడం కోసమే అన్నారు. తాజాగా హైదరాబాద్, చార్మినార్ ప్రాంతంలోని గుల్జార్ హౌసులో అగ్నిప్రమాదం జరిగి 17మంది చనిపోతే, వెంటనే సంఘటనా స్థలానికివెళ్లి పరిస్థితిని సమీక్షించి, బాధితుల కుటుంబాలను ఓదార్చిన నేత కిషన్‌రెడ్డి అన్నారు. బాధితులకు అండగానిలబడి భరోసా ఇవ్వాల్సిన సిఎం రేవంత్ తన నివాసంలో దుప్పటి కప్పుకుని పడు కోవడం బాధ్యా తారాహిత్యానికి నిదర్శనం అన్నారు.

# దళారీ వ్యవస్థను ప్రొత్సహిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిసి పరిస్థితిని వివరించిన మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్

**హైదరాబాద్, మే 21 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో సన్నకారు, చిన్న కారు, రైతులు పడుతున్న ఇక్కట్లను ఎదురవుతున్న కేంద్ర వ్యవసాయ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివ రాజ్ సింగ్‌చౌహాన్‌కు ఉప్పల్ మాజీ శాసన సభ్యులు ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్ వివరించారు. బుధవారం ఢిల్లీలోని కృషిభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్రంలో రైతుల పరిస్థితిని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళారీలను ప్రోత్సహించడం వలన వ్యవసాయ పంటలకు, వాణిజ్య పంటలకు, ధాన్యానికి, పసుపుకి, పత్తికి, మిర్చికి, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందకుండా పోతుందని వాపోయారు. ఫసల్ బీమా యోజన అమల్లో తీసుకువచ్చే విధంగా ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో ఎరువుల కృత్రిమ కొరతలు సృష్టించడం, కొంతమంది వ్యాపారులు కల్తీ విత్తనాలు అమ్మకాల వల్ల రైతులకు నష్టం జరుగుతుందని కేంద్ర మంత్రికి వివరించారు.

వ్యవసాయ శాఖకు అనుబంధంగా ఉన్న అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో కూడుకున్న నోడల్ ఆఫీసర్ని ఒకరిని ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ని కోరారు వ్యవసాయ పనిముట్ల మీద ఉన్న సబ్సిడీలను ఎత్తివేసారని, రైతు రుణ మాఫీ సరిగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయక పోవడం వల్ల ఇంకా వేలాది రైతులు రుణగ్రస్తులు గానే మిగిలారని కొత్తగా పరపతి వ్యవసాయ రుణాలు ఇవ్వటానికి ఏ బ్యాంకులు కూడా ముందుకు రావటం లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర పర్యటనకు వచ్చి గ్రామీణాభివృద్ధిపై, వ్యవసాయంపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించాలని కోరారు.



బుధవారం కరీంనగర్‌లో యాంటీ టెర్రరిజం డే ర్యాలీని ప్రారంభించిన బండి సంజయ్

# ఉగ్రవాద నిర్మూలనే మోడీ సర్కార్ లక్ష్యం

## కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**కరీంనగర్ టౌన్, మే 21, ప్రభాతవార్త:** ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించడమే నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్రప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. పెహల్గాం ఘటన తరువాత దేశ ప్రజల్లో చాలా మార్పు వచ్చిందన్నారు. ఉగ్రవాద నిర్మూలన కోసం జరిగే యుద్ధంలో అవసరమైతే సామాన్య ప్రజలు కూడా పాల్గొనేందుకు సిద్ధమ య్యారన్నారు. పాకిస్తాన్ భూభాగంలోకి వెళ్లి అక్కడి ప్రజల ప్రాణాలకు ఇబ్బంది లేకుండా ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేయడంతోపాటు ఉగ్రవాదులను మట్టుబెట్టిన ఘనత భారత సైన్యానిదేనన్నారు. బుధవారం'ఉగ్రవాద వ్యతిరేక దినం' సందర్భంగా కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.

# సైన్యానికి సిఎం రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పాలి

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మే 21 ప్రభాతవార్త:** పాకిస్థాన్‌పై అపరేషన్ సిందూర్ ద్వారా భారత సైన్యం సాధించిన విజయాన్ని తక్కువ చేస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడటం కాంగ్రెస్ పార్టీ దివాలాకోరుతనానికి నిదర్శనం అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి తీవ్రంగా స్పందించారు. భారత సైన్యం దెబ్బకు ఖంగు తిన్న పాకిస్థాన్ కాళ్లబేరానికి వస్తే యుద్ధం ఆపారని సైన్యం మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసేలా రేవంత్ రెడ్డి మాట్లాడటం దుర్మార్గంగా ఉందన్నారు. భారత సైన్యం ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీస్తూ మాట్లాడిన సిఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అధినాయకత్వం సైన్యానికి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఆధునిక స్వాప్నికుడు రాజీవ్ : మహేష్‌కుమార్

## దేశంలో విప్లవాత్మక మార్పులకు ఆద్యుడు : మంత్రి జూపల్లికృష్ణారావు

## రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించిన కాంగ్రెస్ శ్రేణులు

**హైదరాబాద్, మే 21,ప్రభాతవార్త :** రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున రాష్ట్రవ్యాప్తంగా రాజీవ్ విగ్రహాల వద్ద పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. పంజగుట్ట సర్కిల్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మాజీ మంత్రి జానారెడ్డి, మాజీ ఎంపీ హన్మంత్ రావు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ అనిల్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఇతర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఆధునిక భారత స్వాప్నికుడు రాజీవ్ గాంధీ అని, మహిళలకు గ్రామపంచాయతీలలో రిజర్వేషన్ ఇప్పించిన ఘనత రాజీవ్‌గాంధీ దే అని అన్నారు. శాంతి, స్వేచ్ఛ, సమానత్వం ద్వారా మానవాభివృద్ధిని సాధించవచ్చని ఐక్యరాజ్య సమితిలో రాజీవ్ గాంధీ ఇచ్చిన సందేశానికి ప్రపంచ దేశాధినేతల నుండి ప్రశంసలు వచ్చాయని మహేష్ గౌడ్ గుర్తుచేసుకున్నారు. ప్రపంచాన్ని అరచేతిలో చుట్టేసేలా జీవితంలో కీలకంగా మారిన సెల్ ఫోన్ వ్యవస్థకు పునాది వేసిన మహనీయుడు రాజీవ్‌గాంధీ అని అన్నారు. దేశ నిర్మాణంలో యువతను భాగస్వాములుగా మార్చాలనే ఉన్నతమైన ఆశయంతో చట్ట సవరణ చేసి ఓటు వేసే కనీస వయసును 21 సంవత్సరాల నుండి 18 సంవత్సరాలకు తగ్గించారని గుర్తుచేశారు. రాజీవ్ గాంధీని స్మరించుకునే విధంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయం ప్రాంగణంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి గౌర వించుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర యువతకు స్వయం ఉపాధి కల్పన కోసం రాజీవ్ గాంధీ పేరిట రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. నవోదయ పాఠశాలు, కంప్యూటరీకరణ వంటి సాంకేతికవిప్లవంకు రాజీవ్ గాంధీబాటలు వేశారని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వి.హనుమం తరావు మాట్లాడుతూ, దేశంలో ఐటీ రంగానికి పునాదులు వేసిన మార్గదర్శి, నిరుపేదలకు అండగా నిలిచిన ఆపద్బాంధవుడు, మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్ గాంధీ అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బుధవారం పంజాగుట్టలో రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

# స్థానికసంస్థల బలోపేతంతోనే రాజీవ్‌కు నిజమైన నివాళి

## గాంధీ భవన్‌లో కేన్సర్ బాధితుల కోసం మెగా రక్తదాన శిబిరం

**హైదరాబాద్,మే21,ప్రభాతవార్త:** స్థానికసంస్థల బలోపేతంతోనే రాజవ్‌కు నిజమైన నివాళి యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి అన్నారు. భారతరత్న మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 34 వ వర్ధంతి సందర్భంగా, బుధవారం గాంధీభవన్ లో తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో కేన్సర్ బాధితుల కోసం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈకార్యక్రమానికి విశిష్టఅతిథితులుగా మాజీ ఎంపీ వి.హనుమంత రావు , మాజీ ఎంపీ, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్ , రాష్ట్ర మత్స్యకారుల కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, రాష్ట్ర టిఎం ఆర్ ఇఐఎస్ వైస్ చైర్మన్ ఫహీమ్ ఖురేషి, యువ జన కాంగ్రెస్ రాష్ట్ర ఇంచార్జ్ సయ్యద్ ఖాలీద్ పాల్గొన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారిని అభినందించి ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జక్కిడి శివచరణ్ రెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ భారతదేశాన్ని ఆధునిక టెక్నాలజీ వైపు నడిపించిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రయువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు పలు జిల్లాల,నియోజకవర్గాల నాయకులు పాల్గొన్నారు.

# ఆదివాసి విద్యార్థులు తమ ప్రత్యేకతను కాపాడుకోవాలి

## గిరిజన విద్యార్థుల అకడెమిక్ సక్సెస్ మీట్‌లో మంత్రి సీతక్క



**హైదరాబాద్,మే 21,ప్రభాతవార్త:** ఆదివాసీ గిరిజన విద్యార్థులు తమ ప్రత్యేకతను కాపాడుకోవాలని పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క సూచించారు. బుధవారం బంజారాహిల్స్ లోని కొమురం భీం ఆదివాసి భవన్‌లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అకడమిక్ సక్సెస్ మీట్ 2025 కార్యక్రమానికి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె టెన్త్, ఇంటర్, ఎంసెట్, జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచిన గిరిజన విద్యా సంస్థల విద్యార్థులను సన్మానించారు. చదువులో సత్తా చాటిన గిరిజన విద్యార్థులకు, గిరిజన విద్యా సంస్థల సిబ్బందికి మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. విద్యకు సిఎం రేవంత్ రెడ్డి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని, 8 ఏళ్ల తర్వాత డైట్ ఛార్జీలు, 16 ఏళ్ళ తరువాత కాస్మొటిక్ ఛార్జీలు పెంచినట్లు చెప్పారు. ఎస్సి విద్యార్థులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని అందుకే గిరిజన విద్యా సంస్థల్లో ఉత్తీర్ణత శాతం పెరుగుతోందన్నారు. వచ్చే ఏడాది మరింత మెరుగైన ఫలితాలు సాధిం చాలన్నారు. ఈ ఏడాది నుంచి ఏడాదికి 2 సార్లు టీచర్స్‌కు శిక్షణ ఇవ్వనున్నామని పాఠశాలలు ప్రారంభమయ్యే సమయంలో ఒకదఫా, దసరా సంక్రాంతి మధ్యలో రెండో దఫా ట్రైనింగ్ ఇస్తామన్నారు. 2014 వరకు మన జాతుల మీద, గిరిజన సంస్కృతి మీద పరిశోధన జరిగిందని, గత పది సంవత్సరాల్లో మనసంస్కృతిపై అధ్యయన పరిశోధనలు తగ్గిపోయాన్నారు. బిఆర్ఎస్ పాలనలో ఐటీడీఏలు నిర్వీర్యం అయ్యాయని వీటిని తిరిగి బలోపేతం చేయాలని సిఎం కోరినట్లు తెలిపారు. పది, ఇంటర్ తరువాత స్టూడెంట్స్ గైడెన్స్ దొరకట్లేదని సరైనా మార్గదర్శనం అవసరం అన్నారు. మనల్ని మనం గౌరవంవించుకోవాలనే మొదటిసారిగా ప్రతిభా పురస్కార కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, ప్రతిభా పురస్కారాలు అందుకోలేక పోయిన విద్యార్థులు మరింత పట్టుదలతో చదవాని సూచించారు. ట్రైబల్ అని చెబితే సమాజంలో చిన్నచూపు చూస్తారనే భావన ఇప్పటికి విద్యార్థుల్లో ఉందని అయితే వీటికి భయపడాల్సిన అవసరం లేదన్నారు. మన జాతుల నుంచి ఐఏఎస్, ఐపిఎస్, ఎమ్మెల్యేలు, మంత్రులు ఉన్నారని, మనం ఎవరికి తక్కువ కాదన్నారు.

# రైతు సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

## వానలు పడుతున్నా రైతులకు అందుబాటులో లేని విత్తనాలు: హరీష్‌రావు

**జహీరాబాద్, మే 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని రైతుల సమస్యలను పరిష్కరించడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని మాజీ మంత్రి, సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం సంగారెడ్డి జిల్లా నియోజకవర్గ కేంద్రమైన జహీరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హరీష్‌రావు మాట్లాడుతూ వర్షాకాలం మొదలైనా రైతులకు ఇంత వరకు జనులు జీలుగా, పచ్చిరొట్టె విత్తనాలు సరఫరా చేయకపోవడంతో పాటు విత్తనాల ధరలను పెంచడం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు. రైతు బంధు, రైతు భీమా పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం రామ్ రామ్ పలికిందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాడిన నాటి నుంచి ఇంత వరకు మూడు మార్లు ఇవ్వాల్సిన రైతు బంధు డబ్బులను ఇంత వరకు ఇవ్వలేదన్నారు. వితనాలు, మద్యం ధరలు పెంచుతూ ధరల పెంచడం సర్కార్‌గా కాంగ్రెస్ ప్రభుత్వం మారిందన్నారు. సన్న బియ్యానికి బోనస్ ఇస్తున్నామని చెప్పి అసలు ధాన్యానికి 72 కోట్ల రైతులకు ప్రభుత్వం బాకీ పడిందన్నారు. 25శాతం ధాన్యం ఇంకా కల్లాల్లోనే అకాల వర్షాలకు తడుస్తున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి విత్తనాలను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.



బుధవారం మీడియతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు

**బిఆర్ఎస్ హయాంలోని పథకాలకు సిఎం ప్రారంభోత్సవాలా:** జహీరాబాద్ పట్టణంలో బిఆర్ఎస్ హయాంలో మంజూరు చేసిన రైల్వే ఫ్లైఓవర్ బ్రిడి, ఝరాసంగం మండలంలోని కేంద్రీయ విద్యాలయం, నీమ్స్ 100 ఫీట్ల రోడ్డు నిర్మాణానికి తను శంకుస్థాపనలు చేశానని గుర్తు చేశారు. బసవేశ్వరుడి విగ్రహ స్థలంతో పాటు తనలో పాటు మాజీ ఎంపి బిబి పాటిల్, డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్‌లు ఆర్థిక సహాయం అందించిన బసవేశ్వర విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఏ విధంగా ప్రారంభోత్సవం చేస్తారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జహీ రాబాద్‌కు 100 కోట్లు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్, బిఆర్ఎస్ నాయకుఉ గుండప్ప, ఉమాకాంత్ పాటిల్, కిజర్ యాఫై, రామారావు, రాజేందర్, తట్టు నారాయణ, విజయ్‌కుమార్, షేక్ ఫరీద్, నర్సింలు, సంజీవరెడ్డి, తస్లీమ్, మోహియోద్దిన్, మచ్చేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మసిస్టులను నియమించండి

## మంత్రి దామోదర రాజనర్సింహాకు విజ్ఞప్తి చేసిన ఫార్మసిస్టు ప్రతినిధులు

**హైదరాబాద్,మే 21 ,ప్రభాతవార్త :** రాష్ట్రంలో అన్ని బస్తీ ,పల్లె దవాఖానలలో ఫార్మసిస్ట్స్ లను నియమించాలని తెలంగాణ ప్రభుత్వ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులువైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదరరాజనర్సింహాకు విజ్ఞప్తి చేశారు. బుధవారం వారు ఆయన నివా సంలో కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. అన్ని జిల్లాలో డిఎంహెచ్‌వో పరిధిలోని ఫార్మసీ స్టోర్స్ ,వ్యాక్సిన్ స్టోర్స్‌లలో, మలేరియా, లెప్రసీ, టీబీ సెంటర్లలో ఫార్మసిస్టులను నియమించాలన్నారు. తమ విజ్ఞప్తికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఫార్మసిస్ట్‌లబృందం ప్రతినిధులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఫార్మసిస్ట్ అసోసియేషన్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్ శరత్, అహమదుల్లా, కె.లావణ్య తదితరులు ఉన్నారు.

## 4యేళ్ల క్రితం మహిళ హత్యకేసులో కోర్టు తీర్పు

# నిందితుడికి జీవితఖైదు, రూ.8 వేలు జరిమానా

**ఘట్‌కేసర్, మే 21, ప్రభాతవార్త:** 4 ఏళ్ల క్రితం జరిగిన మహిళా హత్య కేసులో నిందితుడికి జిల్లా న్యాయస్థానం జీవితఖైదుతో పాటు రూ.8 వేలు జరిమానా విధించింది. ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ పందిరి పరుశురాం తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం అంకుశాపూర్ రైల్వేట్రాక్ సమీపంలో చెట్ల పొదల్లో ఓ గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. 2021 జనవరి 4న అంకుశాపూర్‌కు చెందిన కొండల్ రైల్వే అధికారి గ్యార బాలస్వామికి ఫోన్ చేసి శవంకు సంబంధించిన సమాచారం ఇచ్చాడు. అంకుశాపూర్ రైల్వేట్రాక్ యూనిట్ 3 కెఎంస్టోన్ నెం.218/16-18 సమీపంలో 35 నుంచి 45 సంవత్సరాలు కల్గిన మహిళా మృతదేహాన్ని పరిశీలించారు. శవం కుళ్లి పోయిన స్థితిలో ఉండి ముఖ కాలిపోయిందని గుర్తుతెలియని వ్యక్తులు ఆమె ఇక్కడికి తీసుకు వచ్చి హత్య చేశారని బాలస్వామి ఘట్‌కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి ఇన్‌స్పెక్టర్ చంద్రబాబు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొన సాగించారని తెలిపారు. దర్యాప్తులో హత్యగావించబడ్డ మహిళ కూర వెంకటమ్మగా గుర్తిం చారు. కేసు విచారణలో ఆమెను సంగారెడ్డి జిల్లా కంది మండలం ఆరుట్ల గ్రామానికి చెందిన మైనం రాములు అలియాస్ బొట్టు రాములు (47) హత్య చేసి రైల్వేట్రాక్ సమీపంలో శవాన్ని వదిలిపెట్టి వెళ్లాడని తర్వాత నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారని తెలిపారు. దర్యాపు పూర్తయిన తర్వాత నిందితుడిపై చార్జ్ షీట్ దాఖలు చేశారని ఈమేరకు బుధవారం మేడ్చల్ జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి కేసు పూర్వాపరాలు పరిశీలించి ఇరువాదనలు విన్న అనంతరం నిందితుడిపై నేరం రుజువు కావడంతో అతనికి 'జీవితఖైదుతో పాటు రూ.9 వేలు' జరిమానా విధించారని సీఐ పరుశురాం తెలిపారు.



నిందితుడు రాములు

# 9,999 బిల్లులు క్లియర్

## పంచాయతీలకు రూ.153 కోట్లు, ఎస్‌డిఎఫ్‌కు రూ.85 కోట్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే21:** పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఈమేరకు బుధవారం సాయంత్రం గ్రామ పంచాయతీలకు రూ.153కోట్లను విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న 9,990బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం ఒకే రోజున క్లియర్‌చేసింది. ఈఒకే విడతలో రూ.10 లక్షల లోపు బిల్లులను ప్రభుత్వం చెల్లించింది. ఈ క్రమంలో 2024 ఆగస్టు వరకు పెండింగ్‌లో ఉన్నబిల్లులను చెల్లించేందుకు ప్రాధాన్యం ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం పాత బకాయిలను చెల్లించేందుకు సన్నద్ధమై నిధులను సమకూర్చింది. కాగా, పంచాయతీలకు రూ.153 కోట్లు, వీటితో పాటు ఎస్‌డీఎఫ్ (ప్రత్యేక అభివృద్ధి నిధి) కింద చేపట్టిన వివిధ పనులకు రూ.85 కోట్లు విడుదల చేసింది. కాగా చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని కొన్నిరోజులుగా కాంట్రాక్టర్లు, సర్పంచ్‌లు ప్రభుత్వాన్ని కోరుతూ ధర్నాలకు దిగారు.

# సునీతారావుకు షోకాజ్ నోటీసులు

**హైదరాబాద్,మే21,ప్రభాతవార్త:** తెలంగాణ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సునీతా రావుకు అఖిలభారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలంబా షోకాజ్ నోటీసు జారీచేశారు. టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ తన ఇంటికి పదవులు ఇచ్చుకొన్నారని చేసిన వ్యాఖ్యలు, గాంధీ భవన్‌లో నిరసన చేయడాన్ని కాంగ్రెస్ అధిష్టానం తప్పుబట్టింది. క్రమశిక్షణను ఉల్లంఘించినందుకు సునీతా రావుకు జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నోటీసు జారీ చేశారు. సునీతా రావుకు ఏమైనా ఇబ్బంది ఉంటే పార్టీలో చర్చించాలి కానీ బహిరంగంగా మాట్లాడడం తప్పని దీనిపై 7 రోజుల్లో వివరణ ఇవ్వాలని జాతీయ మహిళా కాంగ్రెస్ లేఖలో పేర్కొంది. వివరణ ఇవ్వకపోతే కాంగ్రెస్ నిబంధనల మేరకు చర్యలు ఉంటాయని నోటీసులో అధిష్టానం స్పష్టం చేసింది. టీపీసీసీ చీఫ్ ఛాంబర్ ఎదుట సునీతారావు ధర్నాకు దిగారు. కాంగ్రెస్ మహిళా నేతలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని పోస్టుల విషయంలో మహిళా నాయకులను పార్టీ పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపిస్తూ మహిళా నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. ప్రభుత్వం, కార్పొరేషన్ పదవుల్లోనూ మహిళా నేతలకు సరైన ప్రాధాన్యత దక్కడం లేదని విమర్శించారు. మహేష్ గౌడ్ బంధువులకే పదవులు కట్టబెడుతున్నారంటూ ఆరోపణలు గుప్పించారు. కార్పొరేషన్లు, పార్టీ కమిటీల్లో మహిళా కాంగ్రెస్ నేతలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ సునీతారావు గాంధీ భవన్‌లో ఆందోళనకు దిగారు.

# విశ్రాంత ఐఎఎస్ నాగేశ్వర రావు గుండెపోటుతో మృతి



నాగేశ్వర రావు(ఫైల్)

**హైదరాబాద్, మే21, ప్రభాతవార్త:** విశ్రాంత సీనియర్ ఐఏఎస్ అధికారి గోపిశెట్టి నాగేశ్వర రావు గుండెపోటుతో బుధవారం రాత్రి కన్ను మూశారు. 1988 బ్యాచ్‌కు చెందిన జిఎన్ రావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వివిధ హోదాలలో పని చేసి అందరి నుండి ప్రశంసలు అందుకున్నారు. గుంటూరు కలెక్టర్‌గా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో యువజన సర్వీసెస్ శాఖ కమిషనర్‌గా, పౌరసరఫరాలశాఖ కమిషనర్‌గా, జౌళి శాఖ కమిషనర్‌గా, ఉన్నత విద్యశాఖ కమిషనర్‌గా శిల్పారామం స్పెషల్ ఆఫీసర్‌గా, రాష్ట్ర ప్రభుత్వ రంగసంస్థ సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా సేవలందించారు. ఆయన అకాల మృతి పట్ల పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులు ప్రభుత్వ ఉన్నతాధికారులు తమప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు. ఆయన అంత్యక్రియలు మహాప్రస్థానంలో శుక్రవారం జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

# సకాలంలో ఎరువులు సరఫరా చేయాలి

## కేంద్రానికి వ్యవసాయ మంత్రి తుమ్మల లేఖ

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** తెలంగాణకు కేటాయించిన ఎరువులను సకాలంలో విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జె.పి. నడ్డాకు రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాయడం జరిగింది. ఎప్రిల్, మే నెలలకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన ఎరువులను పూర్తి మొత్తంలో సరఫరా చేయాల్సిందిగా లేఖలో కోరారు. వచ్చే వానాకాలానికి 9.80 లక్షల టన్నుల యూరియాను కేంద్రం రాష్ట్రానికి కేటాయించింది. దానిలో భాగంగా ఎప్రిల్‌లో 1.70 లక్షల టన్నులు, మేలో 1.60 లక్షల టన్నులు కేటాయింపులు చేయగా, గత నెలలో కేవలం 1.20 లక్షల టన్నులు, ఈ నెలలో ఇప్పటి వరకు 52 వేల టన్నులు మాత్రమే సరఫరా చేసినట్లు తెలిపారు.

రాష్ట్ర అవసరాల దృష్ట్యా కేటాయింపులు జరిపిన విధంగా వెంటనే యూరియాను పంపించాల్సిందిగా పేర్కొన్నారు. రాష్ట్ర సర్కార్ గత ఏడాది మాదిరిగానే ఈ సారి కూడా వానాకలం సీజన్ ఆరంభం నాటికి 4 లక్షల నుండి 5 లక్షల టన్నుల మేరకు యూరియాను ముందస్తుగా నిల్వచేసి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఈ నిల్వలు, అప్పుడు సరఫరా కాబడే యూరియాతో కల్పి రైతులకు అందచేయడం ద్వారా ఎక్కడా ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తకుండా చూస్తున్నామని తెలియచేశారు.

# 'హరి హర వీరమల్లు' నుంచి సాంగ్ రిలీజ్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ చారిత్రాత్మక యోధుడిగా కనువిందు చేయనున్న ప్రతిష్టాత్మక చిత్రం హరి హర వీరమల్లు. ప్రముఖ నిర్మాత ఎ.ఎం. రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రానికి క్రిష్ జాగర్లమూడి, జ్యోతి కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తున్నారు. నిధి అగర్వాల్ కథానాయికగా నటి



స్తున్న హరి హర వీరమల్లులో బాబీ డియోల్ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానున్న ఈ సినిమాపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, రెండుగీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి మూడవ గీతంగా అసుర హననం విడుదలైంది. ఈ పాట ఆవిష్కరణ కార్యక్రమాన్ని చిత్ర బృందం ఘనంగా నిర్వహించింది. దేశవ్యాప్తంగా ఉన్న అభిమానులు, ప్రేక్షకుల కోసం తెలుగు, తమిళ, హిందీ వ్యాఖ్యాతలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషం. అసుర హననం గీతం రోమాలు నిక్కబొడుచుకునేలా ఉంది. అసురులపై పోరాడుతున్న యోధుడి యొక్క వీరత్వాన్ని చాటిచెప్పేలా సంగీతం, సాహిత్యం ఉన్నాయి. శ్రోతలలో పోరాట స్ఫూర్తిని రగిల్చేలా కీరవాణి సంగీతం శక్తివంతంగా ఉంది. ఆ సంగీతానికి తగ్గట్టుగా గీత రచయిత రాంబాబు గోశాల.. తన పదునైన సాహిత్యంతో కట్టిపడేశారు. భరతమాత నుదుటి రాత మార్చు ధీమసం వంటి పంక్తులతో తన కలం బలం చూపించారు. గాయనీగాయకులు ఐరా ఉడుపి, కాల భైరవ, సాయిచరణ్ భాస్కరుని, లోకేశ్వర్ ఈదర, హైమత్ మహమ్మద్ తమ గాత్రంతో గీతాన్ని మరోస్థాయికి తీసుకెళ్ళారు. అసుర హననం గీతావిష్కరణ కార్యక్రమంలో సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి మాట్లాడుతూ, హరి హర వీరమల్లు సినిమాతో నా ప్రయాణం ఐదేళ్ల క్రితం రాధాకృష్ణ(క్రిష్)తో మొదలైంది, ఇప్పుడు జ్యోతికృష్ణతో పూర్తవుతుంది. నేను చాలామంది దర్శకులను చూశాను. కానీ, తక్కువమందిలో ఉండే అరుదైన క్వాలిటీ జ్యోతిలో ఉంది. వేగంగా నిర్ణయం తీసుకుంటాడు, ఆ నిర్ణయానికి కట్టుబడి ఉంటాడు. ఎడిటింగ్, గ్రాఫిక్స్, మ్యూజిక్ అన్ని పనులు ఒక్కడే చూసుకుంటూ నిద్రాహారాలు మాని ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డాడు. ఇండస్ట్రీలో వివాద రహితుడిగా ఎ.ఎం. రత్నం గారికి పేరుంది. లిరిక్ రైటర్‌గా ఆయనకు నేను పెద్ద ఫ్యాన్‌ని. ఈ సినిమా రూపంలో ఎ.ఎం. రత్నంకి మరో భారీ విజయం సొంతం అవుతుందని విశ్వసిస్తున్నాను. అలాగే నిర్మాత దయాకర్ గారంటే నాకెంతో గౌరవం. ఈ సినిమాలో ఆయన పాత్ర ఎంతో ఉంది. రాంబాబు లాంటి మంచి గీత రచయితను నాకు జ్యోతికృష్ణ పరిచయం చేశారు. నిధి అగర్వాల్ తన పాత్రను చక్కగా పోషించింది. పవన్ కళ్యాణ్‌ని మీరందరూ పవర్ స్టార్ అంటారు. నేను మూర్తీభవించిన ధర్మాగ్రహం అంటాను. ఆగ్రహం మనందరికీ వస్తుంది. కానీ సమాజం కోసం వచ్చేది ధర్మాగ్రహం. ఆయనకు మాత్రమే సరిపోయేలా హరి హర వీరమల్లును తీర్చిదిద్దారు. జయాప జయాలతో సంబంధం లేకుండా దూసుకు పోయే కార్చిచ్చు పవన్ కళ్యాణ్ గారు. కార్చిచ్చు మీద ఎంత వాన పడినా అది ఆగదు.

# అద్భుతమైన కథతో రాబోతోన్న 'షష్టి పూర్తి'

డా. రాజేంద్ర ప్రసాద్, అర్చన కాంబినేషన్‌లో రూపేష్, ఆకాంక్ష సింగ్ హీరో హీరోయిన్లుగా పవన్ ప్రభ దర్శకత్వంలో మా ఆయి ప్రొడక్షన్స్ పతాకంపై రూపేష్ నిర్మించిన షష్టిపూర్తి చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది. ఇప్పటికే రిలీజ్ చేసిన పాటలు, టీజర్, ట్రైలర్ అన్నీ కూడా ప్రేక్షకుల్లో అంచనాల్ని పెంచేశాయి. మళ్లీ రావా, దేవదాస్, పరంపర ప్రాజెక్ట్‌లతో తెలుగు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్న ఆకాంక్ష సింగ్ ఇప్పుడు షష్టి పూర్తి అంటూ రాబోతోన్నారు. ఈ చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా హీరోయిన్ ఆకాంక్ష సింగ్ మీడియాతో ముచ్చటించారు. ఆమె సినిమా గురించి చెప్పిన విశేషాలివే.. తెలుగులో నేను చాలా గ్యాప్ తరువాత వస్తున్నాను. కరోనా వల్ల నాకు చాలా గ్యాప్ వచ్చింది. హీరో నాని సోదరి దీప్తి గంటా తెరకెక్కించిన మీట్ క్యూట్ చిత్రాన్ని ముందుగా థియేటర్లో రిలీజ్ చేయాలని అనుకున్నారు. కానీ చివరకు ఓటీటీలో వచ్చింది. ఇక ఇప్పుడు షష్టి పూర్తి సినిమా థియేటర్లోకి రాబోతోంది. ఈ చిత్రం అద్భుతంగా ఉంటుంది. టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌లో ఉంటుంది. ఇళయరాజా సంగీతం అందరినీ మెప్పిస్తుంది. షష్టి పూర్తి సినిమాలో జానకి అనే పాత్రలో కనిపిస్తాను. కథను వినేందుకు హైదరాబాద్‌కు వచ్చాను. కథ విన్న వెంటనే, నా పాత్ర గురించి తెలిసిన వెంటనే ఒప్పుకున్నాను. ఇప్పుడు ఇలాంటి కథలు అవసరం. ఓ గ్రామీణ అమ్మాయి పాత్రను పోషించాను. టెంపుల్ ట్రెజరర్‌గా కనిపిస్తాను. అచ్చమైన తెలుగమ్మాయిగా ఈ చిత్రంలో కనిపిస్తాను. ఇంత వరకు నేను అచ్చమైన తెలుగమ్మాయిలా కనిపించే పాత్రను పోషించలేదు. లంగావోణిలు కట్టలేదు. రాజమండ్రిలో నెల రోజులకు పైగా షూటింగ్ చేశాను. గోదావరి ప్రాంతాల్ని ఎప్పటికీ మర్చిపోలేను. ఎండల్లో అక్కడ ఎంతో కష్టపడి షూటింగ్ చేశాం. పడవల్లో ప్రయాణం చేశాం. అవన్నీ నాకు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. గోదావరి అందాల్ని మరింత అందంగా చూపించారు. బెంచ్ లైఫ్‌లో ఇది వరకు నేను రాజేంద్ర ప్రసాద్ గారితో నటించాను. మళ్లీ ఈ చిత్రంలో నటించాను. ఆయనతో కలిసి పని చేయడం వల్ల ఎంతో నేర్చుకున్నాను. మేం ఇద్దరం ఎప్పుడు కలిసి నటించినా గ్లిజరిన్ వాడలేదు. సహజంగానే ఎమోషనల్ సీన్స్‌ను రక్తి కట్టించేవాళ్లం. షష్టి పూర్తి కోసం పని చేస్తుంటే నాకు యాక్టింగ్ స్కూల్‌కు వెళ్లినట్టుగా అనిపించింది. ఈ చిత్రంతో ఎంతో నేర్చుకున్నాను. షష్టి పూర్తి అనేది కేవలం షష్టి పూర్తి గురించే ఉండదు. అన్ని రకాల అంశాలు ఉంటాయి. ఇక ఇందులో నేను కేవలం రెగ్యులర్ హీరోయిన్ పాత్రలో కనిపించను. నా కారెక్టర్‌లో ఎన్నో షేడ్స్ ఉంటాయి. అవన్నీ నేను ఇప్పుడే చెప్పలేను. అవన్నీ మీరు సినిమాలోనే చూడాలి. మా నిర్మాత రూపేష్ చాలా మంచి వ్యక్తి. సినిమాల పట్ల ఎంతో ప్యాషన్ ఉంది. నటుడిగానే కాకుండా నిర్మాతగానూ ఈ చిత్రానికి న్యాయం చేశారు. అందరినీ ఒకతాటిపైకి తీసుకు వచ్చారు. ఇంత గొప్ప చిత్రాన్ని నిర్మించారు. మా దర్శకుడు పవన్‌కు ఓ క్లారిటీ, విజన్ ఉంది. కథ మీద ఆయనకు చాలా పట్టు ఉంది. ఆయనతో పని చేయడం ఎంతో ఆనందంగా ఉంది. నన్ను ఓ మంచి నటిగానే జనాలు గుర్తు పెట్టుకోవాలని అనుకున్నాను.




# గ్రిప్పింగ్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ 'రక్షక్'

రాకింగ్ స్టార్ మంచుమనోజ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన హీరోగా చేస్తున్న కొత్త సినిమాను అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. గ్రిప్పింగ్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రానికి రక్షక్ అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. శ్రీనిధి క్రియేషన్స్ బ్యానర్‌పై నూతన దర్శకుడు నవీన్ కొల్లి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. టైటిల్ పోస్టర్ చాలా ఇన్నోవేటివ్‌గా, ఇంటెన్స్‌గా ఉంది. మంచు మనోజ్ పవర్ ఫుల్ లుక్‌లో కనిపిస్తూ సినిమాపై చాలా ఆసక్తిని కలిగించారు. పోస్టర్‌పై కనిపించే (దాచిన నిజం శాశ్వతంగా దాగి ఉండదు) అనే ట్యాగ్‌లైన్ కథలోని మిస్టరీని సూచిస్తుంది. సెకండ్ ఇన్నింగ్స్‌లో చాలా బిజీగా వున్న మంచు మనోజ్ ప్రస్తుతం భైరవం, మిరాయ్ సినిమాల్లో పవర్‌ఫుల్ క్యారెక్టర్స్ చేస్తున్నారు. ఇప్పుడు రక్షక్ చిత్రంతో మళ్లీ హీరోగా అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సినిమాలో ఆయన ఇంటెన్స్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఈ థ్రిల్లింగ్ క్రైమ్ డ్రామా ప్రేక్షకులకు ఎడ్జ్ ఆఫ్ ది సీట్ ఎక్స్‌పీరియన్స్‌ని అందించబోతోంది. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను మేకర్స్ తెలియజేస్తారు.



# '23' సక్సెస్ మీట్

మల్లేశం, 8 ఎ.ఎం. మెట్రో చిత్రాలతో ప్రశంసలు పొందిన దర్శకుడు రాజ్ ఆర్ లేటెస్ట్ మూవీ 23తో మరో విజయాన్ని అందుకున్నారు. స్టూడియో 99 నిర్మించిన ఈ చిత్రంలో తేజ, తన్మయి ప్రధాన పాత్రలు పోషించారు. వెంకట్ సిద్దారెడ్డి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. ఈ సినిమాని స్పిరిట్ మీడియా డిస్ట్రిబ్యూషన్ చేసింది. మే 16న గ్రాండ్‌గా రిలీజైన ఈ సినిమా ప్రేక్షకులు విమర్శకుల ప్రసంశలు అందుకొని ఘన విజయాన్ని సాధించి సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సక్సెస్ మీట్ నిర్వహించారు.



సక్సెస్ మీట్‌లో డైరెక్టర్ రాజ్ ఆర్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. 23 సినిమాకి రావలసిన సపోర్ట్, ఆదరణ కంటే ఎక్కువ వచ్చింది. ఒక మూవీ సక్సెస్‌కి చాలా పారామీటర్స్ ఉంటాయి. ఈ సినిమా ఛాలెంజింగ్ అని తెలుసు. ఇలాంటి సినిమాతో స్ఫూర్తి పొంది ఇలాంటి కథలు మరొకరు తీస్తారనే ఒక ఉద్దేశంతో తీసిన సినిమా ఇది. అందుకే ఇలాంటి ప్రయోగం చేశాం. సినిమాకిఆడియన్స్ నుంచి యాక్సెప్టెన్సీ వచ్చింది. అదే మా సక్సెస్. ఒక డైరెక్టర్‌గా నాకు అందరికంటే ఫేవరెట్ క్యారెక్టర్ తేజ చేసింది. మొత్తం తన భుజాల మీద మోసాడు. నేను తనని నమ్మాను. ఆ నమ్మకం నిలబెట్టాడు. అందరూ నటీనటులు చాలా అద్భుతంగా చేశారు. సినిమాకి సపోర్ట్ చేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు అన్నారు. తన్మయి మాట్లాడుతూ, మీ అందరి సపోర్ట్‌కి థాంక్యూ. తొలి సినిమాకే ఇలాంటి ఒక క్యారెక్టర్ దొరకడం అదృష్టంగా భావిస్తున్నాను. సినిమా అందరికీ నచ్చింది. చూసిన ప్రతి ఒక్కరు సినిమాని ప్రశంసిస్తున్నారు. మంచి రివ్యూస్ వచ్చాయి. ఈ సినిమాకి విజయాన్ని ఇచ్చిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఈ చాలా మంది అందరూ చూడాలని కోరుకుంటున్నాను. ఇంత మంచిక్యారెక్టర్ ఇచ్చిన మా డైరెక్టర్ రాజ్‌కి థాంక్యూ అన్నారు. తేజ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. మీ అందరి సపోర్ట్‌కి థాంక్యూ. ఒక డెబ్యు యాక్టర్‌కి ఇంత మంచి ఇంటెన్స్ స్టోరీ దొరకడం అదృష్టంగా భావిస్తున్నాను. ఈ అవకాశం ఇచ్చిన డైరెక్టర్ రాజ్‌కి థాంక్యూ. 10 ఏళ్ల తర్వాత చేయాల్సిన రోల్ ఇది. నాపై నమ్మకంతో ఆయన ఈ పాత్రను ఇచ్చారు. రాజు నా జీవితానికి ఒక హోప్ ఇచ్చారు. నా జీవితంలో ఆయన్ని ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటాను. ఈ సినిమాలో అందరూ కూడా అద్భుతంగా పెర్ఫాం చేశా రు. ఈ సినిమాకి పనిచేసిన అందరికీ ధన్య వాదాలు.

# ముంబయి గుహల్లో 'మిరాయ్' కొత్త షెడ్యూల్

సూపర్ హీరో తేజ సజ్జా తన పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ హనుమాన్ తరవాత ఇప్పుడు మరొక ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ మిరాయ్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. యాక్షన్ అడ్వెంచర్ జానర్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించగా, టీజీ విశ్వప్రసాద్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై భారీగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో తేజ సజ్జా సూపర్ యోధగా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. తాజాగాఈ చిత్రానికి సంబంధించిన కొత్త షెడ్యూల్ ముంబయిలోని చారిత్రక గుహల్లో ప్రారంభమైంది. తేజ సజ్జాతో పాటు కొన్ని ప్రధాన పాత్రల నటీనటులు ఈ షెడ్యూల్‌లో పాల్గొంటున్నారు. సినిమాకు సంబంధించిన పనులు షెడ్యూల్ ప్రకారమే జరుగుతున్నాయి, ఆగస్టులో రిలీజ్ సిద్ధమవుతున్నారు. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 8 భాషల్లో, 2డి, 3డి ఫార్మాట్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. తేజ సజ్జా ఈ చిత్రంలో సూపర్ యోధ పాత్ర కోసం మరోసారి కంప్లీట్‌గా మేకోవర్ అయ్యారు. రాకింగ్ స్టార్ మనోజ్ మంచు విలన్‌గా, రీతికా నాయక్ కథానాయికగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన తేజ సజ్జా, మనోజ్ మంచు ఫస్ట్ లుక్ పోస్టర్లు, స్పెషల్ గ్లింప్స్ సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంతో పాటు సినిమాటోగ్రఫీ, స్క్రీన్‌ప్లేను కూడా అందించగా, మణిబాబు కరణం డైలాగ్స్ రాశారు. గౌరహరి సంగీతం అందించగా, శ్రీ నాగేంద్రతంగల ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. వివేక్ కుచిభొట్ల కోప్రొడ్యూసర్.






# నేడే 'వీరరాజు 1991' విడుదల

రాయల్ స్టార్ ప్రొడక్షన్స్ సమర్పణలో కిరణ్ చెరుకూరి నిర్మాతగా, రుద్ర వీరాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం వీరరాజు 1991. రా అండ్ రస్టిక్‌గా తెరకెక్కిన ఈ చిత్రం మే 22న గ్రాండ్ రిలీజ్ కాబోతున్న సందర్భంగా ప్రిరిలీజ్ ఈవెంట్ జరుపుకుంది. సహనిర్మాత శివాన్విత రావు మాట్లాడుతూ, చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ చిత్రం వాళ్ల అమ్మగారు అయిన నిర్మాత కిరణ్ చెరుకూరికి ఎంతో స్పెషల్ అని చెప్పారు. ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాంబాబు గోసాల మాట్లాడుతూ, వీరరాజ్ సినిమాలో రెండు పాటలు రాశాను. గగన్ అందించిన మ్యూజిక్ చాలా బాగుంది. వీరరాజ్ చాలా కష్టపడ్డారు. నిర్మాత చాలా బాగా చూసుకున్నారు అని చెప్పారు. అజయ్ గోష్, బెనర్జీ నటన చాలా బాగుందన్నారు. సినిమా పెద్ద హిట్ అవుతుందన్నారు. అజయ్‌గోష్ మాట్లాడుతూ, పరిశ్రమకు కొత్తవాళ్లు రావాలని, విజయం సాధించి పదిమందికి ఉపాధి కల్పించాలన్నారు. చిన్న సినిమాలను ఆదరించాలని, ఇలాంటి సినిమాలు ఆడితే భవిష్యత్తులో మంచి ఆర్టిస్టులు, టెక్నిషన్స్ పరిచయం అవుతారు. ముఖ్యంగా నిర్మాత కిరణ్ ఎంతో శ్రద్ధతో, ప్రేమతో టీం చూసుకున్నారు. అలాగే బెనర్జీతో పని చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇక కథ విషయానికి వస్తే మత్స్యకారులు జీవితంలో జరిగే మంచి కథను చూపించారు. మత్స్యకారులు జీవితాలను చాలా అద్భుతంగా చూపించారు. ముఖ్యంగా హీరోగా, దర్శకత్వం రెండు పనులను చాలా సమర్ధవంతంగా నిర్వహించిన వీరరాజ్ శ్రమను ప్రేక్షకులు ఆదరిస్తారు అని నమ్మకం వ్యక్తం చేశారు. నిర్మాతగా కిరణ్ చెరుకూరి మంచి అభిరుచి ఉన్న వ్యక్తి అన్నారు. బెనర్జీ మాట్లాడుతూ, అజయ్ గోష్‌తో చాలా తక్కువ సినిమాలే చేశాము కానీ మంచి పరిచయం ఉందన్నారు. అలాగే గొప్ప యాక్టర్ అన్నారు. ప్రొడ్యూసర్ కిరణ్మయ్ లేడి ప్రొడ్యూసర్‌గా మంచి భవిష్యత్తు ఉండాలన్నారు. ఆమె మంచితనమే సినిమాను మరో స్థాయికి తీసుకెళ్తున్నారు. ఫస్ట్ టైం సినిమా తీసినట్లు కాకుండా చాలా బాధ్యతగా, చాలా ప్రేమగా చూసుకున్నారు అని చెప్పారు. నిర్మాత, సహ నిర్మాత ఇద్దరు తల్లీ కూతుర్లకు మంచి పేరు వస్తుందన్నారు. ఇక మరో హార్డ్ వర్కర్ హీరో, డైరెక్టర్ గా పని చేసిన వీరరాజ్ చాలా కష్టపడ్డారు అన్నారు. సినిమా తీయడం కాదు సినిమా రిలీజ్ చేయడం పెద్ద సాహసం అన్నారు. వీరరాజ్ 1991 సినిమాలో పనిచేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్ చెప్పారు. నిర్మాత కిరణ్మయ్ చెరుకూరి మాట్లాడుతూ, సినిమా అందరికి నచ్చుతుందని, సినిమాను ఆదరించాలని కోరారు. హీరో రుద్రవీరాజ్ మాట్లాడుతూ, సినిమాకు పని చేసిన ప్రతి ఒక్కరికి థాంక్స్ చెప్పారు. ఈ సినిమాను సింగిల్ షెడ్యూల్‌లో పూర్తి చేయడానికి ముఖ్య కారణం హరిచరణ్ అన్నారు. చాలా సపోర్ట్‌గా నిలబడి పని చేశారు అన్నారు. కృష్ణ కాంత్ ఒక పాట రాశారు, రాంబాబు గోసాల రెండు పాటలు రాశారు. ప్రతీ టెక్నిషన్స్‌కు థాంక్స్ చెప్పారు. ముఖ్యంగా నిర్మాత కిరణ్మయ్ చెరుకూరికి ధన్యవాదాలు చెప్పారు. వారు లేకపోతే ఈ సినిమా లేదన్నారు. బెనర్జీ సపోర్ట్ చాలా ఉందన్నారు. అలాగే అజయ్ గోష్ చాలా స్పెషల్ అన్నారు. ఆయనతో కథ చెప్పిన నాటి నుంచి నేటి వరకు చాలా సపోర్ట్ చేశారు అన్నారు. ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి చాలామంది ప్రోత్సాహం ఉంది అందులో నెల్లూరు అవుట్ డోర్ షూటింగ్లో పోలీస్ పర్మిషన్లు తీసుకున్న నిర్మాత కిరణ్మయి ఫ్రెండ్ గిరి బొల్లినేని గారికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే రాక్ లయన్ వెంకటేష్, సునీల్ నరెన్, మ్యాంగో మ్యూజిక్ థాంక్స్ చెప్పారు. ఇక వైజాగ్లో తన యాక్టింగ్ నేర్చుకున్న సత్య ఇన్స్టిట్యూట్ కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మే 22 వీరరాజ్ 1991 సినిమా విడుదల అవుతుందని అందరూ కచ్చితంగా సపోర్ట్ చేయాలన్నారు. ముఖ్యంగా మీడియా సపోర్ట్ ఉండాలని కోరారు.



నటీనటులు: రుద్రవీరాజ్, అజయ్ ఘోష్, బెనర్జీ, అర్చన, రాహుల్, గోపారాజ్, కిషోర్ తదితరులు. బ్యానర్: రాయల్ స్టార్ ప్రొడక్షన్స్. నిర్మాత: కిరణ్ చెరుకూరి. స్టోరీస్క్రీన్ ప్లేడైరెక్షన్: రుద్రవీరాజ్.

# కంటెంట్‌ను నమ్మి వస్తున్న మూవీ 'ఒక బృందావనం'

కంటెంట్‌ను నమ్మి రాబోతున్న చిత్రం ఒక బృందావనం. నూతన నటీనటులు బాలు, షిన్నోవాలతో పాటు శుభలేక శుధాకర్, అన్నపూర్ణమ్మ, శివాజీ రాజా, రూప లక్ష్మి ్మ, సాన్విత, కళ్యాణి రాజు, మహేంద్ర, డి.డి. శ్రీనివాస్ మరియు ఇతర సీనియర్ నటీ నటులు ఈ చిత్రంలో నటించారు! బొత్స సత్య దర్శ కత్వంలో కిషోర్ తాటికొండ, వెంకట్ రేగట్టే, ప్రహ్లాద్ బొమ్మినేని, మనోజ్ ఇందుపూరు ఈ చిత్రాన్ని నిర్మించారు. మైత్రీ మూవీస్ ద్వారా ఈ నెల 23న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం ప్రీరిలీజ్ వేడుక మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ కథా నాయకుడు నారా రోహిత్ ముఖ్య అతిథిగా విచ్చేయగా, నిర్మాత సాహు గారపాటి, దర్శకుడు వీఎన్ ఆదిత్యలు విశిష్ట అతిథిలుగా విచ్చేశారు. ఈ సందర్భంగా నారా రోహిత్ మాట్లాడుతూ, ఈ సినిమా కథనాకు తెలుసు. ఇదొక ఇంట్రెస్టింగ్ అండ్ ఫీల్‌గుడ్ ఫిల్మ్. ఇదొక ఓ అబ్బాయి లైఫ్ జర్నీ. ఆర్టిస్టులు, టెక్నిషియన్స్ ఎంతో ఎఫర్ట్ పెట్టారు. సినిమా మీద పాషన్‌తో యూఎస్‌లో జాబ్ చేస్తూ ఈ సినిమా నిర్మించారు. ఈ సినిమాతో అందరికి మంచి సక్సెస్ ఇవ్వాలని కోరుకుంటున్నాను. సినిమా పట్ల ఎంతో పాషన్‌తో ఉన్న హీరో బాలు. బాలు పర్‌ఫార్మెన్స్ అందర్ని అలరిస్తుంది. అందరూ ఈ సినిమా తప్పకుండా చూడాలని కోరుకుంటున్నాను. అందరికి ఓ మంచి బ్యూటిఫుల్ సినిమాను చూశామన్న అనుభూతి కలుగుతుంది అన్నారు. వీఎన్ ఆదిత్య మాట్లాడుతూ, ఈ సినిమా నిర్మాతలతో నాకు మంచి జర్నీ ఉంది. ఈ సినిమా నేను చూశాను. ఈ సినిమా చూసిన వారందరూ హీరో బాలు ప్రేమలో పడతారు. బాలుకు నటుడిగా మంచి భవిష్యత్ ఉంది. నిర్మాతలు ఎంతో నిజాయితీగా ఓ మంచి అటెంప్ట్ చేశారు. సినిమాను ఎలా తీయాలో నేర్చుకుని వచ్చి నిర్మాతలు ఈ సినిమా తీశారు. ఇది ఫ్యామిలీ డ్రామానేకాదు. ఓ మంచి యూత్‌ఫుల్ సినిమా అందర్ని అలరిస్తుంది అన్నారు. సాహు గారపాటి మాట్లాడుతూ ఈ సినిమా అందరి డ్రీమ్స్‌ను నేరవేరుస్తుందనే నమ్మకం ఉంది. హీరో అన్నింట్లో శిక్షణ తీసుకుని చేశారు. అన్ని ఎలిమెంట్స్ ఈచిత్రంలో ఉన్నాయి. తప్పకుండా ఈ చిత్రం అందరికి శుభారాంభాన్ని ఇస్తుందనే నమ్మకం ఉంది అన్నారు. నిర్మాత మనోజ్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి వచ్చేసిన అందరికిథ్యాంక్స్. సినిమా చేసిన వాళ్లంతా టెక్నిషియన్స్ వర్క్ కూడా అప్రిషియేట్ చేస్తారు. అందరూ సినిమాకు బెస్ట్ ఇచ్చారు. అందరూ ఎంజాయ్ చేస్తూ ఈ సినిమా మేకింగ్ ప్రాసెస్‌ను ఫీల్ అయ్యాం అన్నారు.





# మహిళలకు ఉపాధి నైపుణ్యాలను కల్పిస్తూ..

కుట్లు, అల్లికలు.. వీటినో వ్యాపకంగానే భావిస్తుంటారు. చాలామంది. కానీ ఇవే నైపుణ్యాల్ని వ్యాపారంలా మార్చుకునే వారు కనిపిస్తారు. ఆ జాబితాలో ముంబయికి చెందిన హీనా పటేల్ ఒకరు. గర్భిణిగా ఉన్నప్పుడు పుట్టబోయే తన కవల పిల్లల కోసం నాణ్యమైన నూలుతో స్వెటర్స్, ఇతర యాక్సెసరీస్ అల్లడం ప్రారంభించిన ఆమె.. ఆపై కూడా తన ఈ అభిరుచిని కొనసాగించింది. ఈ మక్కువే తనను ఓ వ్యాపారవేత్తగా కూడా మార్చింది. ప్రస్తుతం అల్లికలతో కోట్లు సంపాదిస్తున్న హీనా.. తన బిజినెస్‌లో వందల మంది మహిళలకు ఉపాధి కూడా కల్పిస్తోంది. మహిళలుగా మన తోటి వారికీ చేయూత నందించినప్పుడే మహిళాభివృద్ధి సాధ్యమవుతున్న ఈ నిట్టింగ్ లేడీ బిజినెస్ జర్నీ..! బ్యాంకింగ్ కెరీర్ వదిలి! పెళ్లై, పిల్లలు పుట్టాక కొందరు మహిళలు తమ కెరీర్‌కు స్వస్తి పలికి ఇంటికే పరిమితమవ్వాలనుకుంటారు. ఇల్లు, పిల్లల బాధ్యతలు నిర్వర్తించాలనుకుంటారు. ఈ కోరికనే ఖాళీ దొరికినప్పుడల్లా తమ అభిరుచులకు పదును పెడతారు. అలా హీనా కూడా గర్భం దాల్చాక తన 15 ఏళ్ల సుదీర్ఘ బ్యాంకింగ్ కెరీర్‌ను వదిలి.. గృహిణిగా ఉండాలనుకుంది. ఈ సమయంలోనే అల్లికలపై దృష్టి పెట్టానంటోందామె. నేను స్కూల్లో ఉన్నప్పుడు కుట్లు, అల్లికల గురించి మొదటిసారి విన్నా. అది నాకెంతో నచ్చింది. కెరీర్‌లో స్థిరపడ్డాక వీటిపై దృష్టి పెట్టే అవకాశం రాలేదు. అయితే పెళ్లై, గర్భం దాల్చాక ఇంటికే పరిమితమవ్వాలనుకున్నా. గృహిణిగా, అమ్మగా నా బాధ్యతలు నిర్వర్తించాలనుకున్నా. ఈ ఆలోచనే నా 15 ఏళ్ల బ్యాంకింగ్ కెరీర్‌కు స్వస్తి పలికేలా చేసింది. అల్లికలపై దృష్టి పెట్టేందుకు ఇదే సరైన సమయం అనిపించింది. అందుకే గర్భిణిగా ఉన్నప్పుడే పుట్టబోయే నా కవల పిల్లల కోసం స్వెటర్లు, టవల్స్, ఇతర యాక్సెసరీస్.. వంటివి అల్లేదాన్ని ఇక ప్రసవం తర్వాత కూడా నా అభిరుచిని కొనసాగించా. నేను రూపొందించిన దుస్తులు, ఇతర వస్తువుల్ని ఓ ఫేస్‌బుక్ పేజీ క్రియేట్ చేసి.. అందులో ఉంచేదాన్ని. అవి చాలామందికి నచ్చి మాకు ఫలానా అల్లిక కావాలంటూ ఆర్డర్ చేసేవారు. అలా రోజు గడుస్తున్న కొద్దీ నా అల్లికలకు ఆదరణ పెరుగుతూ పోయింది. అలా ఓ సారి ఆసియాలోనే ప్రముఖ కిడ్స్ స్టోర్ మా డిజైన్లను ఎంచుకొని.. వాళ్ల వెబ్‌సైట్‌లో ఉంచింది. అంతేకాదు.. తమకు ఫలానా అల్లిక దుస్తులు, వస్తువులు కావాలంటూ ఆర్డర్ కూడా ఇచ్చింది. ఈ అర్డరే నాలో వ్యాపా ఆలోచనకు ప్రాణం పోసింది..' అంటోంది హీనా.

**దుస్తులు, యాక్సెసరీస్!** మార్కెట్లో తన అల్లికలకున్న డిమాండ్‌ను గ్రహించిన హీనా.. రూ. లక్ష పెట్టుబడి పెట్టి 2020లో 'మ్యాజిక్ నీడిల్స్' అనే సంస్థను ప్రారంభించింది. మి.5 సాధారణంగా అల్లికలంటే స్వెటర్స్, క్యాప్స్, సాక్స్. వంటివే గుర్తొస్తాయి. కానీ మారుతున్న కాలానికి అనుగుణంగా మా అల్లికల్లో మార్పులు తీసుకొస్తున్నాం. ఈ కుట్లు అల్లికలతోనే ఫ్యాషనబుల్ దుస్తులు, ఇతర యాక్సెసరీలు, గృహాలంకరణ వస్తువులు, ఫ్లవర్‌వాజు.. వంటివెన్నో తయారుచేస్తున్నాం. అయితే



మొదట్లో అల్లికల కోసం వాడే నూలు/ ఊలు దారాల్ని నేను విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు అక్కడ కొని తెచ్చుకునేదాన్ని. ఆపై మన దేశంలో నాణ్యమైన నూలు దారాల కొరత ఉందని తెలుసుకున్నాక అల్లికలకు ఉపయోగపడే దారాలు, సూదులు, ఇతర సామగ్రిని ఇక్కడే సరసమైన ధరల్లో అమ్మాలని పించింది. ఈ ఆలోచనతోనే 'హాబీ స్టోర్'కు ప్రాణం పోశా.. అంటోన్న హీనా..తన సంస్థ వేదికగా పిల్లలు, పెద్దల కోసం వివిధ రకాల ఫ్యాషనబుల్ దుస్తులు తయారు చేసి విక్రయిస్తోంది. వీటిలో బ్రా. బ్రాలెట్, స్కార్ఫ్, హ్యాండ్‌బ్యాగ్స్, కీచెయిన్స్.. స్థిరంగా ఎక్కువమంది ఇష్టపడుతున్నారామె.

**300 మంది మహిళలకు చేయూ!** ప్రస్తుతం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వేదికగా తన అల్లిక వస్తువులను విక్రయిస్తున్న హీనాకు విదేశాల్లోనూ కస్టమర్లున్నారు. యూకే, యూఎస్‌తో పాటు 35 దేశాలకు తన అల్లికల్ని ఎగుమతి చేస్తున్న ఆమె.. తన చుట్టూ ఉండే మహిళలకూ ఈ నైపుణ్యాలు నేర్పిస్తూ వారిని ఆర్థికంగా అభివృద్ధి చేశారు. మహిళలుగా మనం ఒక్కరమే ఎదగడం కాదు. తోటివారికి చేయూతనందించాలనిపించింది. ఈ ఆలోచనతోనే నా చుట్టూ ఉన్న మహిళలకు కుట్లు, అల్లికల్లో నైపుణ్యాలు నేర్పించి పనిలో చేర్చుకున్నా. అలా ప్రస్తుతం మా సంస్థలో సుమారు 300 మంది మహిళలు పనిచేస్తున్నారు. మరి కొందరు ఇందులో నైపుణ్యాలు సంపాదించి సొంతంగా వ్యాపారాలూ ఉన్నాయి. 'మాకు ఆసక్తి ఉంది' అని మా వద్దకొస్తే చాలు.. వారికి ఉచితంగా నైపుణ్యాలు నేర్పించి మా సంస్థలో ఆయా సంస్థలు అప్పగిస్తున్నాం.. అంటోన్న హీనా.. ప్రస్తుతం తన వ్యాపారం ద్వారా ఎంతోమంది మహిళలను సాధికారత దిశగా నడిపిస్తోంది. అంతేకాదు.. తన సంస్థ ద్వారా ఏడాదికి దాదాపు రూ.8.5 కోట్ల రూపాయలు ఆర్జిస్తోంది. తాను తయారుచేసే ప్రతి వస్తువు/ ఫ్యాషన్ పర్యావరణ హితంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకుంటోన్న ఈ నిట్టింగ్ క్వీన్.. ముంబైలో ఏర్పాటు చేసిన స్టోర్‌కి వెళ్తే.. పెన్ స్టాండ్, కుషన్స్, ఫ్లవర్‌వాజ్, ఆఖరికి అందులో అమర్చిన పువ్వులు, అల్లికల ద్వారా రూపొందించబడినవే కనిపిస్తాయి.

# జీవన సూత్రాలు పాటిస్తే..




యవ్వనంలోలా ఉండాలని ఏ మహిళకు ఉండదు చెప్పండి. కానీ కొంతమంది ఏళ్లు గడిచినా చిన్న వాళ్లలా కనిపిస్తే.. కొందరినేమో త్వరగా వృద్ధాప్యం పలకరిస్తుంది. ఇది వారి వంశ పారంపర్యమేమో అనుకుంటాం. కానీ కొన్ని జీవన సూత్రాలు పాటిస్తే ఎవరైనా వయసును తగ్గించుకోవచ్చు అంటున్నారు నిపుణులు. అవేంటంటే..

**చన్నీటి స్నానం :** సీజన్ ఏదైనా చల్లటి నీళ్లతో స్నానం చేస్తే వచ్చే లాభాలు అనేకం. ఇది మెటబాలిజాన్ని పెంచటమే కాదు. రక్త ప్రసరణనూ వృద్ధి చేస్తుంది. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచి, యవ్వనంగా కనిపించేలా చేస్తుంది.

**ఉపవాసం..** కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ఉపవాసం ఉంటూనే ఉంటాం. వారంలో ఒక రోజు తప్పనిసరి చేసుకోండి. జీర్ణవ్యవస్థకు ఇలా అప్పుడప్పుడే విశ్రాంతినిస్తే.. చర్మంలో కొత్త కణాల వృద్ధి జరుగుతుంది. దీంతో వృద్ధాప్య ఛాయలూ త్వరగా ఏర్పడవు. అలానే మైండ్‌ఫుల్ ఈటింగ్.. అంటే తినే ప్రతి ముద్దనీ ఆస్వాదిస్తూ తినాలట.ఇదీ మనల్ని నిత్య యవ్వనంగా ఉంచుతుంది.

**కళలతో..** మీకు డ్యాన్స్ చేసే అలవాటు ఉందా లేదా సంగీత వాద్యాలేమైనా వాయించగలరా? లేదంటే నేర్చుకోండి. ఎందుకంటే క్రమం తప్పకుండా నాట్యం చేసేవాళ్లు శారీరకంగానే కాదు..మానసికంగానూ ఫిట్‌గా తయారవుతారు. ఇక సంగీతంలో ప్రవేశం ఉంటే.. కాగ్నిటివ్ సామర్థ్యం పెరిగి, కొత్త ఆలోచనలకీ ఆస్కారం ఉంటుంది.

**కృతజ్ఞతలు చెప్పండి..** ఈ తీరు ఆశావహ దృక్పథాన్ని ఏర్పరుస్తుంది. ఉత్సాహంగా ఉరకలు వేసే మనసు యవ్వనానికి ప్రతీకే కదా! పోనీ ఒత్తిడి లేకపోయినా ఆ ప్రభావం శరీరం మీద సానుకూల ప్రభావం చూపుతుంది. ఇదీ మేలు చేసేదే! అందుకే ఎప్పుడూ నవ్వుతూ ఉండండి. కొత్త పరిచయాలు ఏర్పరచుకోండి. నలుగురితోనూ మంచి బంధాలు వారి ఆయుష్షు పెరగటమే కాదు. వృద్ధాప్యమూ త్వరగా దరిచేరదట.











# ఫ్యాషన్‌లో పర్యావరణహితం !



మనసుకి నచ్చిందల్లా కొనేసి.. కొన్నాళ్లు వాడి పక్కన పడేసే యువతరం తీరు మారింది. మినమలిజాన్ని అనుసరిస్తూనే.. తమ అలవాట్లతో పాటూ ఫ్యాషన్ ఎంపికల్లోనూ పర్యావరణంపై ప్రేమను చాటుకుంటోంది జెన్‌జీ తరం. అందుకేనేమో, రీయూజబుల్, బయోడిగ్రేడబుల్.. అంటూ గత కొన్నాళ్లుగా ఫ్యాషన్ ప్రపంచంలో 'సస్టైనబుల్' రకాల సందడి పెరిగింది. అలాగని ఈ ట్రెండ్ దుస్తులకే పరిమితం కాలేదు. లోలాకులు, గాజులు, గొలుసులు, యాక్సెసరీలు.. ఇలా ఒకటేమిటి అన్నింటికీ ఈ సూత్రమే కొనసాగుతోంది. మెటల్ రకాలకు బదులు త్రెడ్, క్లాత్, వంటివి ఉపయోగించి చేసిన నయా జ్యుయెలరీ ఇప్పుడు వారి మనసు దోచేస్తోంది. తేలిగ్గా ఉండటం, రీయూజ్ చేసుకోగలగడం, భూమిలోనూ త్వరగా కలిసిపోగలగడంతో వీటిని ఎంచుకుంటోందీతరం. అందుకే, నచ్చిన రంగుల్లో ఎంబ్రాయిడరీ, పెయింటింగ్ వంటి సోకులు చేర్చిన ఈ నగల్ని ఎంపిక చేసుకుని మురిసిపోతున్నారు అమ్మాయిలు. మీరూ ఆ డిజైన్లను చూడండి.. నచ్చేస్తాయి మరి.


























# అటుకుల కేక్



**కావల్సినవి :...** మైదా పిండి - 3 కప్పులు, అటుకులు-ఒకటిన్నర కప్పులు (నానబెట్టి గుజ్జులా చేసుకోవాలి. అరటిపండు - 2 (ముక్కలు చేసుకోవాలి), పంచదార - 2 కప్పులు పీనట్ బటర్, బటర్ - పావు కప్పు చొప్పున, బేకింగ్ సోడా-2 టీ స్పూన్లు, పాలు- 2 కప్పులు వెనిలా ఎసెన్స్ - అర టీ స్పూన్ .

**తయారీ విధాన మిలా...**

ముందుగా మిక్సీ బౌల్లో పంచదార వేసుకుని పొడి చేసుకుని, అందులో బటర్, పీనట్,అరటిపండు ముక్కలు వేసుకుని మెత్తగా పేస్ట్‌లా చేసుకోవాలి. ఒక బౌల్లోకి ఆ మిశ్రమాన్ని తీసుకుని.. అందులో బేకింగ్ సోడా, పాలు, మైదాపిండి, అటుకుల పేస్ట్ ఒకదాని తర్వాత ఒకటి వేసుకుని బాగా కలపుకోవాలి. అనంతరం నచ్చిన షేప్‌లో కేక్ మేకర్ తీసుకుని.. అందులో ఈ మిశ్రమం వేసుకుని సుమారు 45 నిమిషాల పాటు ఓవెన్ బేక్ చేసుకోవాలి. ఆ కేక్‌ని కాస్త చల్లారనిచ్చి.. నచ్చిన విధంగా క్రీమ్, ఫ్రూట్స్‌తో డెకరేట్ చేసుకుని,కట్ చేసుకుని చేసుకుంటే సరిపోతుంది.

**చెలి చిట్కా**

బ్రేక్ ఫాస్ట్‌లో పండ్లు పచ్చి కూరగాయలు ఆహారంగా తీసుకోండి. ఇవి ఆకలి మితంగా వుండటానికి జ్ఞాపకశక్తికి, చక్కని శరీరాకృతికి మంచి ఛాయ రావడానికి తోడ్పడు తుంది.

# ఉద్వేగ లోపాలు సరిదిద్దండి..

**వ్యథ**



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

**ప్రశ్న :** నా స్నేహితురాలు భర్త మీద కోపంతో మగవారి మీద కక్ష పెంచుకున్నది. ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త మోసగాడని తెలిసి విడాకులు తీసుకున్నది. ఇప్పుడు ప్రేమ పేరుతో మగవారిని వేధిస్తోంది. మాటల సందర్భంలో ఆమె వ్యవహారం తెలిసి సున్నితంగా మందలించాను. అయినా ఆమె లక్ష్య పెట్టకుండా టెక్నాలజీ ఆసరాతో కొందరిని వేధిస్తోందని తెలిసింది. ఆమె సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటుంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ (ట్విట్టర్)లను తన మోసాలకు వేదికగా చేసుకున్నది. కొందరు మగవారితో నెమ్మదిగా స్నేహం చేస్తుంది. వయసుతో సంబంధం లేకుండా వారి పట్ల ఇష్టం ఉన్నట్టు మెసేజెస్ పెడుతుంది. వారి ఆడియోలు, వీడియోలు రికార్డు చేస్తుంది. తరువాత బ్లాక్‌మెయిల్ చేసి డబ్బు గుంజుతుంది. ఇప్పుడు ఆమెకు ఇదొక వృత్తి, వ్యసనంగా మారింది. జీవితాన్ని చేజేతులా నాశనం చేసుకుంటున్నది. ఆమె విజయవాడలో నాతో పాటు ఎంబిఎ చదివింది. కొంత అందంగా చాలా చురుగ్గా ఉంటుంది. ఎం.బి.ఎలో చేరక ముందు నుంచే ఒక అబ్బాయితో ప్రేమలో పడింది. ఇంట్లో తెలిసి తల్లి తండ్రులు మందలించడంతో మారినట్టు నటించింది. జీవితంలో స్థిరపడిన తరువాత తల్లిదండ్రులను ఎదిరించి అతన్ని పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నది. చదువు పూర్తికాగానే బెంగళూరులో ఉద్యోగం సంపాదించింది. అప్పటికి ఆమె ప్రేమించిన వ్యక్తి కూడ బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. అతను ఎం.టెక్ చదివి ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో మేనేజర్‌గా ఉన్నాడు. ఇద్దరికి మంచి ఉద్యోగం, జీతం వస్తుండటంతో పెద్దలను పట్టించుకోకుండా మిత్రుల సహకారంతో గుడిలో పెళ్లి చేసుకున్నారు. మూడేళ్ల క్రితం పెళ్ళి చేసుకుని ఒక అద్దె ఇంటిలో కాపురం పెట్టారు. కాపురం పెట్టిన వారానికే అతను వ్యసనపరుడని తెలిసింది. రోజు తాగి ఇంటికి వచ్చేవాడు. దీనితో ఆమె గొడవపడి తాగుడు మానేయమని హెచ్చరించింది. ప్రేమకు తాగుడు అడ్డుకాదని, తన వ్యక్తిగత విషయాలలో జోక్యం చేసుకోవద్దని తిరగబడ్డాడు. మనసు చంపుకుని సర్దుకుని బ్రతుకున్న సమయంలో అతనికి మరొక ఆమెతో సంబంధం ఉన్నట్టు తెలిసి సహించలేకపోయింది. పోలీసు కేసులు పెట్టి ఆఖరికి రెండున్నర ఏళ్ళు తరువాత పరస్పర అంగీకారంతో విడాకులు పొందింది. ఈ గొడవల వల్ల ఉద్యోగం పోగొట్టుకున్నది. మగవారిని మోసం చేసి బ్రతుకుతున్నది. తెలివి తేటలు,చదువు ఉండి దారితప్పిన ఆమెలో పరివర్తన తీసుకు వచ్చే మార్గం చెప్పండి. - ఒక సోదరి, విజయవాడ.

**జబాబు :** అమ్మా, చదువు, సంస్కారం, వ్యక్తిత్వం, ప్రవర్తన ఉద్వేగాలు వేరు వేరుగా ఉంటాయి. చదువువల్ల ఇవన్నీ అబ్బుతాయని భావిస్తాము. అయితే కొందరు ఎంత చదువుకున్నా, గొప్ప హోదాలో ఉన్నా వివేకరహితంగా ప్రవర్తిస్తుంటారు. దీనికి పలు కారణాలు దోహదం చేస్తాయి. పెరిగిన వాతావరణం, పెంపకం, పరిసరాలు, ఆలోచనలు, హార్మోన్లు వ్యక్తి చిత్తంపై ప్రభావం చూపుతుంటాయి. మీ స్నేహితురాలిలో ఉద్వేగ లోపాలు ఉన్నాయని భావించాలి. దీనికి హార్మోన్ల లోపం తోడయి ఉండవచ్చు. అందుకే కళ్ళు మూసుకుని ప్రేమించింది. పెద్దలను కాదనుకుని పెళ్ళి చేసుకున్నది. తరువాత భర్తతో సర్దుకోలేక విడాకులు తీసుకున్నది. ఇప్పుడు మగవారిపై కక్ష పెంచుకుని వేధించి ఆనందించడం, మోసం చేసి డబ్బు సంపాదించడం అలవాటు చేసుకున్నది. ఆమెను కన్న తండ్రి కూడ మగవాడే అన్న విజ్ఞాత స్ఫురిస్తే మగవారిలో తండ్రి, సోదరరులు కనిపిస్తారు. మంచి అనుభవం ఉన్న సైకాలజిస్టు ద్వారా కౌన్సెలింగ్ చేయిస్తే మార్పు వస్తుంది. కాగ్నిటివ్ బిహేవియర్ థెరపి చేయిస్తే ఆమెలో వివేకం వికసిస్తుంది. ముందు మీరు ఆమె తల్లితండ్రులతో మాట్లాడి ఆమెను ఇంటికి తీసుకునిరండి. ప్రేమ, ఆదరణ కల్పించి, కొత్త అవకాశాలు చూపండి. జీవితం పట్ల ఆశలు కల్పించి కౌన్సెలింగ్ చేయించండి.



# ఇంట్లోనే పిండిమర!



పాత తరం పిండిమరకి కొత్తతరం ఎలక్ట్రిక్ టచ్ ఇస్తే ఎలా ఉంటుందీ అనుకున్నారేమో తయారీదారులు ఇదిగో ఇక్కడున్న వుడ్ అండ్ గ్రానైట్ స్టోన్ ఎలక్ట్రిక్ గ్రైన్ మిల్‌ని తీసుకొచ్చారు. దీంతో పప్పులూ, ధాన్యాలూ ఇంట్లోనే పిండి పట్టుకోవచ్చు. మామూలు మిక్సర్, గ్రైండరు అయితే ధాన్యాలూ, పప్పులూ ఆడించి పిండి చేసుకోవడానికి వీలుగా ఉండవు. కానీ ఇంటి అవసరాల కోసమే తయారు చేసిన ఈ ఎలక్ట్రిక్ మిల్‌లో మాత్రం బయట మిల్లులో పట్టించినట్టే పిండి వస్తుంది. ఎన్నిరకాల మిక్సీలు వచ్చినా కొందరు సంప్రదాయ పద్ధతుల్లో పట్టిన పిండే రుచిగా ఉంటుందంటారు. అలాంటి వారికి ఈ హోమ్ మిల్ మెషీన్ మంచి చాయిస్.. బయటికి వెళ్లే పని లేకుండా ఇంట్లోనే పిండిని పట్టుకోవచ్చు.

# షిరిడీలో ప్రథమ గురుపూర్ణిమ

**ఆధ్యాత్మికం**



సాయి ద్వారాకమాయిలోని స్తంభాన్ని చూపుతూ "రేపు ఆ స్తంభాన్ని పూజించు" అన్నారు. నూల్కర్ తన బసకు వెళ్లాడు. మరుసటి రోజు శనివారం ఉదయం నిద్ర లేవగానే నూల్కర్‌కు ఆ రోజు గురుపూర్ణిమ అని గుర్తు వచ్చింది. ఇక అందరితోను ఆ విషయం చెప్పాడు. అందరూ వెళ్ళి సాయిబాబాను గురు పూజ చేసుకోవటానికి అనుమతించమని వేడుకున్నారు. అతి కష్టం మీద బాబాను ఒప్పించగలిగారు. ఆ శనివారం నాడే షిరిడీలో ప్రథమ గురుపూర్ణిమ జరిగింది. ఎందుకంటే నాన సాహెబ్ చందోర్కరకు నూల్కర్ ఉత్తరం వ్రాశాడు. శనివారం నాడు నేను నిద్ర లేవగానే, ఆ రోజు గురుపూర్ణిమ అని గుర్తుకు వచ్చింది. వెంటనే అందరం సాన్నాహాలు మొదలుపెట్టం. భిక్ష నుండి తిరిగి రాగానే పూజ చేసుకోవటానికి అనుమతించారు సాయిబాబా. షోడసోపచారాలతో తమను పూజిస్తుంటే అభ్యంతరమేమి చెప్పక మౌనంగా ఉన్నారు. ఆయనకు సమర్పించిన దక్షిణనంతా పూజ పూర్తినకాగానే అందరికి తిరిగి ఇచ్చేసారు. పూజ, ఆరతి జరుగుతున్నాయని రాధాకృష్ణ ఆయీకి దాదాభట్ కబురు చేశాడు. ఆమెతన పూజా సామగ్రిని పంపించింది. తన పూజా సామగ్రితో నానా కూడా వచ్చాడు. నూల్కర్ వ్రాసిన ఉతకతరం ఏ నెలలో, ఏ సంవత్సరంలో వ్రాశాడో తెలియదు. అయితే నూల్కర్ 1909లో షిరిడీని ప్రప్రథమంగా సందర్శించాడు. 1911 మార్చి నెలలో పరమపదించాడు. నూల్కర్ 1908లో మొదటిసారిగా షిరిడీ చేరారని, 1908లోనే ప్రథమ గురుపూర్ణిమ జరిగిందని డాక్టర్ గవాకంకర్ అభిప్రాయాన్ని శ్రీ ఎం.బి.నింబాల్కర్ తమ రచనలలో తెలిపారు. నూల్కర్ ఉత్తరం ప్రకారం శనివారం 1909లో మాత్రమే వస్తుంది. కనుక షిరిడీలో ప్రథమ గురుపూర్ణిమ 1909 జూలై 3న జరిగింది. సాయి జరిపించుకున్నారు.

ఓం సద్గురు సాయినాథాయనమః

- యం.పి.సాయినాథ్

### ఫ్రెంచ్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో..

## భారత్ నంబర్ వన్ సుమిత్ శుభారంభం



**న్యూఢిల్లీ:** ఫ్రెంచ్ ఓపెన్ గ్లాండ్‌స్లామ్ టెన్నిస్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో భారత్ నంబర్ వన్ సుమిత్ నగాల్ శుభారంభం చేశాడు. పారిస్‌లో జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 170వ ర్యాంకర్ సుమిత్ 6-1, 6-1తో వరల్డ్ 141వ ర్యాంకర్, అమెరికాకు చెందిన మిచెల్ క్రెగెర్‌పై గెలుపొందాడు. 74 నిముషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ ఒక ఏస్ సంధించి, ఒక డబుల్ ఫాల్ట్ చేశాడు. తన సర్వీస్‌ను ఒక్కసారి కూడా కోల్పోని సుమిత్ ప్రత్యర్థి సర్వీస్‌ను 5 సార్లు బ్రేక్ చేశాడు. సుమిత్ నెగ్గిన మొత్తం 59 పాయింట్లలో 22 విన్నర్స్ ఉన్నాయి. 14 అనవసర తప్పిదాలు చేసిన సుమిత్ నెట్ వద్దకు 10 సారులన దూసుకొచ్చి 8 సార్లు పాయింట్లు గెలిచాడు. రెండో రౌండ్‌లో ప్రంచ 225వ ర్యాంకర్, ఆస్ట్రేలియాకు చెందిన జురిజ్ రొడియోనోవ్‌తో సుమిత్ తలపడనున్నాడు. 27 ఏళ్ల సుమిత్ తన కెరీర్‌లో ఎనిమిదిసారులన గ్రాండ్‌స్లామ్ టోర్నీలో మెయిన్ డ్రాకు అర్హత సాధించాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మూడు సార్లు, ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్‌లో ఒక్కసారి, యూఎస్ ఓఎన్‌లో మూడు సార్లు అతను మెయిన్ డ్రాలో పోటీ పడ్డాడు. 2020 యూఎస్ ఓపెన్‌లో, 2024 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రెండో రౌండ్‌కు చేరడం సుమిత్ గ్రాండ్‌స్లామ్ కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శనగా ఉంది.

## బ్యాడ్మింటన్ టోర్నీ నుంచి సింధు నిష్క్రమణ



**న్యూఢిల్లీ:** మలేషియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్-2025లో డబుల్ ఒలింపిక్ పతక విజేత పివి సింధు మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించింది. అయితే పురుషుల సింగిల్స్‌లో మాత్రం హెచ్ఎస్ ప్రణయ్, సతీష్ కరుణాకరన్ అద్భుతమైన విజయాలు సాధించి రెండో రౌండ్‌కు చేరుకున్నారు. బుధవారం జరిగిన సూపర్ 500 టోర్నమెంట్‌లో తొలి రౌండ్‌ను క్లియర్ చేయడంలో విఫలమైన సింధు పేలవమైన ఫామ్ కొనసాగింది, వియత్నాంకు చెందిన న్గుయెన్ తుయ్ లిన్హ్ చేతిలో 11-21, 21-14, 15-21 తేడాతో ఓడిపోయింది. కాగా ఈ టోర్నమెంట్‌లో 1 గంటా 22 నిమిషాల పాటు జరిగిన హోరాహోరీ పోరులో ప్రణయ్ మొదటగా కోర్టులో జపాన్‌కు చెందిన ఐదవ సీడ్ కెంటా నిషిమోటో ఢీకొని అతడిని 19-21, 21-17, 21-16 తేడాతో ఓడించాడు. కరుణాకరన్ చైనీస్ తైపీకి చెందిన మూడో సీడ్ చౌ టియెన్ చెన్‌ను 21-13, 21-14 తేడాతో కేవలం 39 నిమిషాల్లో ఓడించడం ద్వారా కూడా నిరాశపరిచాడు. అలాగే కెనడాకు చెందిన బ్రియాన్ యాంగ్‌ను 20-22, 21-10, 21-8 తేడాతో ఓడించిన భారత్‌కు చెందిన ప్లేయర్ ఆయుష్ శెట్టి కూడా పురోగతి సాధించాడు.




### వరల్డ్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ ఫైనల్స్

## ముగిసిన భారత్ పోరాటం

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక టేబుల్ టెన్నిస్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో భారత సింగిల్స్ ఆటగాళ్ల పోరాటం ముగిసింది. మహిళల సింగిల్స్‌లో మనిక బాత్రా, దివ్యతో పాటు పురుషుల సింగిల్స్‌లో మానవ్ టక్కర్ రెండో రౌండ్‌కే వెనుదిరిగారు. ఖతార్‌లోని దోహాలో జరిగిన మహిళల రౌండ్ ఆఫ్ 64 మ్యాచ్‌లో రిపబ్లిక్ ఆఫ్ కొరియాకు చెందిన గా హ్యోన్ పార్క్ చేతిలో భారత్ స్టార్ ప్యాడ్లర్ మానికా బాత్రా ఓటమి చెందింది. దీంతో మానికా ప్రపంచ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ ఫైనల్స్-2025 నుండి నిష్క్రమించింది. వరల్డ్ ర్యాంక్‌లో 46వ స్థానంలో ఉన్న మానికా తన తొలి రౌండ్ మ్యాచ్‌లో నైజీరియాకు చెందిన ఫాతిమో బెల్లోను ఓడించింది. అయితే తదుపరి మ్యాచ్‌లో హ్యోన్ పార్క్ చేతిలో 4-0 (11-8, 11-7, 11-5, 11-8) తేడాతో ఓడిపోయింది. 144వ ర్యాంక్‌లో ఉన్న పార్క్ 35 నిముషాలకు పైగా కనసాగిన మ్యాచ్‌లో మానికాను ఓడించింది. అలాగే దియా చిటాలే 64వ రౌండ్‌లో చైనీస్ తైపీకి చెందిన మూడుసార్లు ఒలింపియన్ చెంగ్ ఐ చింగ్ చేతిలో ఓటమిపాలైంది. తొలి మూడు గేముల్లో వెనుకబడిన చిటాలే టోర్నమెంట్‌నుండి నిష్క్రమించింది. మొదటి మూడు గేమ్‌లలో ఓడిన తర్వాత నాల్గవ గేమ్‌లో పుంజుకుంది. అయితే చెంగ్ ఐదవ గేమ్‌లో 4-1 (11-3, 11-7, 11-6, 6-11, 11-15)తో చిటాలేను ఓడించింది. కాగా పురుషుల మ్యాచ్‌లో 48వ ర్యాంకర్ మానవ్ 2-4 (11-13, 3-11, 11-9, 6-11, 11-9, 3-11)తో హరిమొటొ తొమొకజు (జపాన్) చేతిలో పోరాడి ఓడాడు. మ్యాచ్ ఓడినా మానవ్ పోరాటం ఆకట్టుకుంది. మరో పోరులో దివ్య 1-4 (3-7, 7-11, 6-11, 11-6, 5-11)తో చైనీస్ తైపీ అమ్మాయి చెన్ ఐ చింగ్‌కు తలవంచింది. ఈ ఓటములతో సింగిల్స్ ఈవెంట్‌లో భారతదేశం యొక్క సవాలు ముగిసింది.

# ఐపిఎల్ స్టార్లకు లక్

### టీమిండియాలో చోటు.. అనుకోని ప్లేయర్ల అద్భుత ప్రదర్శన



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025, సీజన్ 18 గుర్తింపులేని ఆటగాళ్లకు వెలుగులోకి వచ్చేందుకు అత్యుత్తమ వేదికగా నిలిచింది. అనుకోని ఆటగాళ్ల అద్భుత ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. కొందరు శక్తివంతంగా మెరిస్తూ, జాతీయ జట్టులోకి ఎక్కి తమ స్థానం పటిష్టం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఐపీఎల్ చివర దశలోకి చేరుతున్న సందర్భంగా, త్వరలోనే భారత టి20 జట్టులో చోటు సంపాదించే అవకాశం కలిగి అద్భుత ప్రదర్శనలు చేస్తున్న నాలుగు ఆటగాళ్ల ఉన్నారు. శుభ్‌మన్ గిల్ టి20 ఫార్మాట్‌లో తన స్థిరతతో ఆకట్టుకుంటున్నాడు. అశుతోష్ శర్మ అత్యుత్తమ ఫినిషర్‌గా ఎదిగిపోతున్నాడు. నేహాల్ వాధెరా కష్టకాలంలో ఆటను నిలబెట్టే అంకర్‌గా గుర్తింపు పొందాడు. ప్రసిద్ధ్ క్రిష్ణ బౌలింగ్‌లో శక్తివంతమైన పరిణామాన్ని చూపించి టి20 వరల్డ్ కప్ కోసం గట్టిగా పోటీ పెడుతున్నాడు. గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ టెస్ట్ కెప్టెన్సీకి ప్రధాన అభ్యర్థిగా ఉన్నాడు. రోహిత్ శర్మ ఒడిఐల నుండి రిటైర్ అయితే, ఆ ఫార్మాట్‌కు కూడా గిల్ నాయకత్వ బాధ్యతలు తీసుకునే అవకాశం ఉంది. ఈ సీజన్‌లో 12 మ్యాచ్‌ల్లో 601 పరుగులు, 155 స్ట్రైక్ రేట్, 60 సగటుతో గిల్ అదరగొట్టాడు. గత మూడు సీజన్లలో 483, 890, 426 పరుగులతో గిల్ తన స్థిరతను నిరూపించాడు. అతని క్లాసిక్ షాట్లు మరియు స్ట్రోక్‌ప్లే టఫ్ కండిషన్లలో ఇండియాకు ప్లస్ అవుతాయి. ఇక అశుతోష్ శర్మ ఒక ప్రత్యేకమైన ఫినిషర్. కఠిన పరిస్థితుల్లో వచ్చినా మ్యాచ్‌ని తిరగరాయగల సామర్థ్యం అతనిలో ఉంది. 2024లో పంజాబ్ కింగ్స్ తరపున 11 మ్యాచ్‌ల్లో 189 పరుగులు, 167.2 స్ట్రైక్ రేట్‌తో ఉన్నాడు. ఇప్పుడు ఢిల్లీ క్యాపిటల్స్‌కు కీలక ఆటగాడిగా ఎదిగాడు. ఈ ఐపీఎల్‌లో 11 మ్యాచ్‌లలో 187 పరుగులు 167.5 స్ట్రైక్ రేట్. ఈ స్థిరత అతన్ని భారత టి20 జట్టులో నెం.5 లేదా 6 స్థానానికి సరిపోయే ఆటగాడిగా నిలబెడుతుంది. అలాగే పంజాబ్ కింగ్స్ ఘనమైన ఐపీఎల్ ప్రదర్శనకు ప్రధానంగా టాప్ ఆర్డర్‌లో శ్రేయాస్ అయ్యర్, ప్రభ్‌సిమ్రన్ సింగ్, ప్రియాంశ్ ఆర్యలు ఉన్నా, మధ్యలో బాటింగ్‌ను నిలబెట్టినది నేహాల్ వాధెరానే. బెంగళూరులో టఫ్ పిచ్‌లో 19 బంతుల్లో 33 నాటౌట్, 206 లక్ష్యాన్ని చేధించే సమయంలో 4 వికెట్లు కోల్పోయిన తరువాత 62(41), అలాగే రాజస్థాన్‌పై 70(37) ఇన్నింగ్స్‌లు అతని సామర్థ్యాన్ని చూపించాయి. అతని స్థిరత మరియు ప్రశాంతత కారణంగా అతనికి త్వరలోనే నేషనల్ కాల్‌అప్ రావచ్చు. ఇక ఈ ఐపీఎల్‌లో ప్రసిద్ధ్ క్రిష్ణ తన కెరీర్‌లో జాష్ హాజిల్‌వుడ్ లాంటి ట్రాన్స్‌ఫర్మేషన్ చూపించాడు. అతను వేగాన్ని, లెంగ్త్‌ను, లైన్‌ను తగినట్లు మార్చుకుంటూ బౌలింగ్ చేస్తున్నాడు. ప్రస్తుతం బిగి టేబుల్ టాపర్‌గా ఉన్నా, అతను 12 మ్యాచ్‌లలో 21 వికెట్లు తీసి పర్పుల్ క్యాప్ హోల్డర్‌గా ఉన్నాడు. 17 సగటుతో అతని ఫార్మ్ అద్భుతంగా ఉంది. అతని లైన్లు మరియు లెంగ్త్ అతన్ని గి20 వరల్డ్ కప్ 2026కు అర్హుడిగా నిలబెడుతున్నాయి.



### మాస్టర్స్ వరల్డ్ టోర్నీలో..

## శ్రీకాంత్ ముందంజ

### మెయిన్ డ్రాకు అర్హత.. తరుణ్, అన్‌మోల్ ఓటమి

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్న ప్రపంచ మాజీ నంబర్ వన్, భారత్ అగ్రశ్రేణి షట్లర్ కిడాంబి శ్రీకాంత్ మళ్లీ ఫామ్‌లోకి వస్తున్నాడు. కౌలాలంపూర్‌లో ప్రారంభమైన మలేషియా ఓపెన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నీలో శ్రీకాంత్ మెయిన్ డ్రాకు అర్హత సాధించాడు. క్వాలిఫయింగ్ దశలో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన శ్రీకాంత్ మెయిన్ డ్రాలోకి అడుగు పెట్టాడు. ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 65వ స్థానంలో ఉన్న శ్రీకాంత్ తొలి రౌండ్‌లో 21-8, 21-13తో చైనీస్ తైపీకి చెందిన కువో కువాన్ లిన్‌పై గెలుపొందాడు. అనంతరం రెండో రౌండ్‌లో 9-21, 21-12, 21-6తో చైనీస్ తైపీ హువాంగ్ యి కాయ్‌పై నెగ్గి క్వాలిఫయర్ హోదాలో మెయిన్ డ్రాలోకి ప్రవేశించాడు. మెయిన్ డ్రా తొలి రౌండ్‌లో ఆరో సీడ్, చైనా ప్లేయర్‌లు గ్వాంగ్ జు తో శ్రీకాంత్ తలపడతాడు. ఇక గత వారం థాయ్‌లాండ్ ఓపెన్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్ వరకూ దూసుకెళ్లిన హైదరాబాదీ ప్లేయర్ మన్నెపల్లి తరుణ్ ఈ టోర్నీలో నిరాశ ఎదురైంది. క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లోనే వెనుదిరిగాడు. తరుణ్ 13-21, 21-23తో థాయ్‌లాండ్‌కు చెందిన పనిత్ చఫోన్ తీరారత్‌సకుల్ చేతిలో ఓడిపోయాడు. భారత్‌కే చెందిన మరో ప్లేయర్ శంకర్ ముత్తుస్వామి 20-22, 20-22తో చైనాకు చెందిన జు జువాన్ చెన్ చేతిలో పరాజయం పాలయ్యాడు. కాగా మహిళల సింగిల్స్‌లో భారత్ రైజింగ్ స్టార్ అన్‌మోల్ ఖరబ్ క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. అన్‌మోల్ 14-21, 18-21తో చైనీస్ తైపీకి చెందిన హుంగ్ యి టింగ్ చేతిలో ఓటమి చవిచూసింది. మిక్స్‌డ్ డబుల్స్ క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో మోహిత్-లక్షిత జగ్లాన్ ద్వయం 15-1, 16-21తో చైనీస్ తైపీ మింగ్ యాప్ టూ-లీ యు షాన్ జంట చేతిలో ఓడిపోయింది.

# వాణిజ్యం

## యుఎస్ టారిఫ్‌ల ప్రభావాన్ని తట్టుకునే స్థితిలో భారత్: మూడీస్

**వాషింగ్టన్, మే 21:** అమెరికా సుంకాల ప్రభావం, ప్రపంచ వాణిజ్య అంతరాయాల ప్రతికూలతలను తట్టుకునే స్థితిలోనే భారత్ ఉందని ప్రముఖ రేటింగ్ సంస్థ మూడీస్ తెలిపింది. దేశీయ వృద్ధికి ప్రోత్సాహకాలు, ఎగుమతులపై తక్కువ ఆధారపడటం తదితర అంశాలే అందుకు కారణమని వివరించింది. భారత్‌లో తయారీ సామర్థ్యాన్ని విస్తరించడానికి, ప్రైవేట్ వినియోగాన్ని పెంచడానికి, మౌలిక సదుపాయాల కల్పనపై వ్యయాన్ని పెంచడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు దోహదం చేస్తున్నాయని మూడీస్ వెల్లడించింది. ద్రవ్యోల్బణాన్ని తగ్గించడం, ఆర్థిక వ్యవస్థను మరింత ప్రోత్సహించడానికి వడ్డీ రేట్ల తగ్గింపు లాంటి చర్యలు చేపడుతోందని తెలిపింది. అమెరికా సుంకాలు, ప్రపంచ వాణిజ్య అంతరాయాలను ఎదుర్కోవడానికి ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల కంటే.. భారత్ మెరుగైన స్థానంలో ఉంది. దీనికి బలమైన అంతర్గత వృద్ధి, గణనీయమైన దేశీయ ఆర్థిక వ్యవస్థ, ఇతర దేశాలపై తక్కువ ఆధారపడటం వంటివి దోహదం చేస్తున్నాయి అని మూడీస్ తన నివేదికలో పేర్కొంది. భారత్ కంటే పాకిస్థాన్ వృద్ధిపైనే ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తాయని మూడీస్ వెల్లడించింది. పాకిస్థాన్‌తో భారత్‌కు ఆర్థిక సంబంధాలు తక్కువ స్థాయిలో ఉన్నాయి. సరిహద్దుల్లో ఉద్రికత్తలు పెరిగినప్పటికీ.. భారత ఆర్థిక కార్యకలాపాలకు పెద్ద అంతరాయాలు ఉండవని మేం ఆశిస్తున్నాం. మరోవైపు భారత్‌లోని వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో ఎక్కువ ఉత్పత్తి చేసే ప్రాంతాలు ఘర్షణ ప్రాంతాలకు దూరంగా ఉన్నాయి అని మూడీస్ వివరించింది. అయితే అధిక రక్షణవ్యయం భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపింది. వాణిజ్య చర్చలు ఫలవంతమైతే భారత ఉత్పత్తులు అమెరికాకు భారీగా ఎగుమతి అవుతాయని అంచనా వేసింది.



## మూడు రోజుల నష్టాలకు బ్రేక్..

**ముంబై, మే 21:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. వరుసగా మూడు ట్రేడింగ్ సెషన్ల నుంచి నష్టాలు చవిచూసిన సూచీలు.. నేడు ఓ మోస్తరు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఓ దశలో 800 పాయింట్ల మేర లాభపడింది. రియల్టీ, ఫార్మా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఆటో, బ్యాంక్, ఎఫ్ఎంసీజీ షేర్లు కూడా రాణించడం సూచీలకు కలిసొచ్చింది. అయితే, విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలపై ఆందోళన కొనసాగుతోంది. మార్కెట్లు మరింత పైకి వెళ్లేందుకు ఇవి అడ్డంకిగా మారొచ్చన్న విశ్లేషణలు వినవస్తున్నాయి. సెన్సెక్స్ ఉదయం 81,327.61 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 82,021.64 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 410 పాయింట్ల లాభంతో 81,596.63 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 129.55 పాయింట్ల లాభంతో 24,813.45 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.64గా ఉంది. బజాజ్ ఫిన్‌సర్వ్, టాటా స్టీల్, సన్‌ఫార్మా, టెక్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్ షేర్లు




ప్రధానంగా లాభ పడ్డాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఐటీసీ, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 66.17 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3,314 డాలర్ల వద్ద స్థిరపడింది.

## 15వేల ఉద్యోగులకు యాక్సెంచర్ ప్రమోషన్లు

**ముంబై, మే 21:** ప్రముఖ ఐటీ సేవల సంస్థ యాక్సెంచర్ గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ ఉద్యోగుల్లో 50 వేలమందికి ప్రమోషన్లు ఇవ్వనుంది. భారత్‌లోని 15 వేల మంది ఉద్యోగులకు ఉద్యోగోన్నతి కల్పించనుంది. కన్సల్టింగ్ సేవలకు డిమాండ్ తగ్గుముఖం పట్టడంతో ఇప్పటికే ప్రమోషన్లు ఆరు నెలలు వాయిదా పడ్డాయి. ఉద్యోగుల్లో మనోస్థైర్యాన్ని నింపేందుకు జూన్‌లో ప్రమోషన్లు ఇవ్వనుంది. ఈ మేరకు ఇంటర్నల్ మెమోలు పంపుతోందని ఒక నివేదిక పేర్కొంది. భారత్‌లో 15 వేలు, యూరప్‌లో 11 వేలు, పశ్చిమాసియా, ఆఫ్రికాలో కలిపి 11వేలు, అమెరికాలో 10 వేల మంది చొప్పున ప్రమోషన్లు ఇవ్వనున్నట్లు కంపెనీ తమ సిబ్బందికి పంపిన అంతర్గత సమాచారంలో తెలిపింది. ప్రస్తుతం యాక్సెంచర్‌లో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 8 లక్షల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. మొత్తం సిబ్బందిలో జూన్‌లో 6 శాతం మంది సిబ్బంది ప్రమోషన్లు అందుకోనున్నారు. వాస్తవానికి డిసెంబర్‌లోనే ప్రమోషన్ల ప్రక్రియ జరగాల్సి ఉంది. కీలక విభాగల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు బేస్ పే పెరగనుంది. అయితే బోనస్, పని తీరు ఆధారిత ఈక్విటీపై డిసెంబర్‌లో నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించింది. కొవిడ్ సమయంలో ఐటీ సేవలకు వచ్చిన డిమాండ్‌కు అనుగుణంగా యాక్సెంచర్ కూడా ఇతర కంపెనీల తరహాలో పెద్ద సంఖ్యలో ఉద్యోగుల్ని నియమించుకుంది. ఐటీ సేవలకు ఆశించిన స్థాయిలో డిమాండ్ లేకపోవడంతో 2023లో ఏకంగా 19 వేల మందిని తొలగించింది.




## వ్యాపారంలో తొందరపాటు వద్దు: విశాల్ మార్ట్

**చెన్నై, మే 21:** కోల్‌కతాలోని ఒక సాధారణ కుటుంబంలో జన్మించిన రామ్ చంద్రఅగర్వాల్ నాలుగేళ్ల వయసులో పోలియో బారిన పడ్డాడు. అతని శరీరంలోని ఒక కాలు పనిచేయడం మానేసింది, నడకకు చెక్క కర్రలే ఆధారంగా మారాయి. కానీ రామచంద్ర ఓటమిని అంగీకరించే మనస్తత్వం కాదు. చదువు పూర్తి చేసినా 9 నుండి 5 గంటల ఉద్యోగం తనతో కాదని తెలుసుకున్నాడు. దీంతో అప్పుగా తీసుకున్న డబ్బుతో కోల్‌కతాలో ఒక చిన్న ఫోటో స్టూడియో షాపు ప్రారంభించాడు. ఒక సంవత్సరం పాటు ఫోటో స్టూడియో నడిపినా అది అతనికి సంతృప్తి ఇవ్వలేదు. కూల్ డ్రింక్స్ అమ్మాడు కానీ పెద్దగా లాభాలు రాలేదు. అప్పుడు అతని దృష్టి ఫాబ్రిక్ వ్యాపారం వైపు మళ్లింది. కోల్‌కతాలో చిన్న బట్టల వ్యాపారం ప్రారంభించాడు. దాదాపు 15 సంవత్సరాలు బట్టల వ్యాపారం చేసినా అతని మనసు ఏదైన పెద్దగా చేయాలని కోరుకునేది. అందుకే, అన్నింటినీ వదిలేసి ఢిల్లీకి వచ్చాడు. 2001-02 సంవత్సరంలో రామ్ చంద్ర అగర్వాల్ ఢిల్లీ నుండి తన డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన విశాల్ మెగా మార్ట్ను ప్రారంభించాడు. దేశంలోని మధ్యతరగతి, పేద ప్రజలే లక్ష్యంగా ఒక కొత్త స్టోర్ సృష్టించాడు. కేవలం రూ.99కే నిత్యావసర వస్తువులు, బట్టలు అమ్మడం ద్వారా విశాల్ మెగా మార్ట్ ప్రజల హృదయాల్లో మంచి స్థానం సంపాదించుకుంది. దీంతో విశాల్ మార్ట్ వేగంగా విస్తరించింది. 414 నగరాల్లో 645 స్టోర్లు, 2,50,000 చదరపు అడుగుల రిటైల్ స్థలం, ఐదు గోడౌన్లు విశాల్ మార్టును రోజురోజుకు ముందుకు నడిపించాయి. 2007లో కంపెనీ రూ.2000 కోట్ల విలువైన ।శివీను ప్రారంభించింది. స్టాక్ మార్కెట్‌లో కూడా విశాల్ మెగా మార్ట్ పేరు చేరింది. అయితే వేగంగా అభివృద్ధి చెందాలనే పోటీ, తొందరపాటుతో తీసుకున్న తప్పుడు నిర్ణయాలు విశాల్ మెగా మార్ట్‌ను నష్టాల్లోకి నెట్టాయి. ఎటువంటి అంచనా లేకుండానే స్టోర్లు, గోడౌన్లు తెరవడం వల్ల కంపెనీపై అప్పుల భారం పెరిగింది. దానికి తోడు 2008 ఆర్థిక మాంద్యం కంపెనీని తీవ్రంగా దెబ్బతీసింది. స్టాక్ మార్కెట్‌లో వచ్చిన ప్రకంపనలను విశాల్ మెగా మార్ట్‌కు భారీ నష్టాలను కలిగించింది. దీంతో కంపెనీపై అప్పుల భారం రూ.750 కోట్లకు చేరుకుంది. 2011లో విశాల్ మెగామార్ట్ ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయింది. రూ.750 కోట్లకు పైగా అప్పులు పేరుకుపోయాయి. బ్యాంకులకు, అప్పు ఇచ్చినవాళ్ళకి కట్టడానికి కూడా డబ్బు కొరత ఏర్పడింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో విశాల్ మెగా మార్ట్‌ను కాపాడటానికి అగర్వాల్ కంపెనీని అమ్మాలని నిర్ణయించుకున్నాడు. రూ.1100 కోట్ల విలువైన కంపెనీని కేవలం రూ.70 కోట్లకే శ్రీరామ్ గ్రూప్ అండ్ టిపిజి కేపిటల్‌కు అమ్మసాడు.





## భారత్‌లో ఫాక్స్‌కాన్ రూ.12,500 కోట్ల పెట్టుబడులు

**ముంబై, మే 21:** తైవాన్‌కు చెందిన టెక్ దిగ్గజం ఫాక్స్‌కాన్ మరోసారి భారత్‌లో భారీగా పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. ఐఫోన్ తయారీకి కీలక సరఫరాదారుగా ఉన్న ఈ సంస్థ, తాజాగా 1.5 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 12,500 కోట్లు) పెట్టుబడిని భారత్‌లో చేసినట్లు తెలిపింది. ఈ పెట్టుబడిని ఫాక్స్‌కాన్ యొక్క సింగపూర్ కేంద్రితయూనిట్, భారత ఉపకంపెనీ అయిన యూజాన్ టెక్నాలజీ ఇండియాలో 12.7 బిలియన్ షేర్ల కొనుగోలు రూపంలో పెట్టినట్లు వెల్లడించింది. ఇప్పటికే తమిళనాడులో స్మార్ట్‌ఫోన్లకు అవసరమైన విడి భాగాలను తయారు చేస్తోంది. ఆపిల్ సంస్థ కోసం ఐఫోన్ భాగాలను తయారు చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ యూనిట్‌కి ఇప్పుడు మరింత విస్తరణపై దృష్టి సారించింది. చైనాకు ప్రత్యామ్నాయంగా భారత్‌ను తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న ఆపిల్ వ్యూహంలో భాగంగానే ఈ భారీ పెట్టుబడులను ప్రకటించింది. కాగా గత వారం ఫాక్స్‌కాన్- హెచ్‌సిఎల్ గ్రూప్ జాయింట్ వెంచర్‌కు నోయిడా విమానాశ్రయం సమీపంలో సెమీకండక్టర్ ప్లాంట్ నిర్మాణానికి భారత ప్రభుత్వం అనుమతిని మంజూరు చేసింది. రూ.3,700 కోట్లతో నిర్మించనున్న ఈ ఫ్యాక్టరీలో మొబైల్ ఫోన్లు, ల్యాప్టాప్లు, ఆటోమొబైల్, పీసీలు మొదలైన పరికరాల కోసం డిస్‌ప్లే డ్రైవర్ చిప్‌ల తయారీకి కీలక కేంద్రంగా మారనుంది. ఈ ఫ్యాక్టరీ ప్రతినెల 20,000 వెఫర్లు తయారు చేయగలదు. నెలకు 36 మిలియన్ యూనిట్ల అవుట్‌పుట్ సామర్థ్యం గల కెపాసిటీతో ఉంది. ఇది భారత్‌లో సెమీకండక్టర్ రంగంలో వస్తున్న వేగవంతమైన పురోగతికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ప్రస్తుతం భారతదేశ వ్యాప్తంగా 5 సెమీ కండక్టర్ యూనిట్లు చివరి దశలో ఉన్నాయి. ఫాక్స్‌కాన్ ఈ 6వ యూనిట్‌ను ప్రారంభించడంతో, భారత్ టెక్నాలజీ స్వావలంబన దిశగా మరింత ముందడుగు వేయబోతుందని తెలుస్తోంది. వీటితో పాటు మెర్క్, లిండే, ఎయిర్ లిక్విడ్, ఐకాక్స్ వంటి కెమికల్, గ్యాస్ సరఫరాదారులు కూడా భారత్‌లో తమ సామర్థ్యాన్ని విస్తరిస్తున్నాయి. ఇక విద్యా, స్టార్టప్ రంగాల్లో శేష చైతన్యం కనిపిస్తోంది.




## టెలిగ్రామ్ సిఇఒ దేశం విడిచి వెళ్లడానికి వీల్లేదు.. ఫ్రాన్స్

**ముంబై, మే 21:** ముందస్తు అనుమతి లేకుండా టెలిగ్రామ్ సిఇఒ పావెల్ దురోవ్ ఫ్రాన్స్ విడిచి వెళ్లేందుకు అధికారులు నిరాకరించాయి. ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్‌తో చర్చల కోసం అమెరికా వెళ్లాని దురోవ్ ఇటీవల అధికారులను విజ్ఞప్తి చేశారు. అయితే ఆయన అభ్యర్థనను పారిస్ ప్రాసిక్యూటర్ కార్యాలయం తోసిపుచ్చింది. పొలిటికో తెలిపిన వివరాల ప్రకారం, దురోవ్ ప్రతిపాదిత యుఎస్ పర్యటనను ఉటంకిస్తూ ఫ్రెంచ్ ప్రాసిక్యూటర్లు ఈ పర్యటనకు కచ్చితంగా వెళ్లాలనేలా ఎలాంటి కారణాలు లేవు అని ఇటీవల తీర్పు ఇచ్చారు. 2024 ఆగస్టులో ఫ్రెంచ్ విమానాశ్రయంలో అరెస్టయినప్పటి నుంచి దురోవ్ ఎదుర్కొంటున్న న్యాయపరమైన అడ్డంకులను అనుసరించి ఈ నిర్ణయం తీసుకున్నారు. అరెస్టు చేసినప్పటి నుంచి ఆయనను కఠినమైన చట్టపరమైన నియంత్రణలో ఉంచారు. దురోవ్ సహ వ్యవస్థాపకుడిగా ఉన్న టెలిగ్రామ్‌లో జరుగుతున్న చట్టవ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన తనపై ఆరు క్రిమినల్ అభియోగాలు మోపారు. టెలిగ్రామ్ సిఇఒపై వచ్చిన అనేక అరోపణల్లో ప్రధానంగా టెలిగ్రామ్‌ను మనీలాండరింగ్, పిల్లలపై లైంగిక వేధింపులు వంటివి ఉన్నాయి. రష్యాలో జన్మించిన పారిశ్రామికవేత్త దురోవ్‌కు ఫ్రాన్స్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రెండింటిలోనూ పౌరసత్వం ఉంది. నిర్దిష్ట అనుమతులు లేకుండా ఫ్రాన్స్ విడిచి వెళ్లడానికి వీల్లేదని నిషేధం విధించారు. ఫ్రాన్స్ అధికారులు 2024 ఆగస్టులో ఫ్రెంచ్ విమానాశ్రయంలో దురోవ్‌ను అరెస్టు చేశారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.